ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక

6-12-50



విషయానుక్రమణిక

6 డిశంబరు 1950



ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder : K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 13

వికృతి సంవత్సర కార్తీక బహుళ ద్వాదశి బుధవారము



ఇంటిపొదుపు

ప్రభుత్వోద్యోగాల్లో సిబ్బందిని తగ్గించినందువల్ల పెద్దగా మిగిలేదేమీ ఉండదని శ్రీ రాజగోపాలాచారి గారు పార్లమెంట్ లో ప్రకటించారు. —నేషనల్ హెరాల్డ్.

కరువులు, కంట్రోల్స్

స్వయం సమృద్ధి

ఈ యేడాది సంభవించిన తుపాన్లు, వరదలు, అనావృష్టి, భూకంపాలవల్ల వచ్చే యేడాది 60 లక్షల టన్నుల ఆహారధాన్యం కొరవాతుందని కేంద్ర ఆహార శాఖామంత్రి మున్షీగారు అన్నారు అయినాసరే 1952 మార్చి 31 తరవాత ఒక్క గింజ దిగుమతి చెయ్యబోవడం లేదనీ, ఆ తేదీకి భారత రిపబ్లిక్ ఆహారాన్ని కావలసినంతా స్వయంగా పండించుకు తీరాలనీ కూడా అన్నారు అయితే ఈ దీక్షకి మూడు "తప్ప" లున్నాయి ఆ తప్పల్ని డిప్యూటీమంత్రి తిరుమలరావుగారు వివరించారు

1 బొత్తిగా పంటలు మరీ ధ్వంసమైపోయే పక్షంలోనూ, 2 జాతీయావసరాల నిమిత్తం వేరే యెక్కడికో పంపించేసే ఆహారవస్తువుల స్థానే భర్తీచెయ్యవలసిన పక్షంలోనూ 3 ఎక్కడ ఏ యిబ్బంది వచ్చినా తట్టుకోడంకోసం కేంద్రప్రభుత్వం నిలవచెయ్యగల ధాన్య పురాసుల్ని దిగుమతి చేసుకోడానికీ తప్ప ఇతరత్రా, రోజువారీ జనం తిండికోసం ఆహార వస్తువుల్ని, ఇటు సూర్యుడు అటు పొడిచినాసరే దిగుమతి చెయ్యరన్నమాట

అయితే పైనచెప్పిన తప్పలు నిత్యం మనతోనే ఉన్నాయి కాబట్టి దిగుమతి చెయ్యరనే భయం మరిపెట్టుకోనవసరంలేదు ఈ తప్పవిసరి మళ్ళీ యేడాది యెల్లా రావాలో, ఈ లోగా మున్షీగారూ, నెహ్రూగారూ పట్టిన దీక్ష విడవకుండా ఎల్లా అంటిపెట్టుకునివుండాలో, మన అగికాహారోత్పత్తికార్యక్రమం జయించిందని జనానికి ఎల్లా నచ్చచెప్పాలో తేల్చుకోడానికిగాను అన్ని రాష్ట్రాల ఆహారశాఖా మంత్రులూ, కేంద్రప్రభుత్వ ఆహారశాఖ అధ్వర్యంకింద బొంబాయిలో సమావేశమౌతున్నారు ఇంతటి గడ్డుసమస్యని పరిష్కరించాలంటే మున్షీగారికి స్థానబలం కావలసివచ్చింది కాబోలు. సమావేశం బొంబాయిలో ఏర్పాటయింది.

బర్మా బియ్యం

బర్మాలో అమ్మడానికి బోలెడు బియ్యం ఉండగా, దేశాన్ని ఇలా మాడ్చక పోతే దిగుమతి చెయ్యకూడదా అని చెట్టినాడురాజాగారంటున్నారు 1952 మార్చి 31 నించి మాకు ఎవరిబియ్యమూ, ఎవరి గోధుమలూ, ఎవరి జొన్నలూ, అక్కర్లేదని ఇప్పటినించీ మోతకొడుతోంటే ఈ ఒక్క ఏడాదికోసం బర్మాకాని మరే దేశంకాని మనతో వర్తకం చేస్తాయనుకోడానికి వీల్లేదు ఎక్కడా అమ్ముడు కాకపోతే అప్పుడు వాళ్లు మనగుమ్మంలో పారపోస్తారేమో కాని ఇప్పుడప్పుడే ఆ ఆశ లేదు బర్మానించి బియ్యం కొనుక్కోక పోతే వాళ్లు మనదగ్గిరనుంచి చివరికి లుంగీలైనా కొంటారా అనేది అనుమానం అమెరికా మనతో వాణిజ్యపు ఒడంబడిక చేసుకోలేదంటే ఇటువంటి సమస్యలు అడ్డుపడ్డంవల్లనే

కంట్రోల్

ఆహారవస్తువుల పైన కంట్రోల్స్‌ని ప్రభుత్వం ఎలా నిర్వహిస్తున్నదీ, దేశంలో పరిస్థితులదృష్ట్యా వాని అవసరం, మొదలైన అంశాల్ని పరిశీలించి నివేదించడానికి పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ పండిట్ ఠాకూర్దాస్ భార్గవాగారి అధ్యక్షతకింద ఒక కమిటీని నియమించింది భార్గవా కమిటీవారు క్రమంగా కంట్రోల్స్‌ను సడలిస్తూ చిట్టచివరికి ఎత్తెయ్యాలని సూచించారు కంట్రోల్స్ తొలగించకూడదనీ, కాని క్రమంగా తొలగించడానికి ప్రభుత్వం ఒక క్రమవిధానాన్ని అనుసరించాలనీ వీరు సూచించారు

కంట్రోల్‌తో ఉన్న ఇబ్బంది ఏమిటంటే అది ఉంటే ఒక బాధ, లేకపోతే మరొకబాధ. ఆహారవస్తువుల సేకరణ, అమ్మకంధరల నిర్ణయం మొదలైనవి ఉండకపోతే, ధనమున్నవాళ్ళు నిలవచేసి ఎక్కువ ధరలకమ్మి ధరలు మతిమీరిపోయి జనసామాన్యానికి ఆహారం నోటికందకుండా గగనంలో విహరించే ప్రమాదం ఉంది కంట్రోల్ అనేది ఉంటే ప్రభుత్వోద్యోగుల ప్రజ్ఞవల్ల కాబోలు పరిస్థితులు అతివిచిత్రంగా పరిణమిస్తున్నాయి ఈమధ్య రేషన్లు ఇవ్వడానికి బియ్యంలేక జిల్లాకలెక్టర్లు గిజగిజలాడిపోయారు. (కొందరింకా గిజగిజలాడుతున్నారు) ఆహారాన్ని ఎప్పుడో దిగుమతి చేసుకుంటే కాని ఫసలీ గడవని తిరువాన్కూరుసంస్థానంలో నాలుగురోజులు రేషన్లు ఇవ్వకపోయినా, ప్రజలకి బియ్యం నిక్షేపంగా దొరికాయట రేషనింగ్ అక్కర్లేదని బేపూచీరేషనింగ్ అనేది ఒకటిపెట్టి అటూ ఇటూ కాకుండాచేసి తెలుగుబస్తీల్లో రేషన్లు లేక, పూల్స్ నిండుకుని ఎక్కడా దొరక్క తిండిలేక ప్రజలు నానాబాధలూ పడ్డారు. దక్షిణాదినంతనీ పోషించగలిగే సర్కారుజిల్లాల్లో మన మంత్రులు, ఉద్యోగులూ ఏకమై కరువు తెచ్చిపెట్టారు

ప్రభుత్వం ప్రదర్శించే ఈ సర్కస్ చూస్తే కంట్రోలువల్ల ప్రయోజనం లేకపోగా బాధ ఎక్కువగా కనిపిస్తోంది

కంట్రోల్ ఉంటే పండించే వాళ్లు, లేకపోతే పండించనివాళ్లు ఆకలితో చావవలసివస్తోంది. ఈ రెండింట్లో ఏది కావాలి?

[సీతారామ్]

ముప్పుతిప్పల ముకుందరావ్

(ఐ. పి)

అంగారకుడు

వెన్నటి దీపావళికి బొంబాయి నించి మాస్నేహితుడి తండ్రి ఒకాయన ఇక్కడకు వచ్చాడు. బొంబాయి రాష్ట్రంలో ఉద్యోగంచేసి రిటైరయినా డాయన. నాలుగు నెల్ల పాటు ఇక్కడే ఉండాలని అనుకుని, ఆ నాలుగు నెలలూ పెన్షన్ ఇక్కడే తీసుకోవాలని అనుకున్నాడు. పెన్షన్ట్రాన్స్ఫర్ చేయటానికి ఈవూళ్ళో ఒక జె. పి. (జస్టిస్ ఆఫీస్) సర్టిఫికేట్ ఇవ్వవలసివచ్చింది.

జె. పి. గారు ఎక్కడ కనిపిస్తారా అని విచారించగా ఒకాయన ఫలానా వీధిలో ఉన్నట్లు తెలిసింది. ఇంటి నంబరు సరీగా తెలియకపోవటాన, వీధి మొదట్లో ఒకాయన్ను ఫలానా జె. పి. గారి ఇల్లెక్కడండీ అని అడిగాను. ఆయన ఒక ఇల్లు చూపించాడు.

లోపల ఒక పెద్దమనిషి ఆహ్వానించి కూర్చోపెట్టాడు. నేను నా సొద వెళ్లబోసుకున్నాను. అంతా విని ఆయన పకాలున నవ్వాడు.

"నా సర్టిఫికేట్ తీసుకుని వెడితే మీ స్నేహితుడికి మొదటికే మోసం వస్తుందేమో" అన్నాడాయన నవ్వుతూ.

నేను ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని చూస్తున్నాను.

"నేను ఫలానా జె. పి. గారి ననుకుంటున్నట్లున్నది. నాపేరు ముప్పుతిప్పల ముకుందరావు ఐ. పి.-అంటే ఇన్సాల్వెన్సీ పిటీషనర్ అన్నమాట."

నేను నోరు తెరవటమే కాక నిలువుగుడ్లను కూడా వేశాను.

"జె. పి. గారిల్లు ఇక్కడ నించి మూడోదే. ఆయన సాయంత్రందాకా రారు. కాసేపు కూర్చుని వెళ్లండి." అన్నాడు.

"నేను పత్రికవాడినని తెలుసా?"

"ఆ! విశ్వరూపం విలేకరులని కూడా తెలుసు. అయితే యేం మింగేస్తారా?" అన్నాడాయన నవ్వుతూ.

* * * *

"అయితే మీరు ఐ. పి. అన్నమాట" అన్నాను. ఏమీ తోచక.

"అవునండీ. దివాలా చక్రవర్తిని. అప్పుల వాళ్లపాలిటి అపర యముణ్ణి."

"మీ తారక మంత్రం మాకు కూడా ఉపదేశించండి బాబూ! చచ్చిపోతున్నాం."

"ఎక్కడ మొదలుపెట్టాలో, ఎక్కడ ముగించాలో నాకు తెలియదు. కనుక మీరే నాలుగుప్రశ్నలు వేయండి."

"జనం చూస్తూ చూస్తూ అప్పులవాళ్ల బంధాల్లో ఇరుక్కుంటారు దేనికండీ?"

"అందరికీ చేతినిండా పనీ, కడుపునిండా తిండీ ఉన్నరోజుల్లో అప్పులు తీసుకోవలసిన అవసరం ఎక్కువ ఉండేది కాదు. అయితే బొత్తుగా లేదని మాత్రం చెప్పను. చేతిపనులు యంత్రాలకు దారి ఇచ్చిన తరవాత, డబ్బు కొద్ది మందిదగ్గరే చేరటం మొదలుపెట్టింది. మిగిలినవాళ్లు సంపాదించేది చాలక అప్పులకు దిగుతున్నారు."

"అయినా, అందులో ఉన్న ఇబ్బందుల్ని గుర్తించారా?"

"గుర్తించకేం? అన్నీ తెలిసే, ఇంకో దారి లేకపోవటాన ఆ మార్గాన్ని అవలంబిస్తారు. అక్కడిదాన్ని ఇక్కడికీ, ఇక్కడిదాన్ని అక్కడికీ, సర్ది పిల్లిమీద ఎలుకనూ, ఎలుకమీద పిల్లినీ ఎక్కించక పోతే, వాళ్ళపొయ్యిలో పిల్లి లేవదు. అయితే చిక్కులు తెలిసే ఉండటంవల్ల, అప్పుతీసుకున్నప్పటినుంచి ఎగనామం పెట్టటం ఎట్లాగా అనే ఆలోచిస్తూ ఉంటారు."

"ఈ నియమం అందరికీ వర్తిస్తుందా?"

"ఆహా! వ్యక్తులకే కాదు. పెద్దపెద్ద సామ్రాజ్యాలకే వర్తిస్తుంది. రవి తన సామ్రాజ్యంలో అస్తమించడని చెప్పుకు నేరోజుల్లోనే బ్రిటన్ బాకీలు ఉన్నవారి లెక్క చెప్పటం కష్టంగాఉండేది. \ ఇప్పుడు అడగనే అక్కర్లేదు."

"వడ్డీలు ఎన్నిరకాలండీ?"

"నాలుగు. బారువడ్డీ, చక్రవడ్డీ, సున్నావడ్డీ, హళ్లీవడ్డీ.?

"ఏమిటండోయ్ కొత్తవాటిని కూడా చెపుతున్నారు!"

"కొత్త యేమున్నదండీ! సున్నావడ్డీ అంటే, నోటులో ఎంతవడ్డీని రాసినప్పటికీ, వడ్డీమాట దేవుడెరుగు, అసలునైనా ఇప్పించవయ్యా బాబూ" అని షావుకార్లు కాళ్లా వేళ్లాపడగా, చెల్లించేవడ్డీ అన్నమాట. హళ్లీవడ్డీ అంటే, వడ్డీతోపాటు అసలుకుకూడా సున్నా చుట్టటమన్నమాట." అన్నాడాయన నవ్వుతూ.

"ఇట్లాగే అప్పులిచ్చేవాళ్లల్లో కూడా వేరు వేరు తరహాలవాళ్లున్నారా?" అన్నాను నేనుకూడా నవ్వుతూ.

"ఓ! చాలమంది ఉన్నారు. అప్పులవాళ్లు, చెప్పులవాళ్లు అన్న సామెత ఉన్నది చూశారూ, అసలది అప్పులిచ్చేవాళ్లని పట్టే ఏర్పడ్డది."

"ఇదేదో మామూలుపద్ధతికి భిన్నంగా ఉన్నది. కొంచం మీరు వివరించాల్సిందే."

"ఏముందీ? అప్పులిచ్చేవాళ్లు నానా గోత్రాలవాళ్లూ ఉంటారు. ఒక్కొక్క జాతివాడు ఒక్కొక్కరకం చెప్పుల్ని వాడతాడు."

"ఇప్పటికి మీ లెక్కలో ఎన్ని రకాల వాళ్లు తేలారు?"

"కిర్రుచెప్పుల తెలుగుషావుకారు, చంకీ చెడావుల మార్వాడీ, కాబూలీ చెప్పుల కాబూలీవాడు, చెప్పులే అక్కర్లేని నాటుకోటుసెట్టి-వీళ్లంతా నాటురకాలు. ఇంక సీమసరుకులో పేటెంట్ షూల బ్రిటిష్‌షావుకారూ, ప్లాస్టిక్ షూల అమెరికన్ షావుకారూ, చెప్పుకోతగ్గవాళ్లు."

"వీళ్లదెబ్బ - క్షమించండి - మీదెబ్బ వీళ్లకేమయినా తగిలిందా?"

"నాటురకాలంతా మనతడాఖా చూసినవాళ్ళే. ఇంక తెల్లవాళ్ల సంగతి. వాళ్లు దేశాలకి దేశాలనే ముంచుతారుకాని నాబోటివాళ్లజోలికి రారు."

"వేసుకున్న చెప్పులమోస్తరే వాళ్ల వ్యవహారంకూడా మారుతూఉంటుందా?"

"అవును. మారుతునేఉంటుంది. తెలుగుషావుకారూ, మార్వాడీ షావుకారూ ఎక్కువగా కోర్టులమీదనే ఆధారపడతారు. కాబూలీవాడు జబ్బపుష్టిమీద

ఆధారపడతాడు నాటుకోటుసెట్టి కోర్టుల్నీ, కాడీలనూ కూడా ఉపయోగించుకుంటాడు తెల్లషావుకార్లు కమ్యూనిస్టులమీద కత్తికట్టే యావన్మందినీ ఉపయోగించుకుంటారు ”

“మనదేశంలో కాబూలీవడ్డీవ్యాపారస్తులమీద ఆ మధ్య నిషేధాలు విధించారెందుకండీ?”

“వాళ్లసలు బందిపోటుమురాలు కొన్నాళ్లు సరిహద్దుప్రాంతంలో దాళ్గ కొట్టటం, కొన్నాళ్లు మనప్రాంతంలో వడ్డీ వ్యాపారం చేయటం వాళ్లకి అలవాటయిపోయింది, కోర్టులకెక్కని ఆ గర్భాత్రపు గాళ్ళకు ప్రభుత్వం ఉద్వాసన చెప్పింది ”

“అది అన్యాయంకదుటండీ! ఇళ్లు జప్తు చేసి, ముసలీ ముతకా, కుంటీ గుడ్డీ, పిల్లా జెల్లా అని చూడకుండా ఇంట్లోవాళ్ళని వెళ్లగొట్టే ఇతరషావుకార్లు మంచివాళ్లయి, కాబూలీవాళ్లు కాకపోయినారా?”

“కోర్టులకి డబ్బుపొయ్యరుగా? అందుకనే వెళ్లగొట్టారు ఈ మధ్య రాజ్యాంగపరిషత్తులో కొందరు రాజ్యాంగాన్ని విమర్శిస్తూ అది లాయర్లపాలిటి కల్పవృక్షం అన్నారిందుకనే ”

“అప్పు పుచ్చుకునేవాళ్లకూ, ఇచ్చేవాళ్లకూ సంబంధ బాంధవ్యాలు ఎట్లా ఉంటయ్?”

“చాలా తమాషాగా ఉంటయ్ అప్పుఇచ్చేనాడు ఆప్తమిత్రుడుగా కనిపించే ఋణదాత, అడగవచ్చేనాటికి అపర యముడయిపోతాడు “ఇంకొంత అవసరమయితే పట్టుకెళ్లవయ్యా, అనుమాన మెందుకు?” అని తియ్యటి కబుర్లుచెప్పే ఆసామీ, ఆ మరుక్షణంనుంచీ అప్పుతీసుకున్నవాడిని బుక్కాఫకీరుగా చెయ్యాలని ఎత్తులు వేస్తూ ఉంటాడు నోట్లు రాసిన సిరాఅయినా ఎండకముందే తలపట్లకి దిగుతారు ”

“పెళ్లినాటివరకూ బావగారూ, బావగారూ అనుకునే వియ్యంకులు, మర్నాటినుంచీ జావ్ దూర్, జావ్ దూర్ అన్నట్లుగా ”

ముప్పయిరెండు పళ్లూ బైటపెట్టి నవ్వుకున్నారు ముకుందంగారు

“సరిగ్గా అదేమోస్తరు తిరుచుగా అప్పిచ్చినవాడిదే పైచెయ్యి అవుతూఉంటుంది కాని, అప్పుడప్పుడు కొందరు ఉద్దండపిండాలు తూకాన్ని తలకిందులు చేస్తారు,”

“ఏదో మీవంటివాళ్ళన్న మాట.”

హాహ్హాహ్హా! ఆమధ్య మావాడొకడు అప్పుచేశాడు షావుకారు రోజు వేధిస్తూ ఉండేవాడు ఒకరోజున దారిలో నిలబెట్టి అడిగేటప్పటికి, మావాడు ఆయన్ని ఎగాదిగా చూసి “ఇదుగో! చూడు బాబూ. నువ్వు ముళ్ళకంచె మీద గుడ్డపడేశావ్. అది కొంచెం జాగ్రత్తగా తీసుకోవాలిగాని, తొందరపడితే యెట్లా?” అని తాపీగా అన్నాడు. ఆ షావుకారు మళ్లీ అడిగితే ఒట్టు ”

“అంతా అట్లా చెప్పి నిభాయించుకోగలరా?”

“అదీనిజమే ననుకోండి అంతా నిభాయించుకోలేరు కొందరు ఆస్తిపాస్తుల్ని ఎవరి పేరనో పెట్టి, ఐ పి పెట్టి కాళ్లు బారజాపుతారు అప్పులవాళ్లు చాదస్తులయి సర్కార్ హోటలు ఖర్చు పెట్టుకుంటే నాలుగునెల్లు విశ్రాంతి అనుభవిస్తారు దాన్నే దివాలాతీయటం అంటారు ”

“దివాలావల్ల మనిషి విలువా, గౌరవం పోతయ్యేమో!”

“ఏమీ పోవు అసలు వ్యాపారమంటేనే జగత్ దోపిడీ ఈ ఐ పి గాళ్లు తమని దోచేవాళ్లులే అని వ్యాపారస్తులు సర్దుకుని పోతారు మనదగ్గర డబ్బుంటే, జనం అన్ని సద్గుణాలనూ మనకే అంటకడుతుంది పైపెచ్చు దివాలా దివాలాకూ మనిషి విలువ పెరిగిపోతుంది ”

“అందుకే అనుకుంటా, ఏడు దివాలా లెత్తినవారిని వెతికి తెచ్చి పిల్లనియ్యమంటారు ”

“తప్పకుండా అందుకేఅయిఉంటుంది ”

“తెల్లవాళ్లవ్యాపారాన్ని గురించి ఏదో అన్నారు ఏమిటది?”

“తెల్లవాళ్లు మొదట్లో నీగ్రోలను బానిసలుగా అమ్మి, ఎర్ర ఇండియన్లను నరికీ, నల్ల ఇండియన్లను దోచుకునీ, డబ్బును సంపాదించారు ఆ డబ్బుతో ఫ్యాక్టరీలు పెట్టి ఇంకా సంపాదించారు ”

“మీరు సామ్రాజ్యవాదపు చరిత్రను ఏకరువు పెడుతున్నారు ”

“సామ్రాజ్యవాదమంటే ధనాభివృద్ధి ప్రయత్నాలే బ్రిటిష్ సామ్రాజ్యం ఉన్నది ఇంపీరియల్ ప్రిఫరెన్సులకోసమేగా?”

“సరే, తరవాత చెప్పండి ”

“తెల్లదేశాలు తమదగ్గరి డబ్బును పెట్టుబడి పెట్టటంకోసం ప్రపంచమంతా తిరిగినయ్ చైనావంటి దుర్బలదేశాలకు తుపాకీ చూపించి అప్పుతీసుకునేటట్లు చేసినయ్ వెనకపడ్డ దేశాలన్నింట్లోనూ తమమాట వినే కీలుబొమ్మలను ఏర్పాటుచేసినయ్ ”

“అప్పులు దొరకటం ఆ దేశాలకు మంచిదేగా?”

“ఆ డబ్బు మనకి లాభం కలిగినట్లు ఉపయోగించటానికి వీలయినప్పుడే మంచిదవుతుంది అందుకని తెల్లవాళ్లు, సొంతజనాన్ని నరకాలని ప్రయత్నించే చాంగ్ కైషేక్, సింగ్మన్ రీలకు అప్పిస్తారే కాని, నిజంగా పైకిరాగల దేశాలకి ఇవ్వరుగా!”

“లేదండీ! ఏవో కొన్ని షరతుల మీద ఇస్తారట ”

“ధ్ధ తెలివితక్కువ వాజమ్మలూ దేశం ఎట్లాయేడిస్తేయేం, మనకి నాలుగు డబ్బులు రాలుతయ్ కదా అనుకునే దగుల్బాజీలూ, తప్ప ఇంకెవ్వరూ వాటికి ఒప్పుకోరు అందుకనే అన్ని దేశాలూ తిరిగి వచ్చిన నెహ్రూ అప్పుమాటయినా ఎత్తకుండా వచ్చారు ”

“సింగ్మన్ రీ లాంటివాళ్లకు ఇచ్చే డబ్బు గంగపాలేమో?”

“కాదు, వాళ్లని ఏదోవిధంగా అధికారంలో నిలబెడితే, తమ డబ్బుకి వెయ్యింతలు తిరిగివస్తుంది అంతగా నష్టమయితే పన్నులు కట్టే మామూలు జనంమీద తోస్తారు ”

“సరే మన తెలుగువాళ్ళ వైఖరి ఏమిటి?”

“చాలా హుషారైన వైఖరి అప్పులైతేనేమిరా మరి పప్పులైతేనేమిరా, అప్పుసల్పా చేసి పప్పుధప్పళమె కొడదామురా అంటారు ”

“అంత బేఫర్వాగా ఉంటారా?”

“సుమతీ శతకం చూడండి తెలుస్తుంది ఊళ్లో ముందు అవసరమయింది అప్పిచ్చువాడేనట ”

“ఋణదాతల్లో గొప్పవాడెవరండీ?”

“విశ్వామిత్రుడు ”

“ఆఁ?”

“అవును అందరికన్నా ఆయనే గట్టి

వాళ్ళు బాకీ రాబట్టటానికి బాకీదారుడే స్వయంగా ఆలుబిడ్డల్ని, తననూ అమ్ముకునేట్లు చేశాడు ”

“ఎట్లా చేయగలిగాడు ?”

“ఫస్ట్ క్లాసయిన ఏజంటుని సంపాదించాడు ఆయనపేరే నక్షత్రకుడు ”

వారు నవ్వాగలేదు

“నవ్వకండి ఒక అపరనక్షత్రకుడి తడాఖా నేను చూశాను నేను నా జన్మలో ఒక్కసారే అప్పునూ చెల్లించాను ఆయన నన్ను ఒక్కమాటకూడా అనేవాడు కాదు కనిపించిన వారల్లా ప్రైకం సంగతి ఏంచేశారు అనేవారు మూడు పూటలా ఇంటిదగ్గర హాజరు చివరికి వాడి బాధ భరించలేకపోయినాను ”

“బాకీవసూలుకి ఇదే మంచి పద్ధతంటారా ?”

“అక్షరాలా ”

ఈ పద్ధతి బాగుందనిపించింది కాని మనకు కావలసింది వేరే విషయం

“ఏమండీ, అప్పుని సంపాదించే టెక్నిక్ ఏమిటి ?”

“మీరన్నదే ఆ టెక్నిక్కే టెక్కు, నిక్కు కలిస్తే టెక్నిక్ అప్పు కావాలంటే ఫెళఫెళలాడిస్తూ! డబ్బంటే లక్ష్యంలేని వాడల్లే నటించాలి అప్పుడే షావుకార్లు ట్రాప్పిలో పడతారు ”

“మన దేశాన్ని ఎదుర్కొనే పెద్దసమస్య ఏమిటి ?”

“అప్పుల బాధ జనసామాన్యం అప్పులతో బాధపడుతున్నప్పుడు వాళ్ళు చేయగలిగేది సేవింగ్ కాదు షేవింగే ”

“ప్రభుత్వం డెట్ రిలీఫ్ ఆక్టు పెట్టిందిగా !”

“మనవాళ్లు ఏదిచేసినా అంతే వడ్డీ తగ్గించమన్నారే కాని అసలు అప్పిచ్చే నాథుడేడీ ?”

“కోఆపరేటివ్ బ్యాంకులు పెడుతున్నారుగా ?”


“మీరు వాటిల్లో ఎప్పుడూ అప్పు తీసుకోలేదన్నమాట దేశంలో యావత్తు వ్యవహారాలూ ఆపద్ధతిలో నడిస్తేనే వాటివల్ల ఉపయోగం ఉండేది ”

“ప్రజలకు మీరిచ్చే సలహా ఏమిటి ?”

“సమర్థులు, ఎడా పెడా అప్పులు తీసుకోవాలి ఈప్రభుత్వం వడ్డీలు తగ్గిస్తే, రేపొచ్చే ప్రభుత్వం వాటిని అసలు కొట్టి పారెయ్యొచ్చు నందో రాజా భవిష్యతి ”

“అసమర్థులో ?”

“జాయింట్ స్టాక్ కంపెనీలూ, లిమిటెడ్ కంపెనీలూ ప్రారంభించి దివాలా ఎత్తించమనండి అదుగో మీ జె పి గారు అప్పుడే వస్తున్నారు ” అన్నారు ముకుందంగారు



కేంద్ర ఆహారశాఖ ఉపమంత్రి శ్రీ మొసలికంటి తిరుమలరావుగారు గోదావరిజిల్లాలో తయారైన ఖద్దరు షాల్కా-గుడ్డను ప్రధాని నెహ్రూగారికి సమర్పించారు నెహ్రూగారి కుమార్తె శ్రీమతి ఇందిరాగాంధీ దానిని స్వీకరించారు

నేటి ప్రపంచం:

ప్రపంచ యుద్ధ ప్రమాదం

విషమపాశం

మూడో ప్రపంచ యుద్ధం తొంగి చూస్తోందని, కొట్ట వస్తున్నదని, వచ్చి మీదపడిపోతోందని సర్వ దేశాల నాయకులూ హడలిపోతున్నారు. ఈ ప్రళయం దానంతట అది రాదు. దేశాల ప్రభుత్వాలే చేతులారా తెచ్చుకుంటే వస్తుంది. తీరా అది వస్తే సర్వనాశనం తప్పదని భయపడే దేశాలు మరి చేతులారా ఎందుకు తెచ్చుకుంటున్నాయి? కోరి తెచ్చుకొనైనా ఉండాలి లేదా కోరకుండానే వారి చేతలవల్ల పరిణమించి ఉండాలి–ఇష్టం లేకపోయినా.

ఒక పెద్దమనిషి చలికాలంలో ఒకరోజు తెల్లవారుజామున మఫ్లర్ మెడకి చుట్టుకున్నాడు. ఒక చుట్టు తిప్పి రెండు కొసలూ ఛాతీమీద వేలవేసుకున్నాడు. ఊరు దాటి వెడుతున్నాడు. ఒక పెద్ద చెట్టుకిందికి వెళ్ళగానే భయం వేసింది.

మఫ్లర్ కొసలు రెండూ గుప్పిళ్ళలో బిగబట్టుకున్నాడు. కంఠానికి అది బిగిసింది. ఏ దెయ్యమో పీక నొక్కేస్తోందని బెదిరిపోయాడు. మఫ్లర్ కొసలు విడవకుండా మరింత బిగించి లాగుతూ పరుగుతియ్యడం మొదలెట్టాడు. చివరికి కంఠానికిపడ్డ ఉచ్చు భరించరానిదయింది. కొంతదూరాన బోరగిలపడి కళ్లు మూసుకుని, లేని దెయ్యానికి దణ్ణంపెట్టాడు. దాంతో ఉచ్చు వీడింది.

ప్రపంచయుద్ధపరిస్థితి సరిగ్గా అలావుంది. చీనాతో యుద్ధానికి దిగితే దరీ అంతూ లేకుండా ఎందుకూ ప్రయోజనం లేని యుద్ధంలో చిక్కుకొని బిగిసిపోతామేమోనని అమెరికన్లు మొదటినుంచీ భయపడుతూనే ఉన్నారు. చీనాతో యుద్ధం వద్దు అంటూనే మంచూరియా సరిహద్దుకి అమెరికన్ సేనలు చేరుకున్నాయి. చేరడంతో చీనా సేనలు ప్రవాహంలా వచ్చిపడ్డాయి.

యుద్ధం

వచ్చిన చీనా సేనలు మెకార్థర్ సేనల్ని రెండుగా చీల్చి మధ్య దారి ఏర్పరచుకున్నాయి. మధ్య నుంచి వచ్చి రెండు పార్శ్వాలనూ ఉన్న అమెరికా స్థావరాల్ని చుట్టుముట్టాలని చీనా సేనల యత్నం. తూర్పున హాంహుంగ్ వొన్సాన్ రేవులకు సమీపించిన చీనా సేనలు అక్కడ పోరాడుతున్న అమెరికన్ సేనలను తప్పించుకు పారిపోవడానికి దారి లేకుండా కట్టేశాయి. అలాగే పశ్చిమాన కూడా చెయ్యడానికి చీనాసేనలు ప్రయత్నిస్తున్నాయి. చుట్టుముట్టడానికి సినాంజూ నగరంపైకి, అంతకు దక్షిణంగా పయాంగ్‌యాంగ్ మీదికి చీనాసేనలు దాడిచేస్తున్నాయి. సినాంజూకి ఉత్తరంగా చిక్కుపడిన అమెరికన్ సైనికులు చచ్చినవారు చావగా మిగిలినవారు చక్రబంధాన్ని తప్పించుకుని పయాంగ్‌యాంగ్ చేరారు. పయాంగ్‌యాంగ్ పైన ముట్టడి ప్రారంభమయిందో లేదో వెంటనే అమెరికన్లు ఈ నగరాన్ని ఖాళీచేసి దక్షిణానికి దారితీస్తున్నారు. వెళ్లేలోగా నగరాన్ని పూర్తిగా ధ్వంసంచేసేశారు.

మళ్లీ 38

అమెరికన్లు అక్కడనుంచిపాత సరిహద్దు 38 వ అక్షాంశరేఖను దాటి పారిపోకపోతే, రెండో ప్రపంచయుద్ధంలో బ్రిటిష్ సేనలు డన్‌కర్క్ వద్ద చేసిన ఘనకార్యమే చెయ్యవలసివస్తుంది. అంటే అడ్డొచ్చే శత్రువులతో పోరాడి ఉన్న సముద్రమార్గాన్ని కాపాడుకుంటూ సైనికులందర్నీ ఓడలెక్కించడం. లేదా కొరికి బుద్ధిచెప్పడానికి బిడియపడకపోతే పూసాన్ వరకూ వెళ్ళి అప్పుడు వెనక్కి తిరిగి చూడవచ్చును.

వడగళ్లవర్షంలాగా బాంబులు కురిపించి సైనిక స్థావరాలూ, జననివాసాలూ అనే వ్యత్యాసం లేకుండా ధ్వంసంచేసి దేశమంతటినీ మట్టంచేసిన అమెరికన్ వీరులికి చీనా సేనావాహిని రావడంతో బాంబులెందుకూ ప్రయోజనం లేకుండాపోయాయి. చీనా సేనల అశ్వదళాల పైన ప్రయోగిస్తే తగినంత ఫలం లేకుండా ఉంటోంది. ఒక ఊరంతటినీ తుడిచిపెట్టగల వది బాంబుల్ని పదిమంది చీనా సైనికుల్ని చంపడానికి ప్రయోగిస్తే, కంట్రాక్టుమీద బాంబులు కొన్నరేటుకి చాలా నష్టం.

దెబ్బకి దెయ్యం

భద్రతామండలి దయవల్ల ఈ యుద్ధం ఆగిపోతుందని ఎవరూ ఆశపడలేదు. అమెరికా తన వైఖరిని మార్చుకుంటే నే యుద్ధం నివారణౌతుందని అందరికీ తెలుసును. అయినా చీనా కమ్యూనిస్టు ప్రభుత్వ ప్రతినిధివర్గం ఏమిచేస్తోందో అందరూ ఆతృతగా నిరీక్షించారు. ప్రతినిధివర్గ నాయకుడు "వూ" వచ్చి, అమెరికా చీనాకి పరమశత్రువని కుండ బద్దలు కొట్టి చెప్పాడు. అయిదు వేల మైళ్ళ దూరాన ఉన్న ఒక దేశంలో అంతర్యుద్ధం తమ దేశానికి, తమ జాతికి, ప్రజాస్వామ్యానికి ముప్పు అని అమెరికన్లు భావిస్తే, పొరుగుదేశంలో ఊళ్లు మట్టం చేసుకుంటూ పొలిమేరలకి సాగివస్తున్న అమెరికన్లనిగురించి చీనా దేశం ఏమనుకోవాలి? అని అడిగాడు. కాబట్టి కొరియానీ, ఫార్మోజానీ అమెరికన్ సేనలూ విడిచిపోవాలన్నాడు. కొరియా నుంచి చీనా సేనలు వెళ్ళిపోవాలనే



వూ, చీనాకమ్యూనిస్టు ప్రతినిధివర్గ నాయకుడు

(46 వ పేజీచూడండి)



వృద్ధజంబుకం

రచన
శ్రీ 'అమరేంద్ర'

"వెండి పన్నెండు తులాలు—"

"అయితే బంగారం ?"

"బంగారమా ? అంతా కలిపినా మూడు తులాలకి మించదు"

"భలేవారు ! ఏం మాటలండీ ? ఈ గొలుసూ, గాజులూ—"

"అవన్నీ దొంగబంగారం ! గిల్టుకీ, బంగారానికీ తేడా తెలుసుకోలేనంత వెర్రివాణ్ణనుకున్నావుట్రా ?" అని తొట్రుపాటులేని తీవ్రస్వరంతో అన్నాడు ధనంజయగుప్త దాంతో చెవులకి వేళ్లాడ కట్టిన దళసరి అద్దాల కళ్లజోడు ముక్కు చివరికి జారింది ముసలిముఖంమీద నరాలు పాముల్లాగా మెలికెలు తిరిగి కనిపిస్తున్నయ్ గదిలో ఆముదపు దీపం మసకగా వెలుగుతోంది చిత్రాపుస్తకాలు దొంతరలుగా పడివున్నయ్ ఆ దీపం గుడ్డివెలుతురులో ఇనపపెట్టె తాళం తళుక్కున మెరుస్తోంది

"ఏమిట్రా అల్లా చూసావ్ ? నామాట నమ్మకం లేదా ? అయితే తీసుకుపో అవతలికి ఎవడి కొక్కావాలిరా ఈ పాడు సొమ్ము!" అని గుప్త గర్జించాడు

ఈగర్జన వినేసరికి పెద్దపులిలాంటి దొంగల నాయకుడు కాస్తా పిల్లి అయిపోయాడు. ఆయనకి కోపం వస్తే కొంప మునిగిపోతుంది. తన ఆట కట్టేసుంది అంత పెద్ద షావుకారు అండ తనకి మళ్ళీ దొరుకుతుందా ? వెండి బంగారాలే కాక, ధాన్యం,గుడ్డలూ, కూడా అమ్మి గుప్త ధనం గుట్టలు పోసుకున్నాడు. అంతేకాదు ఆ వూరి పంచాయతీబోర్డు అధ్యక్షుడు అధికారులందరికీతలలో నాలుకలాటివాడు. ముఖ్యంగా ఆ ఠాణాలో

పోలీసు ఇన్‌స్పెక్టరు గుప్తగారి ముఖ్య స్నేహితుడు. ఇవన్నీ గుర్తు తగలగానే ఆ గజదొంగ గజగజ వణుకుతూ, "క్షమించండి షావుకారుగారూ! బొత్తిగా అన్యాయం చేస్తే చచ్చిపోతాం స్వామీ," అని బతిమాలుకున్నాడు.

"ఇంక మాట్లాడి లాభం లేదు. నేనెవళ్లకీ అన్యాయం చెయ్యనురా. పరలోకం అంటూ ఒకటుందని నే నెరగనా? ఇష్టమైతే రెండొందలు తీసుకుని పో. లేకపోతే వచ్చినదారిని వెళ్లిపో, అట్టే గొడవ చెయ్యకు."

"బీదవాళ్లం. అన్యాయంగా చచ్చిపోతాం. ఇంకో పాతిక ఇప్పించండి."

"ఇంకొక్క పైసా కూడా ఇవ్వను తెలిసిందా. కావాలంటే మీ సొమ్ము తీసుకుపోయి ఇష్టమొచ్చినచోట అమ్ముకోండి. ఇంకెవరైనా సరే వీటికి నూటపాతిక్కంటె ఒక్క కానీ ఎక్కువిస్తే నా చెవి తెగకోయించుకుంటాను. ఏదో పాపం పాత ఖాతా కదా అని రెండొందలు ఇస్తానంటే ఇంకా కొండెక్కి కూచుంటారేరా?"

"సరే బాబూ మీ చిత్తం ఆ రెండొందలే దయచెయ్యండి."

ధనంజయ గుప్తముఖాన మందహాసం మెరిసింది. "ఎందుకురా నామీద మీ కింత అనుమానం? ఇది మీ కష్టార్జితం కదా, ఇందులో మిమ్మల్ని మోసం చేస్తే భగవంతుడు నన్ను బతకనిస్తాడురా? ఈ జన్మలో కాకపోయినా ముందుజన్మలోనైనా ఈ పాపం నన్ను వెన్నంటుతూనే వుంటుందిరా. ఎప్పటికైనా ధర్మమే జయించుతుంది. అధర్మానికి పుట్టగతులు లేవు. అన్యాయపుసొమ్ము ఆవు మాంసంతో సమానం కాదుట్రా నాయనా?" అని అనర్గళ ధర్మప్రవచనాలతోపాటు రెండొందల రూపాయలు వాళ్లకిచ్చి సాగనంపాడు. తలుపు గట్టిగా బిగించుకున్నాడు.

గజదొంగ తిరపతిరాయుడు పళ్లు పటపట కొరుకుతూ పిడికిలి బిగపట్టి, "ధర్మపన్నాలు చెబుతున్నాడు ముసలిపీనుగు. అన్యాయపు సొమ్ము ఆవుమాంసంతో సమానంట. ముసలినక్కని ముప్పతిప్పలు పెట్టి మూడు చెఱువుల నీళ్లు తాగించకపోయానా? కాని -" అంటూ రగిలే కోపాన్ని లోలోపల దిగమింగుకుంటూ వెళ్లిపోయాడు.

ఎంత ప్రయత్నించినా గుప్తకి నిద్ర పట్టలేదు. బైట ఆకు అల్లాడితే చాలు గుండెలు ఝల్లుమంటున్నయ్. మధ్యమధ్య పొలాల నుంచి నక్కల అరుపులు వినిపిస్తున్నయ్. దీపం కొంచెం పెద్దదిచేసి నగలమూట విప్పి ఒక్కొక్కటీ విడివిడిగా ఖరీదు కట్టాడు. కనీసం రెండువేల ఖరీదు చేస్తయ్. చాలా కొత్తమోస్తరు నాజూకు నగలు. పాపపు సొమ్ము ఆవు మాంసంతో సమానం. అయినా ఆ పాపమంతా దొంగలకే తగులుతుంది కాని తన కెందుకు అంటుతుంది? అయినా తను పరమభక్తుడు. అర్ధరాత్రివేళ వొణుకుతున్న కంఠంతో కృష్ణకర్ణామృతం పారాయణ చేస్తాడు. పాపాలు దూరంగా పారిపోకుండా ఎన్ని గుండెల్తో నిలబడగలవు? ఈ పారాయణతోనే భళ్లున తెల్లవారిపోతుంది. ధనంజయం నిద్రనికూడా ఎన్నడో జయించాడు!

ఇంకా పూర్తిగా తెల్లవారకముందే ధనంజయం కాలకృత్యాలన్నీ పూర్తిచేసి, కోరా ఖద్దరు కొల్లాయిగుడ్డ ధరించి భగవద్గీత ముందు పెట్టుకుని కూచుంటాడు. తెల్లవారేసరికి గాజుగ్లాసునిండా ఆవుపాలు పోసి తీసుకువస్తుంది కామాక్షి. ఆవుపాలమీదా, ఆయుర్వేద వైద్యంమీదా ఆయనకి ఎంతో అభిమానం!

రోజూకంటే కొంచెం ఆలస్యంగా వొచ్చింది కామాక్షి. పొద్దుణ్నే తలంటి పోసుకుని కళ్లకి కాటుక పెట్టుకుని నీటుగా వచ్చింది. ఆమె సోయగం ముసలి ధనంజయాన్ని గిలిగింతలు పెట్టింది. "ఎంత బాగున్నావే కామాక్షీ! రోజురోజుకీ నువ్వు పడుచుపిల్లవైపోతున్నావే," అన్నాడు.

"ముసలితనం వొచ్చినకొద్దీ రసికత్వం ఎక్కువైపోతోంది." అంటూ ముఖం తిప్పేసుకుంది కామాక్షి.

"ఇదుగో ఇల్లారా..." అన్నాడు ధనంజయం గుటకలు మింగుతూ.

"ఏమిటి మీ కేమైనా మతిపోయిందా? ఎవరైనా వింటే—"

"ఆ మతిపోలేదు. మత్తెక్కిండి. నీ అందాన్ని చూస్తే ఎవరికి మతిపోకుండా వుంటుందే? ఇదుగో ఇల్లా రా. నీ కోసం కొత్తరకం నగలు తెప్పించాను."

"వొద్దులెండి. నా మొహానికి అంత అదృష్టమా?"

"అదేమిటే కామాక్షీ, అల్లా గంటావు? ఎప్పుడూ ఏమీ ఇవ్వనట్లే మాట్లాడుతున్నావే?"

ఇంతలో గణగణమని సైకిలుగంటా, టకటకా బూట్లచప్పుడూ, "ఇంట్లో వున్నారా, గుప్తగారు?" అన్న పిలుపూ వినిపించినయ్. పానకంలో పుడకలాగా అధికారి అదే సమయానికి తయారయాడు.

ధనంజయుని ముఖం పాలిపోయింది. ఆ చప్పుడు వినేసరికి కామాక్షిముఖం చిరునవ్వుతో మెరిసింది. ఆ పాదమస్తకమూ సిగ్గుతో పులకరించిపోయింది. ఒక్కసారిగా ఆనందతరంగం ఆమె అణవణువులోనూ చెలరేగింది. శిలలమీద త్రుళ్ళిపడే సెలయేరులాగా కామాక్షి ఒక్క గంతు వేసి బైటికి వెళ్ళింది. పాతసంగతే అయినప్పటికీ కొత్తబాధ, అసూయ ధనంజయ గుప్త గుండెలని భగ్గుమనిపించినయ్. కామాక్షి అందం, ఇనప్పెట్టెలో డబ్బూ ఇవి రెండూ తనవే కాని తను అనుభవించలేనివి. వీటి రెంటినీ భద్రంగా కాపలాకాయటమే తనవొంతు కాబోలు...అసూయతో మనస్సు విరిగిపోయింది.

ఇవాళ అధికారి ఎందుకో చిర్రుబుర్రుమంటున్నాడు. చేతులో లాఠీని ఊగిసులాడిస్తూ, "గుప్తగారూ! మీరు కొంచెం జాగర్తగా మెలగాలి. అడ్డగోలువ్యవహారం చేశారంటే మీ మూలంగా నా వుద్యోగం వూడిపోతుంది" అన్నాడు.

"చిత్తం, బాబూ, చిత్తం," అని ధనంజయం రెండుచేతులూ నలుపుకున్నాడు.

"పైనుంచి పదేపదే తాఖీదు లొస్తున్నయ్. ఖర్మంజాలక మీపేరు బైటికి పొక్కితే నేను చేసే దేమీ లేదు. మీకు తెలుసుగా, పై అధికారి చాలా అసాధ్యుడు. వాడి కేదైనా మేత పడేసి వాణ్ని కట్టుకుంటేగాని—" అని అధికారి అనటమే ఆలస్యంగా ధనంజయగుప్త గభాలున పెట్టె తెరిచి ఒక నోట్లకట్ట తీసుకొచ్చి అధికారిచేతి కిచ్చాడు. ఇవ్వటమే తడవుగా అధికారి ఆ కట్టని నిర్లక్ష్యంగా నిక్కరుజేబులో వేశాడు ప్రసన్న దరహాసంతో అధికారిముఖం విప్పారింది.

ఇంతలో కామాక్షి అతిధికి ఆఖరిసత్కారంగా వెండిపళ్లెంలో తమలపాకు చిలకలు తెచ్చి అందించింది. వాటిని సావకాశంగా నములుతూ, "అయితే గుప్తాగారూ, మీదగ్గి రేమైనా బియ్యం నిల్వ వున్నదా? నిజం చెప్పండి. నేను పైవాళ్లకి రిపోర్టు పంపాలి," అన్నాడు అధికారి.

"బియ్యమా? నాదగ్గిరా? ఎక్కణ్నించి వొస్తయ్ బాబూ? పండినవి కాసినీ అప్పుడే అయిపోయినయ్. నేనూ అందరిలాగే రేషనుబియ్యం కొనుక్కుని నానా ఇబ్బందీ పడుతున్నాను."

"అబద్ధం - పచ్చి అబద్ధం నాకేమీ తెలియదనుకున్నారు కాబోలు. ఈ నిమిషంలో మీకొట్లు తనిఖీ చేస్తే అయిదొం

వల బస్తాలు దొరుకుతయ్. మీ నక్కజిత్తులు నా దగ్గరా?" అని క్రూరంగా నవ్వాడు అధికారి.

"హరే కృష్ణ - హరే కృష్ణ......నా కొట్లో అయిదొందల బస్తాల బియ్యమా? ఎవరో గిట్టనివాళ్లు కూసిన కూత. మీముందు దాస్తానా? అప్పులతో అబద్ధం ఆడితే మహాపాపం చుట్టుకోదుటండీ? ముందు జన్మలో నాకు పుట్టగతు లుండొద్దూ?"

"చాలుచాలు వూరుకోవయ్యా! ధర్మపన్నాలు ఏకరువు పెడతా వెందుకు? అమ్మ పుట్టిల్లు మేనమామదగ్గర దాస్తావా? నీకేం భయంలేదులే. నేనున్నంతకాలం. నువ్వు నిశ్చింతంగా నిద్రపోవచ్చు."

"తమ ఆసరా లేకపోతే ఈ దీనుడు నిమిషమైనా బతకగలడా?" అని ధనంజయం అధికారిచేతులు పుచ్చుకున్నాడు.

"సరే వెళ్లొస్తాను" అంటూ కామాక్షివైపు ఒక చూపు విసిరి సైకి లెక్కాడు అధికారి.

అధికారిని సాగనంపి కామాక్షి వంటపనిమీద ఇంట్లోకి వెళ్లిపోయింది. అసలు కామాక్షి ఎవరో, ధనయంజయగుప్తతో ఆమె కేం సంబంధమో ఎవరికీ అర్థంకాదు. నలభయ్యోపదిలో ఆయన పెళ్లాం పోయింది. తరవాత కొన్నాళ్లకి కామాక్షి వంటమనిషిగా చేరి క్రమేణా ఇంటి మనిషిగా మారింది. ఇంతవరకూ ఎన్ని దురాగతాలు చేసినా ధనంజయగుప్త ఒక్కసారి కూడా పట్టుబడకపోవటానికి ఆమే కారణమని అందరికీ నమ్మకం. చండశాసనుడని పేరుమోసిన అధికారి, ధనంజయగుప్త ఇంటిచుట్టూ కాలుకాలిన పిల్లిలాగా తిరగటానికి, కోరలు తీసిన పాములాగా మారటానికి కామాక్షి ఇంద్రజాలమే కారణమని అందరికీ తెలుసు.

అక్కడే చతికిలబడిపోయాడు గుప్త. గుండెల్లో రాయిపడింది. ఎల్లా తెలిసిందో తన దగ్గర బియ్యం వున్నట్లు? ఇంకా నయం తనదగ్గర ఎనిమిది వందల బస్తాలు నిలవున్నట్లు తెలియలేదు. ధర్మంగా వ్యాపారంచేస్తే మట్టికొట్టుకుపోవలసిందే కదా? ఈ బియ్యం తను తేలికధరలో కొన్నమాట నిజమే. కాని కార్తీకమాసంలో కటకటగావుండే రోజుల్లో సరుకు విడుదలచేస్తే కోరిన ధరకి కళ్ళకద్దుకొని కొనుక్కుపోతారు. తను కుబేరుడైపోవచ్చు. ఇంతకీ అధికారి చల్లగా చూసినంతకాలమూ తన కేభయమూ లేదు.

ఇల్లా అనుకుంటూవుండగానే ఆ వూరి షావుకార్లు ముగ్గురు లంబోదరులు త్రిమూర్తుల్లాగా ప్రత్యక్షమయ్యారు. "ఊరక రారు మహాత్ములు. ఏమిటి విశేషం?" అని ఆత్రంగా అడిగాడు ధనంజయం.

"ఆ ఏం లేదు - మన వూళ్లో సప్తాహం జరపాలని నిశ్చయించాం. కలియుగాంతం దగ్గరికి వచ్చేస్తున్నకొద్దీ పాపం పండిపోతోంది. ఏదో కాస్త నలుగురం ఒకచోట చేరి భగవన్నామస్మరణ చేస్తే మంచిదని ఈ సప్తాహం ఏర్పాటుచేస్తున్నాం."

"ఈ కలికాలపు పాపాలన్నిటికీ అదే మంచి విరుగుడు," అని ధనంజయగుప్త అంగీకారం తెలిపాడు.

"అయితే తమరు తప్పక దయచేసి భూరి విరాళం ఇచ్చి సప్తాహాలు జయప్రదంగా జరిపించాలి." అని ముగ్గురు వర్తకులూ ఒక్క కంఠంతో అన్నారు. అల్లాగే లెండి అన్నాడు గుప్త.

మర్నాడు బ్రహ్మాండమైన సన్నాహాలు జరిగినయ్. సభికులకోసం పెద్ద పందిలి వేశారు. మధ్య భజనలకీ, ఉపన్యాసాలకీ ఎత్తుగా వేదిక అమర్చి దాన్ని దీపాల తోరణాలతో చక్కగా అలంకరించారు. తప్పెట్లతో, తాళాలతో, రకరకాల వాద్యాలతో క్షణంకూడా విరామం లేకుండా భజనలు సాగిపోతున్నయ్. తను కూడా చిరతలు చేత పుచ్చుకుని పూనకం పూనినవాడిలాగా ధనంజయం భక్తిపారవశ్యంలో ఊగిపోతున్నాడు. ఇంతలో అమాంతంగా లేచి నిలబడి ఉపన్యాసకేసరి పలుగురాళ్లలాటి సమాసాలతో, కలికాలంలో ధర్మం ఎల్లా భ్రష్టమైపోతోందో వర్ణిస్తూ ప్రేక్షకులమీద పిడుగులు కురిపించటం మొదలెట్టేసరికి అంతా కిక్కురు మనకుండా చెవులప్పగించి వింటున్నారు. గంభీరంగా ఉపన్యాసం సాగిపోతుంటే మధ్యలో, "ధనంజయగుప్తాగారూ! తమరు వెంటనే రావాలి" అని కేక వినిపించింది. గుప్త ఉలిక్కిపడి లేచి నిలబడి ఆ వొచ్చిన మనిషి పంచాయతీబోర్డునౌకరని గుర్తించి, "ఏం కొంప మునిగిందిరా? భగవన్నామస్మరణకూ్కడా తీరుబాటు దొరక్కుండా వుందే. బాగానే వుందే ఈ జీతం బత్తెం లేని వుద్యోగం." అని విసుక్కున్నాడు. ఈ జీతం బత్తెం లేని ప్రెసిడెంటుహోదా కోసమే గుప్త కొన్నాళ్లకిందట డబ్బు సంచులు విరజిమ్మాడు.

"త్వరగా రావాలి బాబూ," అని నౌకరు కెట్టించాడు.

"మీరు కార్యక్రమం సాగిస్తూవుండండి, నే నిప్పుడే తిరిగి వొస్తాను," అని ధనంజయగుప్త పందిలిబైటికి వచ్చాడు.

"ఏమిట్రా గొడవా?" అని విసుగ్గా అడిగాడు.

"కూరగాయల గురవయ్యపెళ్లాం గొంతు కురిపోసుకుని చచ్చిపోయింది."

"అయితే గురవయ్యో?"

"గురవయ్యకూడా పోయాడు పాపం."

"పోనీ పీడ విరగడైపోయింది. అయితే ఇప్పుడు శవపంచాయితీ జరపాలన్నమాట పద పోదాం. పెళ్లాం ఉరిపోసుకుని చచ్చిందన్నావు. మరి మొగుడెల్లా పోయాడూ?"

"ఏం చెప్పను బాబూ? వాళ్లకి గడ్డురోజులు వొచ్చినయ్. తిండికి లేక మలమల మాడి చచ్చిపోయారు. ఆకలిచిచ్చుకి తాళలేకనే వాడిపెళ్ళాం వురిపోసుకుంది."

"అల్లాగా?"

"అవును, బాబూ! ఆకాశాన్నంటుతున్నయ్ ధరలు. ఈరోజుల్లో బీదా, బిక్కీ బతకటం చాలా కష్టమైపోతోంది, బాబూ. ఈ కంట్రోళ్లు వొచ్చి మా ప్రాణాలు తీస్తున్నయ్. ఇవాళ గురవయ్యగుడిసెలో జరిగిన సంగతే రేపు నా గుడిసెలోనూ జరగచ్చును."

"చాల్లేరా, ఒకటే సొద. పోయేవాళ్లని పట్టుకుంటే ఆగుతారా? ఎవరికాలం మూడితే వాళ్లు పోతారు. ఎప్పుడో ఒకప్పుడు అంతా పోయేవాళ్లమే గదా! వాళ్లు ఆకలికి మాడి చచ్చారంటే అది వాళ్ళ పూర్వజన్మల కర్మపరిపాకంరా, బాబూ. ఇదంతా ఆ భగవానుడి చిద్విలాసంరా, నాయనా." అని అనర్గళంగా, నౌకరు ఉక్కిరిబిక్కిరై పోయేట్లుగా, ధనంజయగుప్త ఉపన్యసించాడు.

దారి కనపడని కారుచీకటి. జడలు విరబోసుకున్న భూతాలమాదిరి భీకరంగా వున్నయ్ చింత చెట్లూ, రావిచెట్లూ. పొలాలలోంచి గీపురు గావురు మనే ధ్వనులు. వింటుంటే గుప్త గుండెలు పీచుపీచు మంటున్నయ్. ఏదో తెలియని భయంతో వొళ్లు జలదరించిపోతోంది. ఆ చీకట్లో చెట్లగుబుర్లలో ఏవో వికృతమైన నీడలు కదులుతున్నట్లు తోచింది. దగ్గరే వున్న తోపులోంచి పరుకు చెట్ల సవ్వడి అన్నార్తుల ఆక్రందనంగా

వినిపించింది. "మా అన్నం మా ప్రాణం నీ గుప్పెట్లో చిక్కించుకున్నావు. నీ అధికారం, నీ ధనం, నీ శాసనాలు ఇన్నాళ్లూ నిన్ను మా ప్రతీకారజ్వాలల్లో భస్మం కాకుండా రక్షించినయ్. ఇప్పుడు నిన్నెవరు కాపాడుతారో చూస్తాం, కాసుకో," అంటూ ఎవరో మీదికి దూకుతున్నట్లు తోచి గుండె దడదడలాడింది. ధైర్యం తెచ్చుకుని ధనంజయం గట్టిగా 'హరేరామ, హరేకృష్ణ' అంటూ ఆ చెట్ల గుబురు దాటేసి బతుకు జీవుడా అనుకున్నాడు.

అదె గురవయ్య కూలిపోయిన గుడిసె. అంతా చిందరవందరగా వుంది. గవులు కంపు గుప్పున కొడుతోంది. ముక్కు మూసుకుని 'హరేకృష్ణ, హరేకృష్ణ' అంటూ ధైర్యం తెచ్చుకుని, ధనంజయగుప్త ఇంకో అడుగు ముందుకి వేశాడు. ఆకలికి అల్లాడిపోయి నెత్తురు కక్కుకుని ప్రాణం విడిచిన గురవయ్య కళేబరం ఎదురుగా కనబడింది. నోరు తెరుచుకునివుంది. బైటపడ్డ పళ్లతో ఆ శవం లోకాన్ని వెక్కిరిస్తున్నట్లుగా కనిపించింది. కళ్లు మరీ భయంకరంగా వున్నయ్. అంతా చీకటిగా వుంది. నౌకరు చేతులో వున్న గుడ్డిదీపం మిణుకు మిణుకుమంటోంది. ఇంతలో ఇంటి కప్పునుంచి వ్రేళ్లాడుతున్న శవం కనిపించి గుప్త గజగజ వొణికిపోయాడు. తన మానాన్ని కాపాడుకోటానికి మిగిలివున్న చినుగుల చీరనే ఆ నిర్భాగ్యురాలు ఉరితాడుగా వుపయోగించింది. నగ్నంగా వ్రేళ్లాడుతున్న ఆ శవం కేసి చూసేసరికి గుప్తకి పైప్రాణాలు పైనే పోయినయ్. పెగుల్చుకున్న గద్గదకంఠంతో "ఇక పదరా పోదాం" అన్నాడు గుప్త.

"మరి ఈ శవాల గతేమిటి, బాబూ?" అన్నాడు నౌకరు.

"వెళ్లి పోలీసులకి చెప్పరా. వాళ్లిష్టం వొచ్చినట్లు చేసుకుంటారు. అబ్బబ్బా! ఏం పాడుగొడవరా ఇది! "హరేకృష్ణ, హరేకృష్ణ" అంటూ ధనంజయం మళ్లీ దారి పుచ్చుకున్నాడు.

సరుగుచెట్ల రొద ఇంకా భీకరంగా వినిపిస్తోంది. దారి పక్కనున్న చెట్లన్నిటినించీ ఎవరో నగ్నంగా వేళ్లాడుతున్నట్లనిపించింది. భయంతో నెత్తురు గడ్డకట్టుకుపోతోంది. అడుగు సాగటంలేదు. ముచ్చెమటలు పోస్తున్నయ్. ఎవరి ఆత్మహత్యకి కారణం? దైవమా?

"బాబూ, భజన జరిగేచోట దిగబెట్టి రమ్మంటారా?" అని అడిగాడు నౌకరు.

"వొద్దురా, బాబూ. ఇంటికి పోదాం పద. చాలా పనివుంది నాకు," ఎల్లాగో కాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరుకున్నాడు ధనంజయం. సప్తాహం సందడి తప్ప ఊరంతా సద్దుమణిగి నిద్రపోతోంది. మసకచీకట్లో ఇంటివసారాలో సైకిలు కనిపించింది. లోపలికి అడుగు పెట్టాడు. కామాక్షి పడుకునే గది తలుపు బిగించివుంది. లోపల దీపం లేదు. గుసగుసలూ, ముసిముసినవ్వులూ మధ్యమధ్య వినిపిస్తున్నయ్. ధనంజయం వొంటినిండా గొంగళిపురుగులు పాకుతున్నట్లనిపించింది. నిరాశతో నిస్పృహతో దీనంగా నిట్టూర్చాడు.

మెదలకుండా వెళ్ళి లాంతరు వెలిగించి తీసుకొచ్చాడు. మెల్లిగా బియ్యపు కొట్టు వైపుకు నడిచాడు. కొట్లలో ఎనిమిది వొందల బస్తాల బియ్యం నిలవ పోశాడు. ఆ బియ్యపు రాసి తనకి బంగారపు కొండ!

తలుపు తీసేసరికి బియ్యపురాసి తళతళా మెరిసింది. కాని ఎక్కడిదో పాడువాసన. ఇక్కడికూడా ఆ గవులుకంపు ఎల్లా వొచ్చిందో? చూపులతో అంతా గాలించాడు. కొట్టుమీది రేకులు సందిచ్చినట్లున్నయ్. వాననీళ్లు పడి పైవరసఅంతా తడిసిపోయి పాడుకంపు కొడుతోంది. ఆర్తుల ప్రాణాలు నిలిపే ఆహారం, భూదేవి ఇచ్చిన మహాప్రసాదం ఈ గుప్తకారాగారంలో పడి కళావిహీనంగా పాలిపోయింది.

కనీసం పదిబస్తాల బియ్యమైనా ధ్వంసమైపోయినట్లుంది. "అయ్యో! అయ్యో! కొంప మునిగిపోయింది" అంటూ గుప్త గుండెలు బాదుకున్నాడు. తెల్లారగానే మేస్త్రీని పిలిపించి కప్పుబాగుచేయించెయ్యాలి. ఇంకా నయం. కొన్నాళ్లు చూడకుండా వుంటే మొదటికే మోసంవచ్చేది.

కాని ఏం పాడు కంపు! ఎంత వొద్దనుకున్నా గురవయ్యఇంటిదగ్గరివాసనే గుర్తొస్తుంది. అబ్బా! ఆ శవాలు...హరేకృష్ణ హరేకృష్ణ అనుకుంటూ మనస్సుని బలవంతాన బిగబట్టుకుంటూ, కొట్టుతలుపులు గట్టిగా తాళంపెట్టి, సప్తాహం పందిరి వైపుకి గుప్త బయలుదేరాడు.



శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

పట్నంబావ చెప్పిన మాట నిజమే. అక్కడ సాగే సంభాషణ రానురాను తీవ్ర రాజకీయాల ధోరణి అవలంబించింది. మామ తన జీవితంలో మాలావు కొట్లాటలే చూశాడు గాని ఇంత తర్జనభర్జన వాగ్వాదము ఎన్నడూ వినలేదు. కేవలం సిద్ధాంతాలు ఇంత ఉద్రేకాన్ని రెచ్చగొడతాయని ఆయన కలలోకూడా ఊహించలేదు.

"ఈ ప్రభుత్వం ఆహారసమస్యను పరిష్కరించదు. ఎట్లా పరిష్కరిస్తుంది? దున్నేవాడిదే భూమి అన్న సిద్ధాంతాన్ని ఆమోదిస్తేనేగాని ఆహారసమస్య పరిష్కారం కావటానికి విఘ్నేశ్వరపూజకూడా కాదు. భూస్వాముల్నీ, జమీందార్లనీ బలపరుస్తున్నారు. ఇదెట్లా కుదురుతుంది?"

"నువ్వనేదేమిటి? ఎవళ్ళనోటనన్నా మట్టి గొడితేగాని సమస్యాపరిష్కారం కాదంటావు, పోరా రష్యావాడా!"

"మధ్య నాదేం పోయింది? జమీందార్ల నోట మట్టిగొట్టటం ఇష్టం లేకపోతే మిగిలినవాళ్ళందరి నోటా మట్టిగొట్టూ! తింటూనే ఉన్నారుగా శేషనుబియ్యం?"

"సమస్యను సౌమ్యంగా పరిష్కరించుకోవటమంటూ లేదేమిటి?"

"ఉచ్చు మెల్లిగా బిగించుకుంటే ప్రాణం పోదని నీ వాదం! హుః!"

ఇంతవరకు మౌనంగా ఉన్న బొంగురుగొంతుఎలుక గొంతు సవరించుకుంది.

"మనకు ప్రస్తుతం కావలిసింది క్రమబద్ధమై, ఒడుదుడుకులు లేని ప్రజాజీవితం. అరాచకంవల్ల మనకు స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని కొన్ని బుద్ధిమాలిన ఎలుకలు అనుకోవచ్చు. అది శుద్ధ పొరపాటు. అరాచకంవల్ల మనకు లభించే స్వేచ్ఛ చావు స్వేచ్ఛ. అది మన జాతియొక్క వినాశనానికే దారి తీస్తుంది. మనం వ్యక్తివాదాన్ని కొంత హద్దులో ఉంచితేగాని ప్రజాస్వామికాన్నయినా అమలు చేయలేం....చూడండి కిందటిసారి ఈ పట్నంలో యుద్ధభయం వచ్చినప్పుడు వందలాది ఇళ్లు ఖాళీ పడ్డాయి. నాకు బాగా జ్ఞాపకం. మేం బలే సంతోషించాం. పగలయేది, రాత్రయేది యథేచ్ఛగా తిరిగేవాళ్ళం. పట్టపగలు వీధుల్లో చెడుగుడూ, చెర్‌పట్టీ ఆడామంటే నమ్మండి. కాని ఈ స్వేచ్ఛ ఎందుకైనా పనికొచ్చిందా? ఎక్కడా తిండిలేదు. చచ్చేకరువు. అందరం నీరసించిపోయాం. ఆ స్వేచ్ఛ మా అవసరాలు తీర్పలేకపోయింది.. మళ్ళీ జనం తిరిగి రాసాగారు. ఖాళీఇళ్లు నిండసాగాయి. మా స్వేచ్ఛ అరికట్టింది. కాని మళ్ళీ జీవితం క్రమబద్ధమయింది. తిండి దొరికింది."

ఇంకో కీచుగొంతు ఎలుక అందుకుంది. "పెదనాన్న చెప్పిందాల్లో అబద్ధం లేదు. కాని ఆయన ప్రజాస్వామ్య మంటున్నాడే అది ప్రస్తుతం పెద్ద అబద్ధం. ధనికస్వామ్యం ఉండగా ప్రజాస్వామ్యం ఎట్లా సాగుతుంది? ధనికులు ప్రజలను యథేచ్ఛగా పనులు చేసుకోనివ్వరు. వాళ్ళ శ్రమ ఫలితం వాళ్ళకి దక్కనివ్వరు. సంఘంలో కల్లోలాలు తెప్పిస్తారు. యుద్ధాలు తెచ్చిపెడతారు అశాంతి తెచ్చిపెడతారు ఏ

సిద్ధాంతాలపైనా ప్రభుత్వాన్ని సాగనివ్వరు. ధనికవాదంలో అశాంతీ, అరాచకం ఇమిడిఉంది. ధనికవాదంకింద క్రమపరిపాలన అసాధ్యం. ఉదాహరణ చూడండి. న్యాయశాఖను స్వతంత్రం చేస్తున్నామన్నారు. ఒక బాధ్యతగల ప్రజామంత్రి, 'మేం పట్టుకున్నవాళ్ళే దొంగవ్యాపారస్తులు. మా పోలీసులు కాల్చిన వాళ్ళే కమ్యూనిస్టులు' అంటాడు! ఇంతకంటె అరాజకం ఎట్లా ఉంటుందీ? అందుచేత నిజమైన ప్రజాస్వామికం రావాలంటే సోషలిస్టువిధానంతో కమ్యూనిజం ఏర్పడి తీరవలసిందే."

"నినాదాలు వొట్టి అర్థంలేని మాటలు! కమ్యూనిజం మనకు ప్రబల శత్రువు. కాస్త ఆలోచిస్తే అది రుజువవుతుంది," అన్నారు మరొకరు. "ప్రజాస్వామికంలో కొద్దిమందికే ఆస్తి హక్కులుంటే మనం ఇట్లా తల్లడిల్లిపోతున్నామే, కమ్యూనిజంలో అందరికీ ఆస్తిహక్కులుంటాయి. అప్పుడందరూ మనకు పరమశత్రువులే అవుతారు. మనకు ఏ దరిద్రులైతే అప్తులని ఇవాళ అనుకుంటున్నామో ఆ దరిద్రులు ఆనాడుండరు. అప్పుడు మనగతి ఏమిటి?"

మామకీ వాదం అర్థం కావటమేకాక సబబుగా కూడా కనిపించింది.

కీచుగొంతు మళ్ళీ మాట్లాడసాగింది.

"మనిషి వస్తుతహా మనకు విరోధి అన్న ఉద్దేశంతో మాట్లాడుతున్నావు. ఇది అబద్ధం. మన ఉనికికి అతి ముఖ్యమైనది సమృద్ధి అయిన సంపద. సమాజంలో ఉత్పత్తిశక్తులు పైచూపు చూస్తున్నంతకాలమూ మనకు పూర్తిక్షేమం ఉన్నది. సామాజిక మానవుడు తన పొట్ట తాను పోసుకునే శక్తి హస్తగతం చేసుకున్న తరవాత మన చిన్న పొట్టలను చూసి అసూయపడడు. వర్గసంబంధాలు ఉత్పత్తిసాధనాలపై గల హక్కులతోపాటు మారుతాయని మార్క్సు గట్టిగా చెప్పాడు. ఇది అక్షరాలా నిజం. ఉత్పత్తి నిర్విఘ్నంగా అభివృద్ధి అయేది ఎక్కడ? ధనికస్వామ్యంలోనా, సామ్యవాదంలోనా? ఎందుకీ తెలియని కబుర్లు?"

"ఈ రష్యనుపత్రికలు తిని ఇటువంటి దుర్బుద్ధులు వంట పడుతున్నాయి."

"అమెరికను పత్రికలు తిని తెచ్చుకునే రోగాల మాటేమిటి?"

"రష్యాపత్రికల్ని అమ్మకుండానూ, కొనకుండానూ చేస్తే దేశం క్షణంలో బాగుపడుతుంది."

"అంబ పలుకుతున్నది! అదీ అసలైన ధనికవాద ప్రజాస్వామికం."

"ప్రజాస్వామికంకింద వాటి విక్రయం నిషేధించటం సాధ్యం కాకపోతే వాటిని కొనేవాళ్ళని మక్కెలు విరగదన్నితే సరి! రోగం వదిలిపోతుంది."

"అవునన్నా, గాన్యా! నీ ప్రజాస్వామికం ఫాసిజంకు తోబుట్టువు. అదే నేనూ అంటున్నాను."

"ఒక చెంప ఈ రష్యాపత్రికలు అరాచకం తెచ్చిపెడుతుంటే నువ్వేమిటో సిద్ధాంతాలు చెబుతావేమిటి?"

"నువ్వు చెప్పే పనులన్నీ జరుగుతూనే ఉన్నాయి. అక్కడ ధర్మం నాలుగుకాళ్లా నడిచి, అందరు సుఖంగా తిని కడుపులో చల్ల కదలకుండా కూచున్నారని నీ భ్రమ. సిద్ధాంతాలంటే అంత విద్వేషం దేనికీ? సిద్ధాంతం లేకుండా ఆచరణంటూ ఎక్కడన్నా ఉందీ?...మన గర్భశత్రువులైన పిల్లులు పాలుతాగుతూ కళ్లు మూసుకుంటాయి. ఆ అలవాటే మనంకూడా ప్రారంభించామంటే ఎంతవరకు దిగజారామో ఊహించుకోవచ్చు."

రానురాను మాటలు చురుకెక్కాయి. ఒకరు స్టాలిన్‌నూ, మరొకరు ట్రూమన్‌నూ, ఒకరు రష్యానూ, మరొకరు అమెరికానూ తిట్టుకున్నారు. ఒకరు యుద్ధాన్నీ మరొకరు శాంతినీ తిట్టేదాకా వచ్చింది.

ఈ తిట్లూ, శాపనార్థాలూ మామను రుచించలేదు. మొట్టమొదటచర్చవల్ల మామకు చాలా విషయాలు కొత్తవి తెలిశాయి గాని ఈ తిట్లవల్ల ఏమీ కొత్త విషయాలు తెలియలేదు.

మామ కదిలే ధోరణిలో ఉండటం చూసి పట్నంబావ పక్కనే ఉన్న కాఫీ హోటలుకేసి దారి తీశాడు.

రోడ్డు దాటుతూ పట్నంబావ "ఆ వెధవ సంభాషణ నువ్వింతసేపు ఎట్లా విన్నావో గాని నాకు తగని తలనొప్పి," అన్నాడు.

మామ నడిరోడ్డులో ఆగి నిశ్శబ్దంగా ఉన్న రోడ్డుకేసీ రోడ్డువెంట వెలిగే దీపాలకేసీ చూస్తూ, తన బావమరిది అన్నమాటలు వినిపించుకోలేదు.

"ఈ పట్నంలో ఎంతో అందం ఉన్నది, నేను కనిపెట్టలేకపోయినాను గాని!... కాని ఇది దగా. దీని అట్టడుగున నిజమైన శాంతి లేదు. రాక్షసులూ, దయ్యాలూ నిద్రపోతుంటే ప్రశాంతత ఉంటుంది. కాని అది ప్రశాంతత కాదు," అన్నాడు మామ, తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా.

"ఆకలి దహిస్తున్నది. పోయి ఏమన్నా తినటానికున్నదేమో చూద్దాం," అన్నాడు పట్నంబావ.

హోటలు నిశ్శబ్దంగా ఉంది. పగలల్లా గొంతులు పగిలేట్టు అరిచి, కాళ్ళు పడేట్టు తిరిగి, చేతులు విరిగేట్టు ఫలహారాలందించిన దౌర్భాగ్యులు ఒళ్లు మైమరచి మహారాజులు పొందలేని నిద్రసౌఖ్యంలో ఉన్నారు.

బావమరుదులిద్దరూ ముందు పాకశాల ప్రవేశించారు. అక్కడ చాలా వేడిగా ఉంది.

"ఆ భాండీలో నూనె చూడు. హోటలు తెరిచిన రోజున దాన్లో పోసిన నూనె. మళ్లీ తీయలేదు. రోజూ దానికి కొత్తనూనె కలుపుతుంటారు. ఈ డబ్బాలనిండా రకరకాల పిండి ఉంటుంది. ఆ టిన్నులన్నీ నూనెటిన్నులే."

మామ పట్నంబావ చెప్పేది వింటూ పాకశాల అంతటా కలయదిరుగుతున్నాడు. అన్నిటిమీదికీ ఎక్కి దిగుతున్నాడు. ప్రతిదీ వాసన చూస్తున్నాడు. ఒక మూల ఉల్లిపాయలూ, పచ్చిమిరపకాయలూ, బంగాళాదుంపలూ, ముల్లంగి దుంపలూ, చిక్కుళ్ళూ మొదలైనవి పోగేసి ఉన్నాయి. మామ అన్నిటినీ రుచిచూశాడు. ఇన్ని కూరలు ఒక్కసారి కనిపించేసరికి మామకు పరమానందమయింది.

"ఇదేమిటబ్బా, మంచి సువాసనగా ఉందీ?" అంటూ మామ సబ్బు కొంత గీకి రుచి చూశాడు. మొదట బాగానే ఉన్నట్టుంది గాని క్షణంలో మొహం మొత్తింది.

"ఇక్కడేముంది? అవతలి గదికి పోదాం పద," అన్నాడు పట్నంబావ.

అవతలి గదిలో నేలమీద రకరకాల తినుబండారాలు పడిఉన్నాయి. తీపిసరుకూ, పకోడీలూ, బూందీ, గారెముక్కలూ, బజ్జీతుంపులూ ఇంకా ఏమేమిటో ఉన్నాయి.

మొట్టమొదట తామొక్కడే ఇంకెవరూ లేరనుకున్నాడు గాని త్వరలోనే ఈ భ్రమ నివారణ అయింది. ఇంకా చాలా ఎలుకలు కుర్చీలకిందా, బల్లలకిందా కూర్చుని ఏవేవో తింటున్నాయి. మామకు వాళ్ళ పరిచయం చేసుకో బుద్ధి అయింది. కాని పట్నంబావ ఎంతమాత్రమూ ఒప్పుకోలేదు. విసురుగా పరిగెత్తవద్దనీ, అవీ ఇవీ ఎక్కి దూకవద్దనీ కూడా పట్నంబావ మామకు సలహా ఇచ్చాడు.

"ఎంతసేపూ ఎవరికి వారేనా?" అన్నాడు మామ విసుగ్గా.

"కాకపోతే ఏమిటి? ఇక్కడ చాలా వ్యత్యాసాలున్నాయి. గొప్పఇంటి ఎలుకలు కొద్దిఇంటి ఎలుకలను చిన్నచూపు చూస్తాయి. ఒకరిచేత ఒకమాట ఎందుకనిపించుకోవాలి, ఎవరి మానాన వారుంటే

ఎవరి మర్యాద వారి కుంటుంది. అటువంటి ఆచారం ఉంది కనకనే ఇక్కడ ముందు పరిచయంలేకవాళ్లు లోకు వవుతారు."

ఇద్దరూ కలిసి బీరువాపైకి ఎక్కారు. బీరువాకు అద్దా లున్నాయి. అద్దాలతత్వం తెలీక మామ లోపల కనిపించే తినుబండా రాలమీదికి లంఘించి ముక్కు గట్టిగా చితకగొట్టుకున్నాడు. పట్నంబావ అద్దాలనుగురించి మామకు తెలియజెప్పాడు.

"ఈ అద్దాలు పట్నంబతుక్కు తగ్గట్టే ఉన్నాయి. అన్నీ ఆకర్షించేటట్టుగా ఎదట ఉండటమూ, అందుకోబోతే మొహం పగలటమూనూ. ఏమి టీ కపటనటన?" అన్నాడు మామ ముక్కు రుద్దుకుంటూ.

"అద్దంలోనుంచి కనిపించే కపటనటన చూడు. ఈ సరుకంతా రేపు తాజాసరుకులో కలిసిపోతుంది. ఆ గంగాళంలో సాంబా రుంది. అది రేపు వేడిసాంబారులో చేరిపోతుంది"

"అచ్చాలతో లుచ్చాలు చేరుతా రందూ!" అన్నాడు మామ విరక్తిగా.

బాగా పొట్టలు నింపుకుని బావమరుదు లిద్దరూ ఇంటిదారి పట్టారు.

8

ఇంటిదగ్గిర ముసలావిడ కునుకుతూ, కళ్లు తెరుస్తూ ఉన్నది. ఒకసారి ఆవిడ దృష్టి సారించి చూచేసరికి ఎదురుగా ఏదో జిగాల్న మెరిసింది. ఆవిడ బలవంతాన కదిలి దానిదగ్గిరికి వచ్చింది. అదొక వింత వస్తువు. దానిలోపల ఒక రొట్టెముక్క వేళ్లాడుతున్నది. ఆ రొట్టెముక్కనుంచి కమ్మని వెన్న వాసనకొడుతున్నది. ఆ వెన్న ఆవిడ ముసలిహృదయాన్నికూడా ఎంతో ఆప్యాయంగా పిలుస్తూ, "రా! వచ్చి నన్ను రుచిచూడు!" అంటున్నది. ఆ పిలుపుకు ఆవిడరక్తం సుళ్లుతిరుగుతున్నది.

కాని ఆ రొట్టెముక్కను చేరే ఉపాయం లేదు. దానిచుట్టూ సన్నని, గట్టి చువ్వలు కటకటాల్లాగా ఉన్నాయి. చువ్వలు మహా అందంగా, నున్నగా, పైనా, కందా వొంపులు తిరిగి ఉన్నాయి. ఆవిడ బోను చుట్టూ ఒకప్రదక్షిణం చేసివచ్చి ఒకచోట కూర్చుని వాసనతో సంతృప్తి పడుతున్నది.

ఈ సమయంలో బాలుడు వచ్చాడు. బోనుచూసి ఆశ్చర్యంతో ఆగాడు. వాడికూడా వాసనతగిలింది. బోనుమీదికి ఒక్కదూకు దూకాడు. ఎన్నోసార్లు దాని మీదికి ఎక్కాడు, దిగాడు. బోను చువ్వలు కొరికాడు. అవి కొరుకుడు పడలేదు. బాలుడిప్రాణం తల్లడిల్లిపోతున్నది. ఆ రొట్టెముక్క నోట పడేదాకా వాడి కింకో ఆలోచన బుర్ర కెక్కదు.

"లాభంలేదురా నాయనా!" అన్నది ముసలావిడ. బాలుడు వినిపించుకోలేదు.

తీరా బాలుడు లోపలికి ఎట్లావెళ్ళాడో ముసలావిడ చూడనేలేదు. ఒక క్షణం బోనుమీద ఉన్నవాడు, గారడీలాగా మరుక్షణం బోనులో ఉండి రొట్టెను ఆత్రంగా తినేస్తున్నాడు. చూస్తుండగానే రొట్టె హరించుకుపోయింది. వాడి ఆకలీ, ఆత్రమూ కూడా చల్లారాయి. వాడు బయటికి రావటానికి చూశాడు. కాని బయటికి దారి ఎటో తెలియలేదు. తాను ఎట్లా లోపలికి వచ్చిందీకూడా వాడికి తెలీదు. వాడి అంతరాత్మలో ఏ మూలో సన్నగా భయం ప్రారంభ మయింది. కాని ఇంతలో వాడి తల్లీ, కొందరు పిల్లలూ తిరిగి వచ్చేసరికి మళ్ళీ ధైర్యం వచ్చింది.

"నే మనవాడు చూడవే, కడనంత రొట్టె కమ్మగా తిని ఎట్లా లోపల కూర్చున్నాడో!" అన్నది ముసలావిడ కోడలితో.

"అందులో దూరా వేమిట్రా? రా బైటికి," అన్నది తల్లి.

"నేను రాను. నే నిక్కడే ఉంటా నా యిష్టం, అన్నాడు బాలుడు. తనకు బయటికి రావటం చాతకాలేదన్నది తల్లి ఊహించటం వాడి కిష్టం లేదు.

"ఓరీ! లోపలి కెట్లా వెళ్ళావురా? ఎక్కడా దారి లేదే?" అన్నారు పిల్లలు ఆశ్చర్యంతో.

"అదే గమ్మత్తు!"

"మా కూడా చెప్పవూ?"

"ఎంతాశే!"

"కొంచెం చెప్పరా!"

"చాతయితే మీరే కనుక్కోండి!" అన్నాడు బాలుడు. లోపల ఒక్కడే అయిపోయినాడు. ఇంకెవరన్నా కూడా వస్తే తనకు తోడుంటుందని ఒక ఆశా, లోపలికి వచ్చేదారి కనుక్కోవచ్చునని మరొక ఆశా వాణ్ణి పట్టుకుంది. అయితే మిగిలినవాళ్ళెవరూ లోపలికి పోవాలని ప్రయత్నించలేదు. లోపలినుంచి ఏదో చెప్పరాని భయం తన్నుకొస్తున్నది. కాని మిగిలిన వాళ్లు తనను చూసి అసూయపడుతున్నారనీ, అందుచేత తన కేమీ భయం లేదనీ బాలుడు తనకు తాను ధైర్యం చెప్పుకో సాగాడు.

ఇంతలో అక్కడికి పట్నంబావా మామా తిరిగి వచ్చారు. బోనూ, బోనులోపిల్లాడూ కనపడగానే పట్నంబావకు కాళ్లు చల్లబడ్డాయి. ఆ బోనేమిటో పట్నంబావ ఎరుగును.

"ఒరే అదేం పనిరా? దాని జోలి కెందుకు పోయినావురా?" అన్నాడు పట్నంబావ వొణుకుతున్న గొంతుతో.

తండ్రి గొంతు చెవిని పడగానే బాలుడు అణుచుకుంటూ ఉన్నభయంకాస్తా ఒక్కసారిగా పైకి తన్నింది. కాని వాడు దర్పంకొద్దీ "నాయిష్టం! కావాలనే లోపలి కెళ్ళాను! నేను బయటి కూడా రాను. ఇందులోనే ఉంటాను,"అన్నాడు.

పిల్లలందరూ గొల్లున నవ్వారు.

"నేను టార్జాన్‌ని! ఆ-ఆ-ఆ!"

పిల్లలు మళ్ళీ నవ్వారు. బాలుడి తల్లి కూడా చిరునవ్వు ఆపుకోలేకపోయింది. బోనంటే ఏమిటో ఆవిడకి సరిగ్గా తెలియదు.

మామకు లోపల మహాగ్ని ప్రజ్వరిల్లుతున్నది. ఎవరిమీదో తెలీదు. ఎందుకో తెలీదు. "ఇదంతా తప్పు! వీడీ బోనులో ఇరుక్కోవటం తప్పు! వీడు మాట్లాడేదంతా తప్పు! మిగిలినవాళ్లు హర్షించటం తప్పు! పట్నంబావ కాళ్ళూ, చేతులూ వొణుకుతూ తరతరలాడటం తప్పు! మొత్తం అంతా తప్పే!" అని మామ అంతరాత్మ ఆక్రోశిస్తున్నది. ఆయన బోనుచుట్టూ శ్రద్ధగా తిరిగాడు. లోపలికి వెళ్లే ద్వారమేదో ఆయనకు తెలిసింది. మెల్లిగా అడుగులు వేసుకుంటూ చువ్వల వంపునుబట్టి లోపలికి పాకాడు. కాని కింద రేకు కిందికి కొంచెం దిగింది. మామ ఒళ్లంతా చెప్పరాని భయంతో జలదరించింది. రెండో కాలితో బోను చువ్వను గట్టిగా పట్టుకుని బిళ్ళమీద పెట్టిన కాలు మరికాస్త గట్టిగా నొక్కాడు మామ. బాలుడు పట్టీపట్టని కంత ఏర్పడింది.

"బయటికి రా పుండాకోర్?"అన్నాడు మామ, చీలిన వెదురుగొట్టంలాటి గొంతుతో.

అదివరకల్లా బాలుడు ప్రకటించిన దర్పం హరించుకుపోయింది. వాడు గబగబా ముందుకొచ్చి తన కాలితో బిళ్ళను పూర్తిగా అడుక్కు నొక్కి బోనువాకిలికీ మామకూ మధ్య ఉండే సందులోనుంచి బయటపడటానికి కంగారుతో కూడిన యత్నం చేశాడు. బిళ్ళమీద వాడి కాళ్లు జారాయి.

"భద్రం, భద్రం! నన్ను లోపలికి లాగేవు! కంగారు పడకు. ఉపాయంగా రా! నన్ను గట్టిగా పట్టుకో. అట్లా! పక్క

(43-వ పేజీ చూడండి)



'ఫ్రాంకో-ప్రష్యన్' యుద్ధాన్ని గూర్చి నేనొక భయంకర గాథ చెబుతాను వినండి కామ్రేడ్స్ - అంటూ పొగత్రాగే గదిలో సమావేశమైన మిత్రులతో, 'మాన్సియర్ డియోడాలియన్'- తన కథ ప్రారంభించాడు

"ఫాబోర్గ్ డికార్టైల్'లో నా యిల్లు మీకు తెలిసే వుంటుంది. ప్రష్యన్లు అక్కడికి వచ్చినప్పుడు నేను ఆ యింట్లోనే వుంటున్నాను నా ప్రక్క యింట్లోనే, ఓ విధమైన 'పిచ్చిది' నివసించేది పాపం, ఆమెకి యీ లోకంలో 'నా' అని చెప్పుకోదగ్గవాళ్లు వొక్కళ్లూ లేకండా, భర్తా తండ్రీ - చివరికి అప్పుడే పుట్టిన తన ముద్దుల పసికందుకూడా - ఒకే నెలలో ఒకరితరువాత వొకళ్లు అకస్మాత్తుగా మృత్యువాత బడ్డారు ఈ మృత్యు వితఘాపరంపరని తలచుకుని ఆమెహృదయం అనంత

మూలం :

'మపాసా'

శోకంతో, అశ్రువాహినులు కార్చింది! ఆమె జీవితాకాశంలో ఆశాకాంతులు క్షీణించి, విషాదతిమిర మేఘాలు అలుముకున్నాయ్. యీ లోకంలోని సుఖదుఃఖాల అనుభూతికి ఉద్రేకపడే శక్తినశించి, చలనంలేని కఠినపాషాణ సమంఅయింది ఆమె హృదయం

"మృత్యుపిశాచి ఒకసారి యిల్లు ప్రవేశించిందంటే చాలు. యిక ఆ యిల్లు జన్మలో మరిచిపోదు. ఆ యింట్లో సర్వాన్నీ తన పొట్టన పెట్టుకునేదాకా పాత అతిథిలాగా, మళ్లీ మళ్లీ, ఆ యిల్లు ప్రవేశిస్తూనే వుంటుంది. ముగ్గుర్ని బలిగొన్నదీ చాలక, మృత్యుపిశాచి తిరిగి ఆ పిచ్చిదాన్నికూడా తన విషపంజాతో ఒక్క దెబ్బ కొట్టింది. అంతటితో ఆమె మంచంపట్టింది. ఆరు వారాల దాకా జబ్బుతీవ్రతలో యేవేవో పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడేది; ఏవో ఒకటే వెర్రిచూపులు చూచేది.

తరువాత ఆ జబ్బు తీవ్రత తగ్గిపోయింది. కాని ఆమెమతి చెడిపోయింది. అవయవాల పటుత్వం నశించింది. మంచంలోనుంచి లేచేశక్తికూడా లేదు. యెప్పుడూ అలాగే నాలుగు జాములూ మంచంలో పడుకుని వెర్రిగా కలవరిస్తూ, అందరివంకా అదేయిదిగా, కళ్లుమూయకుండా పిచ్చిచూపులు చూచేది. యెవరైనా ఆమెని లేపటానికి ప్రయత్నించబోతే - వాళ్లు తన్ను చంపబోయినట్లు పెద్దగా అరుస్తూ యేడ్చేది. అంతటితో వాళ్ళ ప్రయత్నం విరమించుకున్నారు. రోజు కొకసారి, శరీరం కడగటానికీ, ప్రక్కగుడ్డలు దులిపివేయటానికీ తప్ప - ఆమెని అసలు లేపేవాళ్లు కాదు. యెప్పుడూ మంచంలోనే అంటుకు పడుకునేది.

ఆమె కొక ముసలినౌకరు ఉన్నది. ఆ నౌకరే ఆమెకి కావలసిన పానీయమూ, చల్లారిన మాంసమూ అప్పుడప్పుడూ యిస్తూ వుండేది.

ఆమె యెవరితోనూ యేమీ మాట్లాడేది కాదు. ఆమె నిరాశాహృదయంలో యే బాధలు రగులుతున్నాయో? మరణించిన తన ఆప్తు లెవరైనా జ్ఞాపకానికి వచ్చి, గుండెలు కుమిలేటట్లు, యేడ్చే శక్తిలేక, మూగబాధ పడుతున్నాదేమో? తన గత చరిత్ర స్పష్టంగా స్మృతిపథానికి రాక విషాదస్వప్నాలు కంటున్నదేమో? లేకపోతే తన జ్ఞాపకాలు, ప్రవాహం లేక వాసనకొట్టే బురదగుంటలాగు విషాద బాధా పూరితాలైనాయేమో? యెవరికీ తెలిసేది కాదు. ఆమె అలాగే పదిహేను సంవత్సరాలు మంచానంటుకుపోయింది జీవచ్ఛవంలాగు.

డిశెంబరునెలారంభంలో యుద్ధం ప్రారంభమయింది. జర్మనులు 'కార్మెల్లు'కు వచ్చారు. అది నాకు నిన్నటిసంగతిలాగు స్మృతిపథంలో మెలగుతోంది. అప్పుడు నాకు జబ్బుగా వున్నది. బైటికి అడుగుపెట్టలేకుండా వున్నాను. యింట్లోనే పడకకుర్చీలో పడుకుని, కిటికీగుండా రోజూ మా యింటిప్రక్కగానే 'మార్చి' చేసే సోల్జర్లని చూస్తుండేవాణ్ణి. వాళ్లు యెంతో దూరంవరకూ ఒకే బారులో - చీమలబారుల్లాగు అటూ యిటూ యేమాత్రం తొలక్కుండా టకటకా నడిచేవాళ్లు.

'మార్చి' అవగానే వాళ్లంతా తిండికి గ్రామాలమీద పడేవాళ్లు. నాయింటికి సరిగా పదిహేడుమంది వచ్చిపడ్డారు. నా ప్రక్కింటి పిచ్చిదానింటికి డజనుమంది వచ్చారు. వాళ్ళలో - మానవత్వం మచ్చుకైనా లేని నరపశువు, వట్టి అల్లరివెధవ కమాండరుకూడా వున్నాడు.

మొదటి కొద్దిరోజులూ సక్రమంగానే గడిచినయ్. ఆఫీసర్లకి వాళ్ల ప్రక్కింటి యజమాని - పిచ్చిది - జబ్బుతో వుందని అందరూ చెప్పారు. దాన్నిగురించి ఆఫీసర్లేమీ అనుకోలేదు. కాని యెన్నాళ్లున్నా ఆమె వాళ్లకి అగుపించకపోయేసరికి, నిజంగా ఆమెకి జబ్బుగా వున్నదో లేక దొంగయెత్తేమైనా వేసిందేమోనని అనుమానం వేసింది.

'ఆమె కేం జబ్బు?' అని సోల్జర్లు ప్రశ్నించారు కోపంగా. యేదో పదిహేను సంవత్సరాలనుంచీ దీర్ఘవ్యాధితో బాధపడుతున్నదనీన్నీ, ఒక ఆ జబ్బు నయమయ్యేసూచన లేమీ లేవనీన్నీ వాళ్లు చెప్పారు.

సోల్జర్లు ససేమిరా నమ్మలేదు. ప్రష్యన్ల దగ్గరకి రాకండా, వాళ్లతో మాట్లాడకండా, చివరికి వాళ్ళని చూడనన్నా చూడకుండా, అధికారఅహంకారంతో మేడపైగదిలో పడుకున్నదని వాళ్లకి కోపం వచ్చింది.

కమాండరు మండిపడుతూ చరచరా మెట్లెక్కి ఆమె పడుకున్న గదిలోకి పోయి - ఆమెవంక చురచురా చూస్తూ — మేడమ్ నీవు క్రిందికి వచ్చి మాకందరికీ అగుపించాలి," అన్నాడు.

ఆమె యే సమాధానం చెప్పకుండానే, తన తల అతనివైపు త్రిప్పి, అతను చెప్పే భాష తన కర్థం కానట్లు ఒక అమాయకపు చూపు చూచింది.

కమాండరు మరింత క్రోధంతో —

"నీ అగౌరవం నే నిక సహించలేను. నీ అంతట నీవు లేచిరాకుంటే, యే సహాయం లేకండానే, నీచేత నడిపిస్తాను, యెలా నడవవో చూస్తాను!' అన్నాడు గద్దిస్తూ.

ఆమెకి యీమాటలు వినపడినట్లే లేదు. పూర్వంలాగే కదలకుండా చూస్తూ పడుకుంది.

కమాండరుకు అరికాలిమంట నెత్తికెక్కింది. ఆమె మౌనం, తన అధికారాన్ని తృణంకంటే హీనంగా చూచినట్లు మండిపడ్డాడు. "రేపేగనక లేవకండా యిలాగే పడుకో, యేం చేస్తానో!..... పళ్లు పటపట కొరుకుతూ బూట్లు మరింత ధ్వనిచేసుకుంటూ దిగిపోయాడు మెట్లు —

మరునాటి ప్రొద్దున్నే ముసలినౌకరు పిచ్చిదానికి దుస్తులు మార్చబోయింది. కాని ఆమె పసిపిల్లవానిలాగు యేడుస్తూ గిలగిలా తన్నుకుంటోంది. బాధతో ఇంతలోనే కమాండరు మెట్లు యెక్కివచ్చే ధ్వని వినపడ్డది నౌకరుకి. ఆమె గుండె గడగడ వణికింది. కమాండరు పైకి అడుగు పెట్టడంతోటే, నౌకరు ఒక్కసారి అతని కాళ్లు పట్టుకుని — "ఆమె క్రిందికి రాలేదు. అడుగుతీసి అడుగు పెట్టలేదు. క్షమించండి!" అంటూ బ్రతిమాలింది యేడుస్తూ.

కమాండరు ఒక్క క్షణంపాటు అలాగే నిలబడ్డాడు; యేమి చేయనూ తోచక అంత కోపంలోనూ, ఆమెని బైటికి యీడ్వమని తన సోల్జర్లకి చెప్పే ధైర్యం అతనికి లేదు. ఒక్కసారి ఫక్కున నవ్వి జర్మనీభాషలో యేవేవో ఆర్డర్లిచ్చాడు. వెంటనే ఒక జట్టు వచ్చి, గుడ్డపరిచిన 'స్ట్రెచర్'లో ఆమెని దొర్లించుకుని, గాయపడ్డ రోగిని తీసుకుపోయినట్లు భుజాల మీద పెట్టుకునిపోయారు. పాపం! పిచ్చిదాని కిదంతా యేమీ తెలీదు. మంచంలో వలెనే, 'స్ట్రెచర్'లో పడుకుంది - నగ్నశరీరంతోనే!

వాళ్ళ వెనక మరో సోల్జరు ఆమె గుడ్డల మూట పట్టుకుని పరుగెత్తుతున్నాడు. కమాండరు చేతులు రుద్దుకుంటూ -

"నీవు గుడ్డలు కట్టుకుని యెలా నడవవో చూస్తానులే పద!" అంటున్నాడు పిచ్చిదానివంక చూచి తల పంకిస్తూ.

ఆ జట్టు ఒక అడవివైపుకు చకచకా వెళ్ళింది. రెండుగంటలయేసరికి వాళ్లు మళ్ళీ తిరిగివచ్చారు. పిచ్చి'మాత్రం రాలేదు. వాళ్లామెని యేంచేశారో? యెక్కడికి తీసుకపోయారో? యెవరికీ తెలీదు."

రాత్రింబవళ్లు ఒకటే మంచు కురిసి, అడవులూ, మైదానాలూ తెల్లని పొగ

ముసుగులో మునిగినయ్. నక్కలు మరీ యింట్లసగ్గర కేవచ్చి భయంకరంగాకూస్తున్నై.

పిచ్చిదాని జ్ఞాపకాలు నన్ను కలవర పెట్టసాగినయ్. ఆమె జాడలు తెలుసుకోవాలని ప్రప్యేక అధికార్లకి యెన్నో అప్లికేషన్లు పెట్టాను. చివరికి యేమీ లాభం లేక వూరుకున్నాను.

వసంతం వచ్చేసరికి, యెక్కడ సోల్జర్లక్కడ మాయమయ్యారు. పిచ్చిదాని యింటితలుపులు మాత్రం, అలాగే బిగించి వున్నాయి. తోటలన్నీ, దట్టంగా గడ్డి పెరిగి, దార్లు కనబడకుండా వున్నాయి. పిచ్చిదాని ముసలినౌకరుకూడా చలికాలం లోనే చచ్చిపోయింది. కాని పిచ్చిదాని ఆలోచన యెవరికీ పట్టలేదు. ఆమెని వాళ్లేమి చేశారు? అడవుల్లోంచి ఆమె యెక్కడికైనా తప్పించుకుపోయిందా?

యెవరైనా ఆమెని దయతో ఆసుపత్రికి తీసుకుపోయారేమో? నాకేమీ పాలుపోవటంలేదు. నా అనుమాలు మరీ నన్ను బాధపెట్టసాగినయ్. కాని కాలప్రవాహంలో నాభయం క్రమంగా తగ్గిపోయింది.

వసంతం గడిచింది. నా జబ్బు నయమయింది. ఒకనాడు అడవికి వేటకని వెళ్లాను. అప్పటికే నాలుగైదు పక్షుల్ని కొట్టాను. ఆగోది, గుండుదెబ్బ తగిలి, చెట్టుకొమ్మలు దట్టంగా వ్యాపించిన కందకంలో పడ్డది. దాన్ని తీయటానికి అతికష్టంమీద కందకం లోనికి జారబడ్డాను. ఆశ్చర్యం! ఒక్కసారి నాకళ్లు జిగేలుమన్నయ్. ఆ పక్షి ఒక మానవశవాన్ని అంటుకుని పడివున్నది. వెంటనే పిచ్చిది జ్ఞాపకంవచ్చి నా గుండెలు ఒక్కసారి ఆగిపోయినయ్. ఈ యుద్ధం వత్సరం యిలాంటి అభాగినులు యెందరు యిలాంటి దుర్మరణానికి గురయ్యారో, లెక్కలేదు. అది ఆ పిచ్చిదాని తలే! యేమీ అనుమానం లేదు. నాకు బాగా గుర్తు వుంది. అది ఆమె తలే!

ఒక్కసారి పిచ్చిదాన్నిగూర్చి ఆలోచించాను. క్రమంగా అర్థమయింది. ఆ పిశాచిసోల్జర్లు ఆమెని తెచ్చి, యీ నట్టడివిలో ఏకాంతంగా విడిచివెళ్ళారు. పాపం, ఆ అభాగిని - పిచ్చిది. భోరున కురిసే ఆ మంచువర్షంలో, ఎముకలు కొరికే చలిలో, కాళ్ళూ, చేతులూ కదల్చకుండా అలాగే కళ్లు మూసుకుంది.

ఆమెశరీరం ఆకలిగొన్న అడవినక్కల కాహార మయింది. ఆమె పడుకున్న పక్క గుడ్డలు, ముక్కలు ముక్కలు చించుకుపోయి పక్షులు తమ గూళ్లు మెత్తగా కట్టుకున్నయ్. ఆమె బొమికెలు-వట్టి బొమికెలు మాత్రం నాకు దొరికినయ్. ఇలాంటి విష ఫలితాలను గలిగించే ఘోరయుద్ధాలకు మన సంతానం బలికాకూడదనే నా కోరిక."

[అనువాదం: సాంబయ్య].



పెళ్ళి మార్కెట్టు

డా. కే. వి ఆర్. నరసింహం

1 వ రంగం

(తెరలో) ఆడపిల్లా పుట్టింది. ఏదో పిల్లలే. తల్లీపిల్లా కులాసాగా ఉన్నారు కదా! అదే పదివేలు. (రెండు నిమిషాలు తరువాత) మగపిల్ల వాడా! పంచిపెట్టవోయ్ పుత్రోత్సవం. ఇంకా చూస్తావేం.)

(తరువాత తెర ఎత్తాలి)

లాయరు ధనపతిరావుగారి ఆఫీసు ఓ..... ఒక ప్రక్క రెండుకుర్చీలు, ఒక టేబిలు, రెండవ ప్రక్క ఒకబెంచీ ఉంటాయి. టేబిలుమీద రెండు మూడు పెద్దపుస్తకాలు! రెండు మూడు వార్తా పత్రికలు పడి ఉంటాయి. టేబిలుకి కొంచెందూరంలోనే ఒకవాలుకుర్చీ ఉంటుంది. ధనపతిరావు ఒడ్డూ పొడుగూగల మనిషి. కొంచెం తల నెరిసింది. గడ్డమూ మీసం చక్కగా క్షౌరం చేసుకొని ఉంటాడు. సన్నని ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచా కట్టుకుంటాడు. కళ్లకి సులోచనాలు, చేతికి రిస్టువాచీ ఉంటాయి. Easy chair లో కూర్చుని న్యూసు పేపరు చూసుకుంటూ ఉంటాడు. అతనికి కొంచెందూరంలో ఒక ఖర్జూరపు చాప మీదనున్న డస్కు పెట్టె ముందర గుమాస్తా కూర్చొని, ఏవో కాగితాలు వ్రాసుకుంటూ ఉంటాడు.

ధనపతిరావు :- (న్యూసుపేపరు టేబిలు మీద పెట్టి సులోచనాలుతీసి) ఏమోయి, బాలాజీ! మన రత్నాలింకా రాలేదే?

బాలాజీ :- ఏమో! ఈవాళ దావా వాయిదా కూడాను. ఈపాటికి రావలసిందే. (ప్రక్కకిచూసి) అదుగో; మాటలోనే వచ్చేరు.

రత్నాలు ప్రవేశం. పొట్టీకాక, పొడుగూ గాక సామాన్యంగా ఉంటాడు. ఒక ముతక ఖద్దరు ధోవతి కట్టి, ఖద్దరు లాల్చీ తొడుక్కుంటాడు. గడ్డం మీసం కొంచెం పెరిగుంటాయి.

రత్నాలు :- నమస్కారం, ప్లీడరు గారూ.

ధనపతి :- ఇదేవుటోయి, ఇదెప్పణ్నుంచి? -ఈ వంక నమస్కారాలు!

రత్నాలు:- అబ్బే ఇదేమి క్రొత్తగాదు. మనం ఎంత చిన్ననాటి స్నేహితులమైనా, మీరు చదువుకున్నవారు, ప్లీడరుగారు; అన్నిటికంటే ముఖ్యం పట్నవాసస్థులు! నేనేదో పల్లెటూరివాణ్ణి; నాకేంచదువా, సంధ్యా; కాబట్టి నావంటి మూర్ఖుడు నమస్కరించడం. తమవంటి విద్యావంతులు పరిగ్రహించడం ధర్మమే.

ధనపతి :- రత్నాలు- వంకమాటలు, డొంకతిరుగుళ్లు మానేసి మామూలుగా మాటాడు.

రత్నాలు :- ఊ కానీయండి

ధనపతి :- అదుగో, ఆ గౌరవించడమే వొద్దంటాను. నీమధ్యా నామధ్య ఈ అండీ లేవిటి? Nonsense.

రత్నాలు :- సరే. అండీలు దించేద్దాం.

ధనపతిరావు :- మనవేపు వర్షాలెలాగున్నాయోయ్? ఈ యేడేనా పంటలు బాగుంటాయా?

రత్నాలు :- ఆ! ఏం బాగో. ఇప్పటికి భూమ్మీద టక్కుని చినుకులేదు. పాపం రైతులందరు ఆకుమళ్లు దున్నుకొని, విత్తనాలు చేలల్లో పోసుకొని, ఆకాశంవేపు చూస్తూ కన్నీళ్లు కారుస్తున్నారు.

ధనపతి :- భయంలేదులే. మృగశిరా ప్రవేశం కాగానే భూమి చల్లబడుతుంది.

రత్నా :- ఏదో భగవత్కటాక్షం! ఈ యేడుకూడా పంటలు లేకపోతే మాలాంటి వాళ్లం అడుక్కొని తినాల్సిందే.

ధనపతి :- అడుక్కొంటే మాత్రం ఈ లేపను రోజుల్లో ముష్టివడు వేస్తాళ్లే.

రత్నా : ఏదో, నీలాంటి ధర్మదాతలు.

ధనపతి :-ఆ నేనో ధర్మదాతని. నువ్వో ధర్మయాచకుడివి! ఈ మాటలకేం లే! పదేళ్లు పంటలు పోయినా నీ కొట్లో ధాన్యం తరగవు.

రత్నాలు :- నాకొట్లో ధాన్యం తరగవు, నీ యినప్పెట్టెలో నోట్లకట్టలు తరగవు, నీ చెక్కు బుక్కులు చిరగవు. నువ్వు పట్టిన తనఖా బంగారాలు తిరగవు.

ధనపతి :- ఏవిటోయి, కవిత్వం చెపుతున్నావు? నేను నువ్వనుకొన్నంత ధనవంతుణ్ణి కాను. ఏమో ప్లీడరీ వృత్తిలో నాలుగు రాళ్లు సంపాదించుకొని గౌరవంగా మాత్రం కాలక్షేపం చేస్తున్నాను.

రత్నాలు :- అలాగా? అందుకేనా నీకొడుక్కి పదివేలు కట్నమడిగింది?

ధనపతి:- అదేమిటోయి; దానికీ, దీనికీ సంబంధమేమిటి? వాడు M. B. పాసయి House surgeon న్నాడు. వాడికాపాటి కట్నమివ్వరూ? సంబంధాల మీద సంబంధాలొస్తున్నాయి. ఏది చేద్దామా అని ఆలోచన.

రత్నాలు :- సర్కారు పాటెంత?

ధనపతి : (నిర్ఘాంతపోయి) ఏమిటోయి, నీ వేళాకోళాలు? నీ ధోరణి నాటికీ నేటికీ ఒకలాగే ఉండే.

రత్నా :- మొక్కయి వంగకపోతే మానయి వంగుతుందా అని సామెత. ఏమో

పల్లెటూరువాణ్ణి. చిన్నప్పుడు లేని నాజూకు తనం ఇంక మరి నాకొచ్చే దేవిట్లే? కాని నా ప్రశ్నకి సమాధానం?

ధనపతి :- ఇదేంపాట పాడ్డానికి వేలా ముట్రోయి?

రత్నాలు:- వేలంకాకపోతే మరేమిటి? ఒకరు పదివేలు, మరొకరు పదకొండు, మరొకరు పంద్రెండు! ఇదేగా వేలం పద్ధతి? నాకు తెలియదులే.

ధనపతి:- అవుతే నువ్విప్పుడనేదేమిట్రి? నాకొడుక్కి కట్నం పుచ్చుకో కూడదంటావా?

రత్నాలు :- అబ్బే, అంతమాట నాకో టంటవస్తుందా? ఒస్తే నువ్వింటావా?

ధనపతి :- (విసుగుతో) నేను వినకపోడ మేమిట్రోయి? ఇప్పుడు కట్నాలు పుచ్చుకోనివాడెవడో చెప్పు.

రత్నా :- అబ్బే పుచ్చుకోని వాడెవడున్నాడు, నాలాంటి దరిద్రుడు తప్ప? అంగుల్లోను చదువుకున్న వారాయె. డిగ్రీలతో పాటు కట్నాలు పెరగాలి.

ధనపతి : పెరగడం సహజమేగా? మరి ఆచదువుకైన మదుపో?

రత్నాలు :- అవును. సమయాను కూల ముగరేట్లు హెచ్చింప బడును-కాని ఎంత మదుపెట్టినా, రూపాయికి రూపాయి లాభంచూసుకున్నా అదో మాదిరి- కాని రూపాయికి నాలుగు రూపాయిలా లాభం?

ధనపతి :- ఇదేం బ్లాకుమార్కెట్టనుకున్నావేమిట్రోయి, లాభాలు లాభాలంటున్నావు?

రత్నాలు :- అబ్బే. కంట్రోలు సరుకవుతేగా బ్లాకుమార్కెట్టుకి? ఇది పబ్లికు మార్కెట్టే.

ధనపతి :- ఏమిటో నీమాట లెప్పుడూ యిలాగే ఉంటాయి. దానికేంగాని- రత్నాలు, అవధాన్లుగార్నెరుగుదువోయ్? విజయనగరం.

రత్నాలు :- ఆ, ఎరుగుదును. ఏమిటి కథ?

ధనపతి :- వారబ్బాయి ఒకడున్నాడట కదూ?

రత్నా :- ఊఁ ఉన్నాడు.

ధనపతి :- ఇప్పుడు B. Sc. చదువుతున్నాట్ట.

రత్నాలు :- అవును. అయితే?

ధనపతి :- (విసుగుతో) అయితే, గియితే ఏమిట్రోయి? ఇంకా నామాటల్లో అంతరార్థం గ్రహించలేవు.

రత్నా :- అంత అంతరార్థంతో నువ్వు మాటాడితే అర్థం చేసుకోనే బుర్రానాది? అలాగైతే నేనూ ఒక బల్లకట్టే ఉందును.

ధనపతి :- నువ్వే బల్లకడితే మా అందరికీ యింక తువరమే! (నవ్వును)

రత్నాలు :- ఓహోహో! అపాటి లేకపోతే నాతలమీద ఒక్క వెంట్రుకేనా మీ దుండనిస్తారూ? (ఇద్దరూ నవ్వుకుందురు)

ధనపతి : ఈ మాటలకేం గాని, మా అమ్మాయికొక వరుడు కావాలి.

రత్నాలు :- అమ్మయ్య! ఈ మాట మొదటే చెబితే! అసావాదితోఽ బ్రహ్మ అని ముప్పతిప్పలూ పెట్టేవు. సరే. కట్నమే పాటిస్తావు?

ధనపతి :- ఆ! నేనేమి టివ్వగలనోయ్. సామాన్య సంసారిని? నీకు తెలియందే వుంది గనక. ప్లీడరీవల్ల ఒచ్చేది భూతాదులకై పోతుంది. పైగా పిల్లల చదువాయె. మరి భూములూ పంటా నీకు తెలియని భాగోతం కాదుగా.

రత్నాలు :- అలాగా? అవుతే నువ్వది ఒదులుకో. వాళ్ల సత్కారు పాట అయిదు వేలు.

ధనపతి :- అదేవుట్రోయి? అవుధాన్లు చాల Advanced Views ఉన్న వాడని విన్నానూ.

రత్నాలు :- Advaned Views కలవాడే ముఖ్యంగా తన డబ్బుకి Capitalist ఒకళ్లడబ్బుకి Communist.

ధనపతి :- ఇవే నా Advanced views?

రత్నాలు :- కాకేం? తాను Advance అవడానికి, ఒకరికి Advance ఇవ్వడానికి పనికొచ్చే views, ఎడ్వాన్సున్న్యాయకు కాకపోతే ఇంకేవి?

ధన :- సెబాష్, బాగా చెప్పేవు. ఏదో వాడి views మాట మనకెందుకు గాని, ఎలాగో అసంబంధం కుదిర్చిపెడుదూ, నీ పుణ్యంవుంటుంది!

రత్నాలు :- నా పుణ్యంవున్నా, లేకపోయినా వాడికివ్వవలసిన కట్నం మాత్రం ఉండితీరాలి. మొదట దాని సంగతాలోచించు.

ధన :- దానికేం లే ఆలోచించే ఉన్నాను. చూడు, రత్నాలు! నువ్వేదో పూర్వకాలపు కబుర్లు చెబుతావుగాని. నాకొడుక్కొ పాటి కట్నం పుచ్చుకోకపోతే, మరి యీ బడ్జెట్ ఎలా మీటవడం చెప్పు.

రత్నాలు :- భేష్! ఈ కిట్టుబడిబాగుంది. ఉప్పులో నష్టానికి, పప్పులో లాభానికి, సరికిసరి, బరికిబరి. కాని, నువ్వు దిక్కుమాలిన ఈ ప్లీడరు పని ప్రారంభించేవుగాని, లేకపోతే కోమటి గుమాస్తాగా బారిగా shine అయి ఉందువు.

ధన :- ఏమిట్రోయి, నీ అవకతవక మాటలు, ఇంకా నే న్నయమే. ముక్కుపచ్చలారని ఆడపిల్లల్ని ముసిలి పీనుగులకంట గట్టి డబ్బు చేసుకునే వాళ్లున్నారు. తెలుసా?

రత్నాలు :- తెలుసు, మహాప్రభో తెలుసు. కాని నావంటి నిర్భాగ్యులకి తెలిసినా, తెలియక పోయినా ఒకటే ప్రయోజనం. ఎప్పుడైతే ఆ అమ్మబడే వాళ్లకి తామూ ఇంగితజ్ఞానం ఉన్న మనుష్యులమే అని, సంతలో వేలం పాడడానికి పసువులం కామని తెలుస్తుందో అప్పుడీ నాటకాలన్నీ కట్టిపోతాయి. అంతవరకు నేను కాదుకదా నన్ను పుట్టించిన దేవుడొచ్చినా యీ దౌర్జన్యాలు కట్టవు.

ధన .- అదేమిట్రోయ్! వాళ్ళంతా యింగితజ్ఞానం లేనిపసువు లంటావా? పెద్ద చదువు చదువుకున్న వాళ్లు.

రత్నా :- చదువులు : నా మొహం చదువులు. ఎందుకండీ యీ చదువులు అత్మబలం లేదు, మానసికబలం లేదు. తుదకు దేహబలంకూడా లేదు. నైతికబల వాదానికే, మనకే చాలా దూరం. ఇంకా యీ విద్య ఎందుకు? పొట్టపోషించుకోడానికి? ఆపాటిదాని కింతేసి చదువు లెందుకు? కిరాణాకొట్టు పెట్టకోరాదు. రోజుకి కనీసం పదిరూపాయిలు లాభం ఉంటుంది.

ధన :- బాగుందోయ్, ఇంత చదువూ చదివి కిరాణాకొట్టు పెట్టమంటావు. దమ్మిడీ దగ్గర్నుంచి అబద్ధాలాడుకుంటూను.

రత్నాలు :- కొంపద్రుకద ప్లీడర్లు గారూ! మరి-తమరు-చేసేపనో-

ధన :- (రత్నాలుబుజం తడుతూ) గట్టివాడివోయ్. సరే ఈ వాదనకేంలే. ఈ ప్రపంచకాన్ని నువ్వూ, నేనూ బాగుచేస్తా మేమిటి. కాని నామాట మతిచిపోకు. మా అబ్బాయిని సిరిపురం పంపించేను. అక్కడో చిన్న బంజరుంది. అది అమ్మకం చేసి డబ్బు పట్రమ్మని. కాబట్టి పాటంలో నువ్వూ కొంచెం నిలబడు. ఏదో ఈ పిల్ల పెళ్ళయిపోతే నేనూ చేతులు దులుపుకోవచ్చు.

రత్నాలు :- సరేకాని మీ అమ్మాయి ఏమైనా చదువుకుందా?

ధనపతి.- (సగర్వంగా) ఓ, అందులో లేమిటి. ఇంటరు చదువుతూఉంది.

డాక్టరు :- ఓహోహో. తపస్సంటే మా డాక్టర్లదే తపస్సు. మీ పురోహితుల్లాట్టి దొంగజపమే.

సుబ్బమ్మ :- అంతేలెండి. వీళ్ల తపస్సులు మండిపోను. దొంగజపం చెయ్యగానే పుణ్యమొచ్చేస్తుందీ. కండలారా కనుక్కున్న పిల్లల్ని ముసిలిముండాపీనుగుల కంటగడితే పాపం లేదూ.

వెంకన్న :- (కోపంతో) ఏవిటే ఆ వాగుడు. పిన్నా, పెద్దా.

సుబ్బమ్మ :- పిన్నా, పెద్దా కాబట్టే చెప్పడం. నిజం చెబుతాను వినండి డాక్టరుగారూ! మా అమ్మాయికి ఏ గుండె జబ్బు లేదు. వారంరోజుల క్రిందటి వరకూ చక్కగా బడికెళ్లి చదువుకువచ్చేది. ఈ మధ్య వాళ్ల నాయన, ఓ ముసిలిపెళ్లికొడుకుని తీసుకొచ్చి వాడికి అమ్మాయి నిచ్చి పెళ్లిచేస్తా నన్నారు. అంతలో మా అమ్మాయి బెంగపెట్టుకుని, నిద్రాహారాలు మానేసి, తుదకిలా అయింది.

డాక్టరు :- I See. ఇదా సంగతి. సరే. ఈ జబ్బుకి నాదగ్గర అమోఘమైన మందులున్నాయి. ఒక్క ఇంజక్షనుతో, ఇదంతా బాగు చెయ్యగలను. కాని—

సుబ్బమ్మ :- అదేదో యిచ్చి పెడుదురు బాబూ, ఆలోచన కిది సమయం కాదు.

డాక్టరు :- అహఁ. అదికాదు; ఇంజక్షనులు మూడు రకాలున్నాయి. No One ఇంజక్షన్, No Two ఇంజక్షన్, No Three ఇంటరేజక్షన్. వీట్లో ఏ దిద్దామా అని ఆలోచన.

వెంకన్న :- ఆ ఇంటరేజక్షన్నే యిప్పెద్దురూ.

సుబ్బ :- ఆ మూడూ యిస్తేనో.

డాక్టరు :- అవునమ్మా! ఆ మూడూ యిస్తే మరీ మంచిది. కాని డబ్బు....

సుబ్బ :- వెధవ డబ్బు; నాపిల్ల బాగుంటే నా కదే పదివేలు.

డాక్టరు :- వేలంటే జ్ఞాపకం ఒచ్చింది. అవధాన్లుగారూ బేరం ఎంతక్కుదిరింది.

వెంకన్న :- ఆఁ ఏం బేరం లెండి. ఏదో అయిదువేలు; పిల్లపేర ఓ పదెకరాల పొలం రాస్తాడు. మంచి మాగాణియే లెండి.

డాక్టరు :- మంచి గడుసువాడివే. దాదాపు పాతిక ముప్ఫైవేలాస్తి కనీసపక్షం చూసినా.

వెంకన్న :- మన జన్మలో ముప్ఫైవేలార్జించగలమండీ, ఆడవాళ్లేదో అరుచుకుంటారు. అంతమాత్రాన్ని ఇటువంటి లాభసాటి బేరం వదులుకోగలమా?

డాక్టరు :- Yes; I concur నే నొప్పుకున్నాను. ఓలాగు చూస్తే ఆడపిల్లల్ని కనుక్కోడం బాగానే కనిపిస్తూ ఉంది. Ready cash, చెక్కు మార్చుకున్నట్టుగా.

సుబ్బ :- అదేవిటండీ డాక్టరుగారూ? మీరూ అలాగే అంటారూ? మా బంగారు తల్లిని ఆ ముసలి పీనుక్కలా గివ్వడమండీ?

డాక్టరు :- There you are. మీరక్కడున్నారు. అసలు బంగారు తల్లుల్ని ముసలాళ్లకిచ్చే పెళ్లిచేయాలి. ముసలివాళ్లకి తెలిసినట్టుగా బంగారంవిలువ పడుచువాళ్లకి తెలుస్తుందా? అసలింత రాద్ధాంతం దేనికి? మూడురోజులు నాట్రీటుమెంటులో ఉంచేరంటే ముసలాళ్లని పడుచువాళ్లని చేస్తాను.

వెంకన్న :- అద్దదీమాట; మొన్నను మా ప్లీడరుగారి కొడుకుని యీ విషయమే అడిగేను. వాళ్ళమొహం యీ ఇంగ్లీషు డాక్టర్లకేం తెలియదులెండి. అబ్బాయీ! ముసలివాళ్లు పడుచువాళ్లవడానికే దైనా మందు, ఘుట్టిదుండా అంటే, నవ్వేసూరుకున్నాడు. వాళ్లమొహం, ఈ ఇంగ్లీషు...

డాక్టరు :- ఇంగ్లీషుడాక్టర్లనకండి; నేనూ ఇంగ్లీషుడాక్టర్నే. ఈ M. B గాళ్ళతే మీరాదని నావాదన. ఆయనా, M B ఏనా?

వెంకన్న :- అవునండీ మొన్ననే డాక్టరు పరీక్ష పేసయాట్ట.

సుబ్బ :- ఆ అబ్బాయి చాలా తెలివైనవాడండీ. అన్ని పరీక్షలు ఫస్టుగా పేసయాట్ట. ఇప్పుడు ఇంకా పెద్ద చదువు చదువుతాట్ట. పెద్దాసుపత్రిలో పనికూడా అవుతుందట. వాళ్ల తాతగారి ఊరు ఈ ఊరే కదండీ. సోలూరవారు. చిన్నప్పుడు ఈ ఊళ్లోనే చదువుకునేవాడు. మా పిల్లా ఆ అబ్బాయీ ఆడుకుంటూ ఉంటే చిలకాగోరెంకల్లా ముచ్చటగా ఉండేది. చాలా తెలివిగల కుర్రవాడు లెండి.

డాక్టరు :- ప్రద్యోతమటండీ! ఎవరో అనుకున్నాను సరిసరి. కాని యీ M. B లకి సూక్ష్మబుద్ధుండదండి. ఎన్ని పరీక్షలు పేసైతేనేం మాబావ మాబావే అన్నాట్ట. ఏదీ ఒక్కటే ఒక్క మందుతో, నూరుజబ్బులు కుదురుస్తా న్నేను. వాళ్లని కుదర్చ మనండి?

వెంక :- ఆ మందేదో చెబుదురూ, కొనుక్కొని ఇంట్లో దాచుకుంటాను.

డాక్టరు :- మందుపేరు తెలుస్తే సరా; ప్రయోగమో. అది తిన్నవాళ్లు అజరామరులౌతారని మా Scientific చెబుతూంది. అజరా అనేది ఒక దీర్ఘజబ్బు. అది పోయి మరలాగ పనిచేస్తారని దానర్థం.

వెంకయ్య:- మా దేవతలు కూడా అజరామరులే అంటారండీ?

డాక్టరు :- ఏడిసేరు? అవుతే వాళ్లు ఈ Scientific ఎరుగుదురన్న మాట. ఏదైనా మీ దేవతలు గడుసుకుంకల్లెండి. మంచి మందులన్నీ మొదట వాళ్లే తినేసేరు.

వెంకయ్య :- ఏదైనా ఆ మందుపేరు చెప్పేరుకారు?

డాక్టరు :- (చిరునవ్వుతో) మీరు సామాన్యంగా వదలరండోయ్. సరే; సావధానంగా వినండి, మరిచిపోగలరు. (సగర్వంగా) దానిపేరు సి-బ-జాల్ (దీర్ఘం తీయును) చూసేరూ! ఇప్పటి డాక్టర్లకి మందులపేర్లు కూడా రావు. ఇంగ్లీషులో 'ఏక్వామెడికా' అని ఓ పెద్ద పుస్తకం ఉంది. మన మహాభారతానికి పదింతలుంటుంది. అది రావణాసురుడు రాసి, మన రాముడిమీద కోపంకొద్దీ, ఇంగ్లీషువాళ్లకిచ్చి చచ్చిపోయాట్ట. దాంట్లో Liquid Parafinum అని ఓ మందుంది. అదిగాని మీరు రెండుపూటలు సేవిస్తే, మీరు మళ్లీ పదహారేళ్ళ బాలకుమారుడైపోతారు.

వెంకన్న (చేటంత ముఖంతో) :- ఏదో ఆమందు సంపాదించిపెడుదురూ? ఎంత డబ్బైనా ఇచ్చుకుంటాను. ఆ మందు ఆడవాళ్లకి కూడా......

సుబ్బ :- చాల్లెండి. ఏళ్లెగసనా; బుద్ధి దిగసనా? ఏమండీ డాక్టరుగారూ! ఎందుకీ అధికప్రసంగం. గంటసేపయింది పిల్ల తెలివి తప్పి పడిఉంటే, మందివ్వడం మానేసి, కాటికాళ్లు చాచుకుచున్న మా కెందుకండీ యవ్వనానికి మందులు. (కోపంతో) చచ్చేకాలం ఒచ్చినా మనకి తీర్లేదు వాంఛలు. ముక్కుపచ్చలారని పిల్ల, ఆ మూడుకాళ్ల ముసిలిపీనుగు నెలా పెళ్లాడుతుందనుకున్నారో?

డాక్టరు :- ఉండండమ్మా. తొందరపడితే ఎలా? ఒక్క ఇంజక్షనిచ్చేనంటే ఆ అమ్మాయి లేవగానే ముసలివాళ్లని తప్ప పడుచువాళ్ళని పెళ్లే ఆడననేస్తుంది. చూసేరమ్మా! నా Experience మీకు తెలియక అలా చులకనమాటనేసేరు. నేను పూర్వకాలంలో Third form ఫేలయేను. తరవతా Training కెళ్లి, అదీ Fail అయేను. అసలు నేను ఫేలయిన పరీక్షలు వందున్నాయి లెండి. వాటి మాటకేం? ఆఖరికి కాంపౌండర్ గిరీ. అదీ దొర్లదగ్గర. నా యింగ్లీషంతా దొర్లింగ్లీషే.

ఈ పరీక్షలో తేలే అనర్హులలో Join చేస్తాను.

రత్నాలు : (తల గోక్కుంటూ) చంపేరే.

ధనపతి :- (నిర్ఘాంతపోయి) అదేమిటది, అలా గంటూన్నావు.

రత్నాలు :- అలాగే అనవల్సొచ్చింది. ఇప్పటి యువకుల్ది అదో విపరీతబుద్ధి, తన భార్య చదువుకున్నదీ అయిఉండాలి, చదువురాంది అయిఉండాలి.

ధనపతి :- (ఆశ్చర్యంగా) అదెలా గోయ్. నీమాట లెప్పుడూ విపరీతంగానే ఉంటాయి

రత్నాలు :-అవుతే విను, విడమఱచి చెబుతాను. చదువురానిదాన్ని పెళ్లాడితే Uneducated brute ని పెళ్లాడే వని అందరూ వెక్కిరిస్తారని ఒక భయం. పోనీ చదువుకున్నదాన్ని పెళ్లాడదామా అంటే అది తనమీదకే ఎదురుతిరుగుతుందేమో అని అదొక భయం. ఇంకా మరో విశేషం. తనభార్య, పెళ్ళయేవరకు చదువుకున్నదయిఉండాలి. పెళ్లయిం తరువాత చదువురాందయిఉండాలి. నలుగురిలోను చదువుఒచ్చిందయి ఉండాలి. ఒంటరిగా చదువురాందయిఉండాలి. సంతోషంగా హుషారుగా తనున్నప్పుడు చదువొచ్చిందయి ఉండాలి. కోపంగా, చిరాగ్గా తనున్నప్పుడు చదువు రాందయిఉండాలి. ఇంతెందుకు, తనకి కావలసినప్పుడు చదువొచ్చింది, అక్కర్లేనప్పుడు చదువురాంది అయిఉండాలి.

ధనపతి : (నిర్ఘాంతపోయి) ఇవి హిరణ్యాక్షువరాల్లా గున్నాయే.

వకుళ ప్రవేశం. వేషం అంతా ఇప్పటికాలేజీలో చదువుకుంటున్న విద్యార్థినుల వేషం లాగుండాలి.

వకుళ :- నాన్నగారూ! అమ్మ భోజనానికి రెమ్మంటూ ఉంది.

ధనపతి :- ఇదేనోయి మా అమ్మాయి. లే భోంచేద్దాం.

రత్నాలు :- అందుకేగా నిన్ను శ్లీడరుగా పెట్టేంది. నే నిచ్చే ఫీజుకి, తినే తిండికి సరిపోతుంది.

ధనపతి :-నీ యెగతాళిమాటలు కట్టిపెట్టి భోంచేద్దాం లే. నేను ప్రొద్దుటే స్నానం చేసేస్తాను. నువ్వూ స్నానం చేసినట్టే ఉన్నావు

రత్నాలు :- మరేవీ అభ్యంతరాల్లేవు.

(అందరూ నిష్క్రమిస్తారు. తెర)

2 వ రంగం

స్థలం సిరిపురంలో ఓ, యిల్లు. ప్రవేశం సుబ్బమ్మ; నలభైయోపడిలో ఉన్న మనిషి. అడ్డకచ్చ. పసుపురాసుకున్న ముఖం మీద కానీఅంత కుంకంబొట్టు. మెళ్లో నల్లపూసల కుత్తిగంటూ; మంగళసూత్రం.

సుబ్బమ్మ :- (తొందరగా గుండె బాదుకుంటూ) అయ్యో! అయ్యో! రండ గ్రోయ్; రండ గ్రోయ్, నాపిల్ల నాపిల్ల.

వెంకన్న తొందరగా ప్రవేశించును. 60 ఏళ్లు పైనుంటుంది యీడు. కాని కాయశరీరం. పద్ధెంజలు మడిచి కట్టిన పంచె. పైని ఉత్తరీయం; మెళ్ళో రుద్రాక్షలు; విభూతి పెండికట్లూ. చంకని పంచాంగం;

వెంకన్న :- (కంగారుగా) ఏవే ఏవే ఎందు కలా అరుస్తున్నావ్. ఏం నీకొంప మునిగింది?

సుబ్బమ్మ :- కొంప మునగడ పేమిటి నీమొహం నామొహం; పిల్ల ఒక్కగాని ఒక్కపిల్ల తెలివితప్పి పడిపోతే.

వెంకన్న :- (మరీ కంగారుగా) ఆ ఏమిటన్నావు. తెలివి తప్పి పడిపోయింది. పద పద. ఆఁ ఆఁ ఉండు ఉండు. కొంచెం చన్నీళ్లు పట్రా. (సుబ్బమ్మ నిష్క్రమణం) ఒరే సోమాయ్. సోమాయ్.

సో :- సిత్తం బాబయ్యా.

వెంక :- ఒరే సువ్వేగంగా పోయి డాక్టరుగార్ని పిలుచుకురా, పిల్ల తెలివి తప్పిపడిపోయింది. పదా త్వరగా.

సోమా :- సిత్తం (పరుగెత్తును).

వెంకన్న :- డాక్టరొచ్చేలోపల కొంచెం చన్నీళ్లు మొహంమీద జల్లుతే నయంగా ఉంటుందనుకుంటాను. (నిష్క్రమించును.) తెర తెర ఎత్తగానే, క్రిందపడి ఉన్న శాంతమ్మ, ఆమెతల ఒడిలో పెట్టుకొని ఉన్న సుబ్బమ్మ, ప్రక్కని తండ్రి వెంకన్న కనపడతారు. వెంకన్న తడిగుడ్డ నుదిటిమీద వేస్తూ ఉంటాడు. డాక్టరు ప్రవేశం, కాకీనిక్కరు. కాకీ హాఫ్హారమే షర్టు. మేజోడు లేని జోడు. ఆ యన్ని చూడగానే వెంకన్న లేచి నిలుచుని నమస్కారం చేస్తాడు.

వెంకన్న :- (దిక్కుమొగంలో) నమస్కారం డాక్టరుగారూ! దయచెయ్యండి. (ఒక కుక్కిమంచం చూపెడతాడు)

డాక్టరు :- (దానిమీద కూర్చొని) బోధపడింది. I understood the whole Case. నాకీ జబ్బులక్షణమంతా తెలిసిపోయింది. చూసేరూ! వెంకన్నగారూ! ఈకాలం కలికాలం. కాబట్టి పాపం పండిపోయింది.

వెంకన్న :- అంతేనండీ. పాడుముండా కాలం ఒచ్చిందీ. మాలా మాదిగా అంతా ఒకచేటిట. మావ్యాసులవారు ఆమాటే చెప్పేరు.

డాక్టరు :- చెప్పేరు కద. ఆ మాటే నేనూ చెబుతున్నాను. ఈ పాడుకాలంలో ఒక ఘోరమైన, మహా ఘోరమైన జబ్బు బయల్దేరింది. అది ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్నది. దాని Heart Weakness అంటారు మా డాక్టర్లు. దాన్ని మొదట కనిపెట్టి దాని దుంపతెంపి, పాతాళానికి పాతాళాని కణిచేసినఘాణ్ణి నేను. ఈ M: B. B. S C కేం తెలుసునండీ డాక్టరుగిరీ.

సుబ్బమ్మ :- ఏదో బాబూ! తమ దయుండాలి. మొన్న మా పక్కింటాయనికి కడుపు నొప్పొచ్చి సుల్చుకుపోతూ ఉంటే, ఒక్క మోతాదుతో బాగుచేశారు కారూ?

డాక్టరు : (చేటంత మొగంతో):- చూసేరా అమ్మా! మందు పడితే గుణం అలా ఉండాలి. కాని ఆయన మరో పదిరోజులపాటు మందు పుచ్చుకోవాల్లెండి. సరే దానికేం. ఈ హార్టుడిసీజు అన్న జబ్బుందే ఇది చాలా Dangerous, అంటే చాలా ప్రమాదకరం. Sudden గా మనిషి మంచినీ ళ్లడక్కుండా చచ్చిపోవచ్చు.

సుబ్బమ్మ :- అయ్యో.

డాక్టరు :- మరేం భయంలేదులెండి నే నున్నానుగా. ఈజబ్బుని ఇంగ్లీషులో, Dangerous Trecherous Pernicious Anemia అంటారు.

వెంకన్న :-అబ్బా! ఎంత పేరండీ. మన తెలుగుజబ్బులకి వేటికి అంతేసి పేర్లు లేవు.

డాక్టరు :- పెద్దజబ్బులు. తెలుగు జబ్బు లొక జబ్బులు. తెలుగుమందు లొక మందులు. అసలు మా డాక్టర్లు, ఇంగ్లాండు, అమెరికా, జెకోస్లొవోకియా, కొరియా, మరియా, మనుసారియా, మొదలైన దేశాల్లో ఘోరతపస్సు చేసి, ఈ జబ్బుల్ని ఈమందుల్ని కనిపెట్టేరు.

వెంకన్న :- (ఆశ్చర్యంగా) డాక్టర్లు తపస్సు కూడా చేస్తారండీ?

ఈ మనవాళ్ల చచ్చినింగ్లీషు కాదు. అసలు నేను మాటాడినట్టుగా, యూనివర్సిటీ యింగ్లీషుప్రొఫెసర్లు కూడా మాటాడలేరు. అదలా ఉణ్ణీయండి. ఇక మెడిసన్, అంటే మందులన్నమాట. దాల్లో నేను,అఖండుణ్ణి. దొర్లదగ్గర తరిఫీదు చూడండీ. కాంపౌండరుగా Retire అవుతూ, డాక్టరు గిరికి పెర్మిషన్ పొందేను. చూడండీ నిమషంలో, మీఅల్లుణ్ణి పడుచువాణ్ణేనా చేసేస్తాం. లేదా టూకీపని, మీ అమ్మాయిని ముసిల్దాని గా నేనా చేసేస్తాం. నాకుమాత్రం తెలియదండీ ఈడూ జోడూ అని.

సుబ్బ :- ఏడిసినట్టే ఉంది నీ మందుల ప్రభావం. ఇప్పట్లో మా ప్రద్యోతమే ఉంటే ..

* * *

(ప్రద్యోతం ప్రవేశం. సూటూ కళ్లకి సులోచనాలు)

సుబ్బ :- అడుగో నాయన మాటలో నే వచ్చేడు. నూరేళ్లాయుష్షు. (కళ్ళనీళ్లతో) గంటసేపైంది పిల్ల తెలివి తప్పి...

ప్రద్యో :- ఉండండి; మీరేం భయపడకండి. (చేత్తో చన్నీళ్లు మొగంమీద కొట్టి, ముక్కుకేదో వాసన చూపెడతాడు. ఆమె కొంచెం కళ్లు తెఱిచి. ప్రద్యోతాన్ని చూసి, సిగ్గుపడి, లేవబోయి నీరసంచేత మళ్లీ పడిపోతుంది.)

సుబ్బ : అమ్మయ్యో !

ప్రద్యో : మీరు కేకలెయ్యకండి. (వెంకన్నవైపు చూసి) మీరు కొంచెం వేడికాఫీ పట్రండి.

(డాక్టరు మెల్లి మెల్లిగా జారిపోబోవును.)

ప్రద్యో : కొంచెం పస్తాయించండి డాక్టరు కాంపౌండరు గిరీగారు. ఒకమారు, ఆ రావణాసురుడు రాసిన Aqua medica, పుస్తకం నాకు చూపిస్తారూ ? (కాఫీ తెచ్చి పెట్టగా శాంతమ్మ లేచి కూర్చుంటుంది)

ప్రద్యో : (డాక్టరుతో) ఏమయ్యా నీకేమతుందా లేదా, ముందు పేషంటుకి మందిస్తావా ? నీ బడాయిలేనా ? ఆమెకి, Weakness చేత హార్టు స్టాపవుతే.

డాక్టరు : (గుటకలు వేస్తూ) కొంచెం పనుంది. ఇప్పుడే ఒస్తా (గుమ్మం దాకా మెల్లిగా నడిచి తరువాత ఒక్కటే పరుగు)

సుబ్బ : అమ్మా ! శాంతా ! మన ప్రద్యోతనే, పలకరించు.

శాంత : (సిగ్గుతో) మీ రెప్పుడొచ్చారండీ !

ప్రద్యో : ఇదేమిటి నన్ను 'మీ' గు అంటున్నావు. నేనేం కొత్తవాణ్ణా; మన్నన మనిషినా ?

సుబ్బ : ఏదో నాయనా పెద్దవాడివయావు. పెద్ద పరీక్షలు పేసయావు. ఇప్పుడూ మన్నించకుండా పూర్వంలాగే పిలుస్తే ఎలాగు. చిన్నప్పుడు మీ రిద్దరూ ఆడుకుంటూ ఉంటే ఎంతో ముచ్చటగా ఉండేది. నేనూ మీ అమ్మ వియ్యమందుదామనుకున్నాం కూడా.

శాంత : ఏమిటమ్మా నీ మాటలు. (అంటూ లోపలికి పోతుంది)

ప్రద్యో : ఇప్పుడుమాత్రం వియ్యమొందడాని కభ్యంతర మేముంది.

సుబ్బ . మాకంతపాటి అదృష్టమా ?

ప్రద్యో : ఆమాటే నేనూ అంటా. లోపలికి పదండి. అన్ని సంగతులు మాటాడుదాం. (తెర)

3 రంగం

స్థలం అవధాన్లుగారి యింటిచావిడీ. ఉదయం 8 గంటల వేళ. అవధాన్లు ఒకవాలు కుర్చీలో కూర్చుంటాడు. ఎదురగుండా ఒక కుర్చీలో రత్నాలు.

రత్నా : అవుధాన్లుబావగారూ ! మీ నోటంట మరోమాట రానీవాలి. మనలాంటి

(42-వ పేజీ చూడండి)

6-12-50

సినిమా:

పత్రికలూ - సినిమాలూ

పత్రికలకి సినిమాలతో పని ఉన్నది. సినిమా ప్రకటనలు పత్రికలకు ఆర్థికంగా తోడ్పడతాయి. సినిమాస్టిల్స్ పత్రికల అందాన్ని పెంపొందిస్తాయి. సినిమాకు సంబంధించిన వార్తలు వగైరా పత్రికలు చదివేవారిని ఆకర్షిస్తాయి.

సినిమాలకి పత్రికలతో పనిఉన్నది. పత్రికలు ప్రకటనలువేసి, స్టిల్స్ వేసి, రైటప్స్ రాసి సినిమాలకు అపారమైన ప్రచారం కలిగిస్తాయి. స్వంతాన చేస్తే ఎన్నిలక్షల రూపాయలతో కూడా జరగని ప్రచారం కొద్దివేల రూపాయలతో పత్రికలు సినిమాలకు చేసిపెడతాయి.

పత్రికలూ, సినిమాలు - పరస్పరం ఆధారపడి ఉన్నటువంటివి. అందుచేత వీటికి పరస్పరం గౌరవం ఉండటం [illegible] లకు లాభం. ఆ గౌరవమే ఇప్పుడు మృగ్యంగా ఉంది.

దీనికి కారణాలెన్నయినా ఉన్నాయి. అందులో కొన్ని సినిమా పుట్టిననాటినుంచీ అనువాయితీగా వస్తున్నవి.

తెలుగు దేశంలో టాకీలు ప్రారంభమైన కాలంలో పత్రికలిన్ని లేవు. వాటిసర్క్యులేషను కూడా చాలా పరిమితంగా వుండేది. ఆ కాలంలో కొన్ని "పేద" పత్రికల వాళ్ళు సినిమా ప్రకటనల కోసం నానాతిప్పలుపడి సినిమా చిత్ర నిర్మాతల చుట్టూ ప్రదక్షిణాలుచేసి, ప్రాధేయపడి, కాళ్ళూ, గడ్డాలూ కూడా పట్టుకోవటం జరిగింది. దీనివల్ల సినిమాచిత్ర నిర్మాతలకు పత్రికల వాళ్ళంటే చాలా చులకన భావం ఏర్పడింది.

దీనికి తగ్గట్టే, ఆ రోజుల్లో చిత్ర నిర్మాతలకు పబ్లిసిటీ విలువ ఏమీ తెలియదు. (పబ్లిసిటీ విలువ మొట్టమొదటగా గుర్తించి దానికోసం పెద్ద మొత్తాలు ఖర్చుచేసిన తెలుగుచిత్ర నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం. అయితే ఆయన సినిమా ప్రపంచాని కెంత సన్నిహితుడో పత్రికా ప్రపంచానికీ అంత సన్నిహితుడే.)

సినిమా-చిత్ర నిర్మాతలలో ఇంకొక లోపంకూడా ఉండేది. వాళ్లు పత్రికలను శ్రద్ధగా చదివే బాపతు కాని కారణంచేత తమకు పత్రికలతో అవసరం లేదుగాని, పత్రికలకు మాత్రం తమతో అవసరం ఉన్నదన్న అపోహలో పడ్డారు. ఆరోజుల్లో చిత్రనిర్మాతలు తమను పత్రికలు తిట్టినప్పుడు, దీవించినప్పుడు మాత్రమే పత్రికలంటూ ఉన్నాయనే విషయం గుర్తుకు తెచ్చుకునేవారు.



విజయావారి "పాతాళభైరవి"లో లక్ష్మీకాంతమ్మ, రంగారావు, ఎన్. టి. రామారావు.



సాధనావారి 'సంసారంలో' నటిస్తున్న ఇద్దరు కొత్త బాల నటీమణులు
విజయకుమార్ (గోపి), అరుణ (సరోజ)

పత్రికల పక్షాన పొరపాట్లు జరగక పోలేదు. కొన్ని క్షుద్ర పత్రికలు ప్రకటనల నిచ్చినవారిని దీవించటమూ, ఇవ్వనివారిని పడతిట్టటమూ చేశాయి. ఈ కళంకం అంతో ఇంతో "మర్యాద" గల పత్రికలకు కూడా అంటక తప్పిందికాదు.

చిత్రసమీక్షలు కూడా సినిమా నిర్మాతలకి పత్రికలపై విరోధభావం కలిగించటానికి చాలా వరకు తోడ్పడ్డాయి. చిత్రసమీక్షలు విద్యావంతుల దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయని గాని, తమ చిత్రాలలో లోపాలుండవచ్చునని గాని చిత్రనిర్మాతలెన్నడూ తలపోయలేదు. తమ ఉద్యోగులే కొందరు తమను విమర్శిస్తే ఎంత ఆగ్రహం వస్తుందో, చిత్రనిర్మాతలకు సమీక్షలను చూస్తే అంత ఆగ్రహం.

ఈవిధంగా పత్రికల మధ్యా, సినిమాల మధ్యా పెరిగిన వైషమ్యం వింత పరిణామాలకు దారి తీసింది. కొన్ని పత్రికలు చిత్రనిర్మాతలను గురించీ, తారలను గురించీ అనేక రకాల అవాచ్యాలు రాశాయి. ఈపద్ధతి కొంతవరకు ఆ పత్రికలకి లాభం వున్నట్టుకూడా కనిపిస్తుంది. ఒక పత్రిక కొన్ని మాసాలపాటు ఒక తారమీద పగపట్టి సమస్తమైన కుళ్ళూ ఆమెపై కుమ్మరించింది. అకస్మాత్తుగా ఒక శుభదినాన ఆ పత్రికనిండా ఆవిడ ప్రశంసలూ, ఆవిడ బొమ్మలూ తయారయాయి ఆ పత్రికకూ, ఆవిడకూ రాజీ ఎట్లా కుదిరిందో అందరికీ తెలిసిపోయింది.

తిట్టటానికి వస్తే పత్రికలకుండే సౌకర్యం చిత్రనిర్మాతలకు లేదు. ఒకరిద్దరు చిత్రనిర్మాతలు ఓపిక చేసుకుని తమ చిత్రాలలో పత్రికల వాళ్ళని దుమ్మెత్తి పోశారు గాని అది అందరికీ సాధ్యమయేది కాదు. సాంఘిక చిత్రం తియ్యటానికి హడలిపోయి జానపద చిత్రాలు తీసే మన నిర్మాతలు పత్రికల వాళ్లని తిట్టటంకోసం సాంఘిక చిత్రాలు తీయటం దురూహ్యం.

ఇవాళ ఉన్న పరిస్థితిలో పత్రికలూ, సినిమాలూ కూడా చాలా అభివృద్ధి చెందాయి. అనేక వందల పత్రికలు ప్రచారంలో ఉన్నాయి చాలా పత్రికలకు మంచి సర్క్యులేషన్ కూడా ఉన్నది. ఇవాళ అనేక "గొప్ప" పత్రికలు కూడా సినిమాకు ప్రాముఖ్యం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాయి. ఒకస్టిల్ పది పత్రికల్లో వేయిస్తే అనేకవేలమంది పాఠకులు చూస్తారు.

సినిమాలలో కూడా అటువంటి పరిణామమే కలిగింది ఇవాళ ఉత్తమ తరగతి సినిమాచిత్రాలు తీయటానికి, అనేకలక్షలు ఖర్చవుతున్నది ఇంకెందుకూ పనికిరాని వాళ్లు సినిమాలు తీసేరోజులు అయిపోయాయి. ప్రశస్తంగా చిత్రాలు తీయటానికి ఎంత అనుభవమూ, వ్యవస్థాపనా కావాలో ప్రశస్తంగా పత్రికలు నడపటానికి కూడా అంత అనుభవమూ, వ్యవస్థాపనా కావాలి. ఈ పరిణామం మూలంగా చిత్రాలకు పత్రికలిచ్చే ప్రచారమూ, పత్రికలకు సినిమా ప్రకటనల ఆవశ్యకతా హెచ్చుతున్నదిగాని తగ్గటం లేదు.

ఈపరిస్థితిలో పత్రికలు సినిమాచిత్రనిర్మాతలను అంతియోగాన ఉంచి ఆశీర్వదించి లాభం లేదు. సినిమాచిత్రాల నిర్మాణం గురించి కష్టసుఖాలు ఎరగకుండా తటస్థవైఖరి అవలంబించి లాభంలేదు. అట్లాగే సినిమాలు పత్రికలను బిచ్చం వేసే వైఖరి అవలంబించి లాభం లేదు. సమీక్షలు చూసి ఉడుక్కుని అంతకన్నా లాభంలేదు. సమీక్షలకు వెరిచి ఆత్మవిశ్వాసం లేని చిత్రనిర్మాతలు తమ చిత్రాలను పత్రికలకు చూపకుండా ప్రజలమీద పారెయ్యటంవల్ల ఎక్కువ లాభిస్తుందన్న భ్రమ ఇటీవల హెచ్చుగా ప్రదర్శిస్తున్నారు. ఇంతకన్నా మూర్ఖత్వం ఉండబోదు. చిత్రంలో పసలేకపోతే పత్రికలు ఏమి రాసినా రాయకపోయినా నడవదు. పసగలచిత్రం పత్రిక లేమి వ్రాసినా దాని దబ్బు అది గడిస్తుంది. పత్రికలు బాగా రాస్తే మరి కొంత హెచ్చు సంపాదిస్తుంది. అందుచేత ఆత్మవిశ్వాసం గల నిర్మాత పత్రికల సమీక్షలకు జరవడు.

పత్రికలకూ, సినిమాలకూ గల పరస్పర ప్రయోజనాల్ని సాధించుకోవడానికి సరి అయిన కృషిచేసే భాగం చిత్రనిర్మాతలపై ఉన్నది. సినిమా ప్రకటనలు వేయటంవల్ల తమకు ఆర్థికంగా లాభిస్తుందని పత్రికలు సులభంగా గ్రహించగలవు కాని పత్రికా ప్రచారంవల్ల లాభం ఉన్నదని చిత్రనిర్మాతలు గ్రహించటానికి కొంత భావనాశక్తి అవసరం. పత్రికలను ఉద్ధరిస్తున్నామనే అహంభావం, తమ ఆగ్రహానుగ్రహాలపై పత్రికల బాగోగులు ఆధారపడి ఉన్నాయనే భ్రమా వారు తొలగించుకోవాలి.

డిప్యూటీ మంత్రి శ్రీ తిరుమలరావు

[శ్రీ కపిల కాశీపతి]



నాసికాక్షేత్ర జాతీయ మహాసభకి పూర్వం, బొంబాయిలో, ముప్ఫై వేలమంది విద్యార్థుల పేరోలగంలో మాట్లాడుతూ, నెహ్రూ పండితుడు ప్రపంచ నాయకుల వయస్సు సంగతి ముచ్చటించాడు. ఈ నాటి లోకవ్యవహారాలలో వయసు మీరిన ముదుసళ్లే చుక్కాన్ని తిప్పుతున్నారు అన్నాడు. రాబోయే ప్రపంచాన్ని నడపవలసినవారు చిన్నవారు అన్నాడు. ఈ అభిప్రాయంలో పురాతన భారతీయ సంప్రదాయమే ప్రతిధ్వనిస్తున్నది. రాజులు రాజ్యాలుచేసే కాలంలో పరిపాలనా క్రమం, సంప్రదాయం సంరక్షించడానికి, రాజకుమారుణ్ణి యువరాజుగా చేసి, తండ్రి తదనంతరం పట్టాభిషేకం చేసేవారు. బుద్ధిమంతులైన కొందరు రాజులు, తమ జీవిత కాలంలోనే, పురుషార్థ సాధనలో, ఆశ్రమ స్వీకారంచేసి, యువరాజుకి పట్టంగట్టేవారు. బుద్ధిలేని యువరాజులు కొందరు, రాజ్యంకోసం తండ్రిని చంపి, స్వయంగా పట్టంగట్టుకోడం కూడా కలదు. ప్రజాయుగంలో చిన్న నాయకులు పెద్ద నాయకుల్ని పడదోయ్యడం కద్దు. మహానుభావులికికూడా మిగిలే ఆఖరు వికారం అధికారవాంఛ.

మొదట చెప్పిన సనాతన సంప్రదాయం, తరువాత చెప్పిన ప్రపంచానుభవం గుర్తించే మన కేంద్ర ప్రభుత్వంలో ఉపమంత్రుల్ని నియమిస్తున్నారు. నెహ్రూ దూరదృష్టికీ, విశాల హృదయానికీ ఇదో దృష్టాంతం. అతని రాజ నీతిలో వోమంచి లక్షణం.

* * *

రణరంగంలో రెండో పంక్తిలో వున్నవారు, మొదటి పంక్తికి రావడం సహజం. వారి హయాంలో విజయం లభిస్తే ఆ గౌరవం వారిదే. రెండో పంక్తికి రావడానికి వారికి బాణప్రయోగ సంహరణా యుద్ధాయ విద్యలన్నీ బాగా తెలిసి వుండాలి. ఎంతో కృషీ, ప్రతిభా వుంటేనేగాని, రెండోస్థానం లభించడమే కష్టం. జన్మతః యువరాజు రాజవుతాడు; న్యాయతః ఉపనాయకులు నాయకులవుతారు. మన దేశంలో ఉప నాయకులలో మొసలికంటి తిరుమలరావు ఒకడు. ఈ నాడు, కేంద్ర ప్రభుత్వంలో ఉపమంత్రి.

* * *

జాతకఫలితాలు చెప్పడానికి దైవజ్ఞులు పంచాంగాలైన తిథి వారనక్షత్ర యోగకరణాలతో పాటు జన్మస్థానంకూడా గణిస్తారు. ఈనాడు, ఆ జన్మస్థానం వింధ్య పర్వత పంక్తికి దక్షిణ దిగ్భాగం అయితే, జన్మకులంకూడా లెక్కించవలసిన అవసరం వున్నది. అసలు ఈ భరతవర్షే భరతఖండంలో, కొంత కాలంవరకూ, ఆంధ్ర భూభాగంలో జన్మించడం ఒక అవయోగంలా కనబడుతుంది. ఎంత ప్రతిభవున్నా, ఈ అవయోగ ప్రభావంవల్ల తెనుగువారు అణగారి పోతున్నారు. పైకి వచ్చినవారు, స్థానంమార్చి వుండాలి. లేదా పేరులోనైనా ఆంధ్రేతర సంప్రదాయం అవలంబించి వుండాలి. ఇవి రెండూ కాకపోతే జన్మకుల యోగంమంచిదై వుండాలి. అప్పుడుగాని స్థానయోగ దుష్ఫలితాలు తప్పిపోవు. రాష్ట్రంలో గాని, అంతకంటె మరీ కేంద్రంలో గాని, ఆంధ్రుల అభావం అర్థం చేసుకోడానికి వేరే మార్గంలేదు. ప్రపంచంలో అయిదోవంతు భరతఖండపు జనసంఖ్య. అందులో పదోవంతు తెనుగువాన జనసంఖ్య. నూరింట పదిపాళ్లు భరతఖండపు ఐశ్వర్యావకాశాలన్నీ ఆంధ్రులు అనుభవిస్తున్నారా అంటే తెల్లమొహం వెయ్యాలి.

ఏనాడో తురకరాజ్యంలో, "తెలంగాణి" అనే బిరుదుతో ఆంధ్రుడొకడు ఢిల్లీలో మంత్రాంగం వెలిగించాడు. తదుపరి, బ్రిటిషు మహాయుగంలో బయ్యా నరసింహేశ్వరశర్మ కేంద్రంలో సభ్యత్వం చేశాడు. అదే యుగంలో అటువంటి పదవి పొందినవాడు ఈడ్పుగంటి రాఘవేంద్రరావు. యావద్భారత రాజకీయ చరిత్రలోనూ, ముచ్చటగా ముగ్గురే ఆంధ్రులు. ఢిల్లీకోటలో మంత్రులు. మళ్లీ ఈనాడు, స్వతంత్ర భారత ప్రజాయుగంలో, తిరుమలరావు, సహాయమంత్రిగా వచ్చాడు. ఈ దృక్పథంలో, తిరుమలరావు నూతనోద్యోగం, ఆంధ్రులికి గర్వించతగిన విషయం కాకపోయినా, (మనవారు అల్పసంతోషులు కారు) సంతోషించవలసిన విషయం. ఇది యేటి కెదురీతలో సాధించిన గణ్యత.

* * *

తెనుగు మేధస్సు తీవ్రమైన వినిర్మాణ విమర్శనా చాతుర్యంకలది. మన వాక్ప్రభావం గిట్టనివారు వాచాలత్వం అంటారు. ఇంతకంటె ఆంధ్రులు లేకపోయారా అనేవారుండవచ్చు. అయితే, తిరుమలరావుకి ఆంధ్రుడనే, ఈపదవి లభించిందా? అనే విషయం ఆలోచించవలసి వస్తుంది. వో చిన్న ఉపాఖ్యానం రాధాకృష్ణ మాస్కో రాయబారిగా వెళ్ళేటప్పుడు ఢిల్లీ ఆంధ్రులు సన్మానపత్రం సమర్పించారు. అదృష్టవంతుడు తలగడిగితే పూలవాన కురుస్తుంది. ఆంధ్రుల సన్మానం అనుకున్నది అంతర్జాతీయ సన్మానంగా తయారైంది. విదేశరాయబారులంతా పేరోలగం తీర్చి కూర్చున్నారు. ప్రధానితో సహా మంత్రులు హాజరైనారు. ఆ నాటి సన్మాన పత్రంలో, "మా రాయబారి" అనే

ధ్వని స్ఫురించింది. వెంటనే నెహ్రూ వెళాకోళంగా విసిరేశాడు. ఈయన్ని ఆంధ్రుల రాయబారిగా రష్యా పంపించడం లేదన్నాడు. అదే విధంగా, ఇప్పుడుకూడా నెహ్రూ అంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. నిజంగా ఆంధ్రుడని తిరుమలరావుకి పదవి ప్రసాదించలేదు.

మంత్రిత్వం, అందులో కేంద్ర మంత్రిత్వం, ఒకర్ని వరించాలి అంటే పెళ్లికొడుకులా అన్నిలక్షణాలూ వుండాలి. ముందు మనలో పెద్దల కీయన నచ్చిరావాలి. పౌరోహిత్యం వారిది. పండితులికీ, సర్దారులకీ నజరొచ్చిన తర్వాత ఆచార్యులవారు అంగీకరించాలి. ఉపమంత్రాంగం అయితే అసలు మంత్రికి ఇష్టంవుండాలి. ఆ శాఖకి అవసరమైన ప్రత్యేకౌనభవం, ప్రతిభా ఈయనకి వుండాలి. ఇటువంటి సర్వలక్షణ లక్షితుడు దొరికితేనే, సందేశం నడిచి సంధానం కుదుర్తుంది. వరుడి వివాహేచ్ఛ ఒకటే చాలదు. అటువంటి పరిస్థితులలో శాసనసభ్యులందరూ వరులే, అర్హులే.

తిరుమలరావుశాఖ అన్నశాఖ. క్షుధార్తిపీడితులైన భారతీయులకి ఈనాడు నిజంగా అన్నం పరబ్రహ్మస్వరూపం. ఇటువంటి ప్రజకి భగవంతుడు అన్నరూపంలోగాక ప్రత్యక్షం కావడానికి వీలులేదన్నాడు బాపుజీ. అన్నపూర్ణమ్మకీ, అక్షయపాత్రకీ, కల్పవృక్షానికీ, కామధేనువుకీ, ఆటపట్టైన కర్మభూమిలో కృషికి లోపంలేదనీ, దుర్భిక్షానికి కారణం దుర్వ్యవస్థయనీ పెద్దల అభిప్రాయం. అట్టి పరిస్థితులలో, ఆహారోత్పత్తికంటె, ఆహారసేకరణ మీదే ఎక్కువ శ్రద్ధవహించాలనే నిర్ణయం జరిగింది. ఆ నిర్ణయంతోనే ప్రభుత్వం దరిమిలాని వోఆహారసేకరణ విచారణ సంఘం నియమించింది. ఆ సంఘాని కధ్యక్షుడు తిరుమలరావు. ఈ సందర్భంలో, యావద్భారత దేశం సంచారంచేసి, ఆహార సేకరణ సమస్యలు పరిశీలించి, తిరుమలరావు కేంద్రానికి వోని వేదిక సమర్పించాడు. అందులో సలహాలు, ప్రభుత్వానికి అంగీకారమైనందుకు తార్కాణ ఈ కొత్త పదవి. అవి అమలుజరపడానికే ఈయన్ను నియమించివుండాలి.

అయితే అటువంటి ముఖ్యసంఘానికి అధ్యక్షుడు కావడానికి ఈయన అర్హతలు ఏమిటి? అనే ప్రశ్న తోస్తుంది. జవాబు: ఒకటి; సంఘసభ్యులూ, అధ్యక్షులూ కేంద్రశాసనసభ్యులై వుండాలి; రెండు; ఆ సభలో కొస్త పేరుమోసి వుండాలి. మనవాళ్ల సంగతి చూసుకుంటే, ప్రస్తుత పార్లమెంటు సభ్యులలో ఉపాధ్యక్షులు అనంతశయనంగారి తర్వాత, దీర్ఘశాసన సభానుభవంవున్న జాతీయ నాయకులలో తిరుమలరావు ముఖ్యుడు. ఇన్నాళ్లుగా ఆయన పార్లమెంటరీ అనుభవం పురస్కరించుకునే, తిరుమలరావుని రెండేళ్ల కిందట ప్రపంచపార్లమెంటరీ మహాసభకి మన ప్రతినిధులలో ఒకణ్ణిగా పంపించారు.

అప్పటికే పేరుపొందిన ఆయన పార్లమెంటరీ అనుభవం ఏమిటి? ఒకటి సెంట్రల్ అసెంబ్లీ సభ్యత్వం; రెండు స్టేటు కౌన్సిలు సభ్యత్వం.

ప్రపంచం అంతలోనూ వో పెద్ద నియోజకవర్గం వుండేది. అది ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల కేంద్రశాసన సభా నియోజకవర్గం. ఈ ప్రాంతంనించి అసెంబ్లీకి వచ్చిన నాయకులంతా హేమాహేమీలే. న్యాయపతి సుబ్బారావు పంతులు, మోచర్ల రామచంద్రరావు, జయంతి రామయ్య, టంగుటూరి ప్రకాశం, కాశీనాధుని నాగేశ్వరరావుపంతులు. విశ్వదాత అనారోగ్యంవల్ల సభ్యత్వం చాలించుకున్నప్పుడు, నాయకులికి నజరానిన ఉపనాయకుడు తిరుమలరావు కాంగ్రెసుఅభ్యర్థిగా, ఉత్కృష్టమైన కేంద్ర శాసనసభా సభ్యత్వం లభించింది. తన పూర్వులు స్థాపించిన సంప్రదాయం నిలబెట్టడం అసిధారావ్రతమే. రైల్వే, ఆర్థిక సమస్యలు ప్రత్యేకంగా పఠించి సభా చర్చలలో పరిశ్రమచేసి పాలు తీసుకుని పేరు సంపాదించాడు. వ్రతంచెడలేదు. ఫలం దక్కింది.

జాతీయోద్యమ అంతరాయాలలో, అందరితోపాటు తిరుమలరావు కారాగృహ వాసానికి వెళ్లి బయటపడేసరికి, కేంద్రంలో మరో ఉత్కృష్ట స్థానం ఖాళీ అయింది. శ్రీ వేమవరపు రామదాసు పంతులుగారు పరమపదించారు. స్టేటు కౌన్సిలు సభ్యత్వం ఎదురొచ్చింది. కాని, దేశపరిస్థితులు అంత అనుకూలంగా లేవు. మాక్సెలెక్ దొరగారి ధడాకా ఇంకా అల్లాగే వుంది. ప్రపంచ సంగ్రామం తీవ్రంగా చలరేగుతున్నది. కాంగ్రెసు నాయకులందరూ ఇంకా కారాగారంలోనే వున్నారు. బ్రిటిషు ప్రభుత్వపు ఇనుప సంకెళ్లలో, సంగ్రామ రణగొణ ధ్వనిలో, జాతీయ అభిమానం ఇవురుగప్పిన నిప్పులా అంతర్భూతం అయింది. కాంగ్రెసు వున్నదా లేదా అనే సందేహం ప్రజానీకాన్ని పీడించింది. పరాయి ప్రభువుల సహాయంతో, పల్లకీలుమోసే వారందరూ మోతలుపెట్టి అయిదారు గురు అభ్యర్థులు నిలబడ్డారు. కాంగ్రెసు అభ్యర్థిగా నిలిచిన తిరుమలరావుకి ముందు మార్గం, వెనక ఆసరా కనబడలేదు. ఏకాకిగా దక్షిణ దేశం అంతా సంచారంచేసి, పెదవి విరుపులూ, మూతి తిప్పులూ సహించి, కాంగ్రెసు ప్రజాహృదయంలో జీవించేవున్నదన్న సంగతి నిరూపించాలనే దృఢ నిశ్చయంతో పని చేశాడు. ఆ సమయంలో, ఆసరా లేని తిరుమలరావుకి పెద్ద ఆడదిక్కు లభించింది. అనారోగ్యకారణంవల్ల కారాగారంలోంచి విడుదల అయిన ముత్యాల వారి కోడలు, సరోజినీదేవి, మద్రాసు రావడం సంభవించింది. మాజీ కాంగ్రెసు అధ్యక్షురాలు, సంస్థ గౌరవం కాపాడి, అత్తింటి మర్యాద నిలబెట్టడానికి, తిరుమలరావు అభ్యర్థిత్వం బలపరుస్తూ వోప్రకటన చేసింది. ఆనాటి భారతీయ కవికోకిల పలుకులు, తిరుమలరావు దేశసేవా సక్తికీ, నిరాడంబర సద్గుణ సంపత్తికీ నిదర్శనాలు.

పూనా ఆగాఖాన్ భవనంలో గాంధీ, అహమ్మదు నగరం కోటలో నెహ్రూ పటేల్, అజాద్ ప్రభృతులూ ఈ ఎన్నిక ఏమవుతుందో నని ఆదుర్దాపడ్డారు. ఈ ఎన్నిక ఫలితంలో బ్రిటిషువారికి భారతీయ ప్రజ జవాబు తెలుస్తుంది. దక్షిణదేశ నాడీ పరీక్ష తెలిసిన డాక్టరుపట్టాభి ఫర్వాలేదని తోటినాయకులికి ధైర్యం చెప్పినాడు. తిరుమలరావు గెల్చాడు. అనుకున్నట్టుగానే ఈ ఎన్నిక తర్వాత ప్రపంచ పరిస్థితులతో పాటు, భారతదేశ పరిస్థితులుకూడా మారిపోయాయి. వేవెల్ వైస్రాయి అధ్వర్యంలో, కాంగ్రెసుని సంప్రదింపులికి

సిమ్లా ఆహ్వానించారు. నాయకుల్ని విడుదల చేశారు.

సిమ్లాలో, తిరుమలరావు పెద్ద నాయకుల్ని కలుసుకున్నాడు. తమరు లేని కాలంలో కాంగ్రెసు పరపతి నిలబెట్టినందుకు, గాంధీ, పటేలుకూడా తిరుమలరావుని అభినందించారు. ఆనాడే పెద్దల దృష్టిలో పడ్డాడు తిరుమలరావు.

ఆయన ఎన్నిక లాగే, స్టేటు కౌన్సిలు సభ్యత్వంకూడా కొంత విశిష్టత సంపాదించుకుంది. ఆనాటి స్టేటు కౌన్సిలు ఓవృద్ధపితామహ లోకం. ప్రేక్షకులస్థానంలో కూచుని చూస్తే, సభ్యుల ముఖమండలాలకంటె, శిరోమండలాలే ఎక్కువ ప్రాముఖ్యంగా కనబడేవి. వారంతా సంపన్నులు. కానైతే వారి తలలమీద వయిస్సే గాని సంపత్తి కనబడేది కాదు. అధ్యక్షుల వారి తలపూర్తిగా బోడి. అద్దంలా మెరిసేది. ఇద్దరి తలలమీదే జుట్టుచూసిన జ్ఞాపకం. పండిత్ కుంజ్రూ, తిరుమలరావు. ఆ బట్టతలల జోహుకుంసభలో ప్రభుత్వ ప్రత్యర్థిగా నిల్చి తిరుమలరావు చేసిన ఉపన్యాసాలు, కాలమాన పరిస్థితుల్ని అనుసరించి చరితార్థములైనవి. ఆ సభాభవనంలో ప్రభుత్వ విమర్శ తీవ్రంగా జరగడం ఓవిడ్డూరం. ఆ ఉపన్యాసాల ప్రతిధ్వని బయటవున్న మహానాయకులు వింటూనే వున్నారు. దానికి తార్కాణే ఈ కొత్త ఉద్యోగం.

* * *

ఎంతటి వాడికైనా వోలక్ష్యంవుండాలి. గురుసాన్నిధ్యంలో భక్తి వినయాలతో కూడిన శుశ్రూష, కొంతకాలం ఉత్కృష్ట సాధనవుండాలి. ఆధునిక భారతదేశంలో ఆబాల గోపాలానికీ ఒక నూతన లక్ష్యం, నూతన మార్గం, నూతనోత్తేజం కలిగించి కృతార్థుడైనవాడు గాంధీ. ఆ మహానాయకత్వం కింద నడిచి, పైకెక్కినవారే ఈనాటి ప్రజా ప్రభువులు. గాంధీ ఉద్యమంలో తన్మయత్వంపొంది, సర్వసంగ పరిత్యాగంచేసిన ప్రాంతాలలో ఆంధ్ర దేశం పేరుపొందింది. ఆ మహాదీక్షతో చేసిన మహాయజ్ఞంలో చాలా పశువులు ఆహుతి అయిపోయినవి. మహదైశ్వర్యాలతో తులతూగుతున్న ఆగర్భ శ్రీమంతులెందరో గావంచాలు ధరించి స్వరాజ్యాశ్రమం స్వీకరించారు. అట్టి వారిలో అగ్రగణ్యుడు మహర్షి బులుసు సాంబమూర్తి. ఉద్రేకపూరితుడు, నిష్కళంక హృదయుడు సాంబమూర్తి. తన త్యాగదీక్షలో ఎంతమందినో యువకుల్ని శిష్యులుగా తయారుచేశాడు. ఆ శిష్యవర్గంలో ఈనాటికీ ముఖ్యులలో ఒకడు తిరుమలరావు.

గాంధీ యుగారంభం, పందొమ్మిదివందల ఇరవయ్యొకటిలో కాకినాడ కాలేజీలో విద్యాభ్యాసం విరమించి, దేశసేవలో నిమగ్నుడైనాడు. ఆ సేవాసక్తిలోనే, ఆంధ్రకేసరి ప్రకాశం శుశ్రూషాభాగ్యం కూడా కలిగింది. ప్రజాఉద్యమ వ్యవహారాలే కాక, పత్రికానిర్వహణంలోకూడా ప్రవేశం కలిగింది. ఆంధ్రస్వరాజ్య పత్రికలో వ్రాతకోతలు నేర్చుకున్నాడు.

ఆదినించీకూడా పట్టాభిపరిచయంతో పాటు ప్రసన్నత కూడా కలిగింది. దేశభక్త వెంకటప్పయ్యగారు కొంచెం వెనకటితరం వారైతే, ఆంధ్రరత్నం అదోమార్గంపడితే, తెనుగుగడ్డలో మిగిలిన త్రిమూర్తులు, ప్రకాశం, పట్టాభి, సాంబమూర్తులే. ఈ ముగ్గురు మూర్తుల శుశ్రూష చేసినవాడు తిరుమలరావు. తన పురోగమనంలో గురుభక్తికి భంగంలేకుండా, వారి పరస్పర వైరుధ్యాలలో తాను దారితొలగక ధన్యుడైనాడు. రాష్ట్ర రాచకీయాలలో తాను కూరుకుపోలేదు. తన దృష్టి కేంద్రమీద కేంద్రీకరించాడు. ఇంటా, బయటా ఆదరం, అభిమానం సంపాదించుకున్నాడు. నాలుగు సార్లు, మొత్తం అయిదారుసంవత్సరాలు కారాగృహవాసంచేశాడు. ముప్పైసంవత్సరాల కృషితో, తనవరుస తప్పకుండా పంక్తిలోనిల్చి, తన వంతొచ్చినప్పుడు పదవీస్వీకారం చేశాడు.

సాంబమూర్తి మహర్షి దగ్గిర దేశభక్తి నేర్చుకున్న తిరుమలరావు రమణమహర్షి పాదసన్నిధిని దైవభక్తి అభ్యసించాడు.

మఠంలో నాగరికత, నడకలో హుందా వున్న కంటికానే పెద్దమనిషి తిరుమలరావు వివిధ ప్రాంతీయ నాయకశ్రేణిలో నిలబడదగిన వ్యక్తిత్వసంపద కలవాడు.

పైకి రావలసిన తెనుగువారు ఇంకా వున్నారు. ఒక్కరన్నా పైకి వస్తూండడం సంతోషకరమైన విషయం. ఒక తెనుగు వ్యక్తికి గౌరవం జరిగితే తెనుగుజాతి "మమ" అనుకోడంలో ఆశ్చర్యంలేదు.

* * *

పశ్చిమ గోదావరి జిల్లాలో వోసంపన్న గృహస్థుడు, రాజుగారికి వుత్తరం వచ్చింది. "మీకు కేంద్రంలో సహాయమంత్రి పదవి లభించినందుకు అభినందనాలు" అని. వ్రాసినవారుకూడా క్షత్రియులే. రాష్ట్ర శాసనసభా సభ్యులు. వోకవరులోకి వెళ్లవలసిన వుత్తరం ఇంకో కవరులోకి వెళ్లింది. ఢిల్లీ రావడానికి బదులు అది గోదారికద్దర్నే నిల్చిపోయింది. యావదాంధ్రజాతికీ అభినందన విషయం గనక. మనవాళ్లల్లో ఎవరి కందితేనేం?



బొమ్మరిల్లు

<u>బాలగేయం:</u>


"అనగనగా ఒకపాప"


శ్రీ నండూరి రామమోహనరావు

అనగనగా ఒక పాప.
ఆ పాప పేరు—పాపే.
తేప తేపకా
పాప నవ్వితే
తెల్లని మల్లెలు పూస్తాయి.
చల్లని వెన్నెల లౌస్తాయి॥
అనగనగా...

తెలివితేటలా పాపాయీ
జిలిబిలి మాటలు చెబితేనే
కథలు కథలుగా నాన్నారూ
కలపనచేసీ రాస్తారూ.॥
అనగనగా...

పుట్టిన రోజూ పండగవస్తే
చుట్టా లెందరో వచ్చారు.
పాపకు మిఠాయి తెచ్చారు.
బహుమతు లెన్నో యిచ్చారు.
అనగనగా ఒక పాప
ఆపాప పేరు—పాపే.





టామ్ నిద్ర లేచేటప్పటికి బాగా పొద్దెక్కింది. పొద్దెక్కేదాకా పడుకుంటే సాధారణంగా, వాళ్ల పెద్దమ్మ గిల్లి, కొట్టి, చెవుల్లో నీళ్లు పోసి లేచేదాకా వూరుకునేది కాదు. ఇవ్వాళ ఎవరూ తనజోలికి రాకపోవటం చూసి తప్పు చేసినవాడిలాగా భయపడటం మొదలెట్టాడు టామ్.

అయిదు నిమిషాల్లో మొహం కడుక్కుని, మంచి బట్టలు తొడుక్కుని టామ్ మేడ దిగి కిందికి వెళ్లాడు. అందరూ టామ్‌కేసి ఒక్కసారి చూశారు. ఎవ్వరూ మాట్లాడలేదు. ఒక్కమాట అనలేదు. అందరూ టామ్ అనేవాడు ఉన్నాడన్న సంగతే మర్చిపోయినట్టు అతనికేసి చూడకుండా వాళ్లపని వాళ్లు చేసుకుంటున్నారు. దాంతో టామ్ గుండెలు జారిపోయాయి. ఏదో పెద్ద తుపాను రాబోతున్నట్లు భయపడ్డాడు. కాని తనకేమీ తెలియదని వాళ్లనుకోటానికి ఉషారుగా వున్నట్టు అటూయిటూ హడావిడిగా తిరిగాడు. కాని లాభం లేకపోయింది. ఎవరూ వాడికేసి చూడలేదు. చివరికి నిట్టూరుస్తూ ఒకచోట మాట్లాడకుండా చతికిలబడ్డాడు.

చద్దెన్నం తిన్న తరవాత పెద్దమ్మ టామ్‌ని ఒక గదిలోకి తీసుకువెళ్లింది. దబదబ నాలుగు బాదేస్తుందేమో అని టామ్ సంతోషపడ్డాడు. కాని పెద్దమ్మ అలాంటిదేమీ చెయ్యలేదు. ఆవిడ ఏడ్చింది.

'నన్ను ఎంత తిప్పలు పెడుతున్నావురా' అంది. 'ఇక నువ్వు బాగుపడేది లేదులే' అంది. "నీ యిష్టం నువ్వేమన్నా చేసుకో. ఎంతకని నిన్ను కనిపెడుతూ కూచుంటాను. నేను కాస్తా గుటుక్కుమన్న తరవాత నిన్ను అడిగేవాళ్లే ఉండరులే" అంది.

టామ్‌కు వెయ్యి కొరడా దెబ్బలు కొట్టినంత బాధేసింది. తనూ ఏడ్చాడు. 'పెద్దమ్మా! ఇంకెప్పుడూ నీమాటకి ఎదురు తిరగను. నిన్ను కష్టపెట్టను.' అని ఒట్టేసుకున్నాడు. చివరికావిడ ముక్కు, కళ్లు తుడుచుకుని వెళ్ళిపోయింది. ఆవిడ పూర్తిగా క్షమించలేదని, తన మాటల్లో నమ్మకం ఎప్పుడో పోయిందని టామ్‌కు తెలుసు.

తను రాత్రి ఎక్కడికో వెళ్లిన సంగతి సిడ్ చెప్పివుంటాడు పెద్దమ్మకి. కాని వాడిని కొట్టాలనిపించలేదు టామ్‌కి. విచారంగా స్కూలుకి వెళ్లాడు. జో హార్పరుతో కలిసి నిన్న మధ్యాహ్నం స్కూలు ఎగగొట్టినందుకు, వాడితోపాటు పేంబెత్తం దెబ్బలు రుచిచూశాడు. అయితే టామ్ మనస్సు ఇంతకంటే పెద్దకష్టాల్లో వుండటంవలన ఈ దెబ్బల్ని లెక్కచెయ్యలేదు. తన సీటులో కూలబడి మేష్టరుకేసి గుడ్లప్పగించి చూస్తున్నాడు.

* * * *

ఆరోజు మధ్యాహ్నానికల్లా శ్మశానంలో జరిగిన హత్యవార్త ఊరంతా పాకిపోయింది. అంచేత స్కూలుకి అవ్వాళ సెలవిచ్చారు.

శవందగ్గిరగా ఒక బాకు కనిపించింది. అది మఫ్‌పాటర్‌దని ఎవరో గుర్తుపట్టారు. అంతే కాదు. రాత్రి 2 గంటలవేళ మఫ్‌పాటర్ ఊరి

బయట కాలవలో కాళ్లు చేతులు కడుక్కోవటం ఎవరో చూశారట. (పాటర్ తన జన్మలో ఎప్పుడూ కాళ్లు, చేతులు కడుక్కోటం ఎర గడు.) అంచేత వాడే హత్య చేసి వుండాలని అందరికీ అనుమానం కలిగింది. పైగా ఎంత వెదికినా ఊళ్లో పాటర్ కనిపించలేదు. దీనితో అనుమానం స్థిరపడింది. పోలీసుస్టేషను నుంచి పోలీసులు వచ్చి అన్నివేపులకీ పరుగెత్తారు, హంతకుణ్ణి పట్టుకోటానికి.

ఊరు ఊరంతా శ్మశానందగ్గిర పోగయ్యారు. టామ్ కూడా వాళ్లతో వెళ్లాడు. ఇంతలో ఎవరో టామ్‌చొక్కా లాగారు. వెనక హాకల్ బెరీ నుంచున్నాడు. ఇద్దరి చూపులు కలిశాయి. వాళ్లిద్దరూ ఒకచోట నుంచున్నందుకు ఎవరన్నా అనుమానపడ్తారేమోనని అందరికేసీ చూశారు. కాని ఎవ్వరూ వీళ్లని గమనించినట్టులేదు.

ఇంతలో, మఫ్ పాటర్ వస్తున్నాడని కేకలు వినబడ్డాయి. అందరూ ఆవేపు చూశారు. తూలుతూ, పడుతూ, లేస్తూ పాటర్ వస్తున్నాడు. పోలీసు ఇన్స్పెక్టరు 'ఆ, దొంగ దొరికాడు' అంటూ వెళ్లి వాడి చెయ్యి పట్టుకున్నాడు. వాడు పారిపోటానికి ప్రయత్నించలేదు. శవందగ్గిరికి సరాసరి వచ్చి, దాన్ని చూసి కళ్లు కప్పుకొని ఏడవటం మొదలెట్టాడు.

"నేను చంపలేదు బాబయ్యా!" అన్నాడు పాటర్ ఏడుస్తూ.

"నువ్వు చంపావని ఎవరన్నారు?" అన్నాడొక పెద్దమనిషి.

పాటర్ తల ఎత్తి చుట్టూ చూశాడు. ఇంజన్‌జో కనిపించాడు.

"ఇంజన్‌జో! నువ్వు ఎవళ్లతోనూ చెప్పనన్నావుగదరా!" అన్నాడు పాటర్.

"ఈ బాకు నీదేనా?" అని ఇన్స్పెక్టరు బాకు చూపించాడు.

ఆ బాకు చూసి పాటర్ గజగజ వణికిపోయాడు. తరవాత ఇంజన్‌జో ఇన్స్పెక్టరుకి రాత్రి జరిగిన కథని చిలవలుపలవలుగా అబద్ధాలు కలిపించి చెప్పాడు. అంతా 'ఇన్స్పెక్టరు' రాసుకున్నాడు. ఇదంతా టామ్, హక్ వింటూనే వున్నారు. ఏ క్షణానికి ఆ క్షణం ఆకాశంలోంచి పిడుగు ఇంజన్‌జో మీద పడి వాణ్ణి హతమారుస్తుందనీ, లేకపోతే ఏ ఆకాశవాణో నిజం చెప్పేస్తుందనీ వాళ్ల నమ్మకం. కాని అలాంటి దేమీ జరగలేదు. తామే చెప్పేద్దా మనుకున్నారు జరిగినదంతా. కాని భయపడ్డారు.

"నువ్వు ఎందుకు పారిపోలేదు? హత్య చేసికూడా ఏ మొహంపెట్టుకుని వచ్చావు?" అని ఎవరో పాటర్‌ని అడిగారు.

"పారిపోదామనే అనుకున్నానండి. కాని నాకు తెలియకుండానే నా కాళ్లు ఇటు ఈడ్చుకొచ్చాయండి." అని ఏడుపు మొదలెట్టాడు పాటర్.

ఇంజన్‌జో చెప్పాడు, డాక్టర్ని చంపింది మఫ్‌పాటరే నని. ఇన్స్పెక్టరు అంతా రాసుకున్న తరవాత శవాన్ని ఎత్తి లారీలో పడెయ్యటానికి ఇంజన్‌జో సహాయం చేశాడు. పాటర్‌నికూడా పోలీసులు లాక్కుపోయారు.

ఆతరవాత టామ్ ఒక్కరాత్రి కూడా సరిగా నిద్రపోలేదు. ఇంజన్‌జో హంతకుడన్న సంగతి టామ్‌కీ, హాక్‌కీ తప్ప ఇంకెవరికీ తెలియదు. అది చెప్పటానికి వాళ్లకి ధైర్యం లేకపోయింది. దీనితో టామ్‌మనస్సంతా అల్లకల్లోలమైపోయింది. రాత్రుళ్లు ఒకటే పీడకలలు. తెల్లారి లేచాక కళ్లు ఎర్రగా వాచివుండేవి. పోలీపెద్దమ్మకి సంగతేమీ అర్థం కాలేదు.

ఒకరోజు న సిడ్ అన్నాడు. "టామ్! ఏమిట్రా రాత్రిళ్లు ఒకటే గొడవ చేస్తావు. నా నిద్రకూడా చెడగొడుతున్నావు."

టామ్ నాకేమీ తెలియదన్నాడు.

"తెలియకపోవట మేమిటి? నిన్నరాత్రి బాబోయ్ నెత్తురు, నెత్తురు, అన్నావు బోలెడుసార్లు. మొన్నరాత్రి "నన్ను కొట్టద్దు. నిజం చెప్పేసాను.' అని అరిచావు. ఏమిటది?" అన్నాడు సిడ్.

పెద్దమ్మకి అంతా అర్థమైంది. "అదా! ఆ శవాన్ని చూసినప్పటి నుంచీ కుర్రాడు జడుసుకున్నాడు కాబోలు. నాకూ రోజూ పీడకలలు వస్తూనేవున్నాయి." అన్నది.

కాని సిడ్‌కి నమ్మకం కలగలేదు. ఆరోజునించీ టామ్ ఒక కొత్త ఎత్తు ఎత్తాడు. పన్నుపోటు బాగా ఎక్కువగా వుందన్నాడు. అందుకని పడుకోబోయేటప్పుడు రుమాలతో నోరు బిగించి కట్టుకునేవాడు. ఎందుకంటే నోరు కట్టేసుకుంటే కలవరింతలు

(38 వ పేజీ చూడండి)



ర్ణపురి సింహాసనాన్ని జయచంద్రుడనే రాజు పరిపాలిస్తూండేవాడు. ఆయనకు స్వర్ణలత అనే అందమైన కుమార్తె వుంది. ఆమె అందానికి ముగ్ధులై అనేకమంది రాజకుమారులు ఆమెను వివాహమాడగోరారు. కాని ఆమె ఎవ్వరినీ వరించలేదు. స్వర్ణలత ఒక రాజకుమారుని ప్రేమించింది. అతడు విజయపురి నేలే ప్రచండసేనుడి పుత్రుడు విజయసేనుడు. విజయసేనుడుగూడ స్వర్ణలతఅందాన్ని చూచి ఆమెను ప్రేమించాడు. ఈ ప్రేమను చూసి జయచంద్రుడు పెళ్ళికి ముహూర్తం నిశ్చయించాడు.

ఆ ప్రాంతాలలోనే నరాంతకుడు అనే రాక్షసుడు ఒకడు ఉండేవాడు. అతడు రెండడుగుల ఎత్తు మాత్రం ఉంటాడు. అతనికి ఏడడుగుల బంగారుగడ్డం వుంది. అందుకని వాడు ఏం చేస్తాడంటే ఆ గడ్డాన్ని తన మెడచుట్టూ చుట్టుకుంటాడు. వాడి గడ్డం, ధరించే టోపీ అన్నీ గొప్ప మంత్రశక్తి గలవి. ఈ రెండడుగుల నరాంతకుడు పరమ దుర్మార్గుడు. వీడు స్వర్ణలతఅందాన్ని చూచి ప్రేమించాడు. స్వర్ణలతా విజయసేనులకు వివాహం జరుగబోతున్నది అని ఎప్పుడైతే విన్నాడో అపుడు ఎలాగైనా సరే స్వర్ణలతని వివాహం చేసుకొనితీరా లనుకున్నాడు.

వివాహం రోజున స్వర్ణపురి



అంతా హడావిడిగా ఉంది. వివాహ ముహూర్తం సమీపించింది. విజయసేనుడు మంగళసూత్రం స్వర్ణలత మెడలో కట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇంతలో పెద్ద సుడిగాలి కల్యాణమంటపాన్ని చుట్టబెట్టింది. వచ్చిన అతిథులంతా భయపడి తలోదారి లంకించుకున్నారు. సుడిగాలి స్వర్ణలతను పైకి ఎత్తేస్తోంది. విజయసేనుడు ఆమె పైకి వెళ్ళకుండా ఆపటానికి ఎంతో ప్రయత్నించాడు. కాని అది నరాంతకుని మాంత్రిక శక్తి అయినందున లాభం లేకపోయింది. కొంతదూరం వరకు పైకి పోయి స్వర్ణలత ఇంక కనపడలేదు విజయసేనునకు.

సుడిగాలి శాంతించింది. పారిపోయిన అతిథులు ఒక్కొక్కరే రాసాగారు. వారంతా కల్యాణమంటపందగ్గర విజయసేనుణ్ణి మాత్రం చూడగలిగారు. మహారాజు విజయసేనుని దగ్గరకు వచ్చి" స్వర్ణలత ఎక్కడ అని అడిగాడు. విజయసేనుడు తాను చూచిందంతా చెప్పాడు.

"ఇదంతా చూడబోతే ఏదో మాంత్రికంలా కనబడుతోంది. నాయనా విజయసేనా! నీ స్వర్ణలతను నీవే అన్వేషించు. నీవు ఇందుకు సమర్థుడవు." అని జయచంద్రుడు విజయసేనుణ్ణి స్వర్ణలతను వెదకటానికి పంపించాడు.

విజయసేనుడు ఒక గుర్రాన్ని తీసుకొని బయలుదేరాడు. అనేక పల్లెలు, పట్టణాలు, సరస్సులు దాటుకుంటూ ప్రయాణంచేశాడు. చివరకు ఒక కీకారణ్యం ప్రవేశించాడు. ఒకచోట ఒకపాము కుందేలునుపట్టి చంపటానికి సిద్ధంగా వుంది. వెంటనే విజయసేనుడు తనఒరనుండికత్తిని తీసిపామును చంపికుందేలును రక్షించాడు. అపుడా కుందేలు మానవ స్వరంలో "ఓ విజయసేనా! నీవు నా ప్రాణాన్ని రక్షించావు. చాల కృతజ్ఞుణ్ణి. నీవు ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చావో, ఎవరిని అన్వేషిస్తున్నావో అంతా నాకు తెలుసు. కాని స్వర్ణలతను విడిపించటం అంత సులభమైన పనికాదు. నీ స్వర్ణలతను ఎత్తుకొనిపోయినది బంగారుగడ్డపు నరాంతకుడు. నీవు ఆమెను విడిపించాలీ అంటే ముందర నీ వా రాక్షసుని వధించాలి. అదే దుస్సాధ్యమైన పని. ఆతని ప్రాణం తీయగల ఆయుధం ఒక్కటే వుంది. అది బంగారపు ఖడ్గము" అని చెప్పింది.

"మరి ఆ ఖడ్గం ఎక్కడ దొరుకుతుంది."అనిఅడిగాడువిజయసేనుడు.

"కొన్ని యోజనాల దూరంలో గల పర్వతంమీద ఒక బ్రహ్మాండమైన సర్పం వుంటుంది. అది ఆ ఖడ్గం చుట్టూ చుట్టుకొని ఎప్పుడూ విష వాయువులను కక్కుతూ వుంటుంది.



ఆ వాయువు పీల్చినవారెవరైనాసరే మరుక్షణంలో చనిపోతారు. కాని ప్రతిదినం సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చినపుడు మాత్రం ఒక్క అరగంటసేపు ఆ సర్పం నిద్రపోతుంది. అప్పుడు ఆ విషవాయువులు ఆగిపోతాయి. అప్పుడు నువ్వు వెళ్లి ఖడ్గం సంపాదించాలి. నీ వా పర్వతం చేరాలంటే ఒక ఉపాయం ఉంది. ఈ అరణ్యంలోనే ఒక గుఱ్ఱం వుంది. వాయువేగంకంటె అమితవేగంతో పోతుంది." అని ఆ గుఱ్ఱాన్ని ఎల్లా వశపరుచుకోవాలో కూడా చెప్పింది కుందేలు.

విజయసేనుడు తన గుఱ్ఱాన్ని అచట వదలి కుందేలు చెప్పిన గురుతుల ప్రకారం పోయాడు. ఒక చెట్టును సమీపించి, ఆ చెట్టుతొఱ్ఱలో వున్న గంటను తీసి మ్రోగించాడు. అడవి అంతా పిడుగులు పడినట్లుగా ధ్వనించసాగింది. కొద్ది నిమిషాల్లోనే భయంకరమైన సకిలింపుతో, భూమండలమంతా అదిరిపోతున్నదా అని అనిపించేటటువంటి నడకతో ఆ గుఱ్ఱం వస్తోంది. దాన్ని చూచేనరికి విజయసేనుడికి భయం వేసింది. కాని ధైర్యం తెచ్చుకుని నిలబడ్డాడు.

గుఱ్ఱం సమీపించగానే విజయసేనుడు ఒక్క గెంతు గెంతి గుఱ్ఱం జూలు పట్టుకున్నాడు. వెంటనే అంత భయంకరంగా వున్న గుఱ్ఱం కాస్తా ఒక గొర్రెపిల్ల మాదిరిగా నిలబడిపోయింది.

"అయ్యా! నేను మీకు సహాయంచేయటానికి సిద్ధంగా ఉన్నాను ఏమి సెలవు." అని అడిగింది గుఱ్ఱం. విజయసేనుడు సంగతంతా చెప్పాడు. "మీరు వెళ్లే పని చాలా భయంకరమైనది. అందుచేత మీరు కవచం ధరించుకోండి." అని గుఱ్ఱం సలహా యిచ్చి విజయసేనుని ఎక్కించుకొని వాయువేగంతో పర్వతం దగ్గరకు పరుగెత్తింది.

"అయ్యా! చూడండి ఆ పర్వతాన్ని. ఆ పర్వతంమీద ఉన్న సర్పం ఎలా విషం క్రక్కుతూందో చూడండి." అన్నది గుఱ్ఱం ఆ పర్వతానికి దూరంగా నిలబడి. విషవాయువులు చాలదూరం వరకూ వ్యాపిస్తున్నాయి. అది సాయంత్రం. అందుచేత ఆవేళకి లాభంలేదనుకుని విజయసేనుడు విశ్రమించాడు ఒక చెట్టుకింద. ఆమర్నాడు సూర్యుడు నడిఆకాశానికి వస్తున్న కొద్దీ విషజ్వాలలు తగ్గిపోవటం మొదలెట్టాయి. మిట్ట మధ్యాహ్నం అయింది.

"ఇదే సమయం, రాకుమారా!" అని అరచింది గుఱ్ఱం. వెంటనే విజయసేనుడు గుఱ్ఱంమీది కురికాడు. గుఱ్ఱం అతివేగంతో పర్వతాన్ని సమీపించింది. అక్కడ గుఱ్ఱందిగి విజయుడు గబగబ పర్వతమెక్కాడు. పామును సమీపించి చటుక్కున ఖడ్గం తీశాడు. వెంటనే సర్పం మేల్కొంది. బ్రహ్మాండమైన పడగ విప్పింది. కాని ఎప్పుడైతే సువర్ణఖడ్గాన్ని విజయసేనుని చేతిలో చూచిందో వెంటనే పడగ దింపేసి.

"మీరే నా యజమానులు. ఇష్టంతో మీరు నన్ను చంపకుండావుంటే కొన్ని విషయాలు చెప్తాను." అని అంది.

చెప్పమని అడిగాడు విజయసేనుడు.

"మీరు నరాంతకుని చంపటానికి వెళుతున్నారని తెలుసు. మీరీ ఖడ్గంతో వాణ్ణి చంపినతర్వాత వాడి గడ్డాన్ని కోసి 'మీతో తీసుకెళ్ళండి. తరవాత మీరు ఒక డబ్బాలో వాడి తోటలో వున్న సెలయేటినీరు తీసుకోండి. అది ప్రాణంపోయినవారికి ప్రాణాన్ని ఇస్తుంది. వాడి నెత్తిమీద ఉండే టోపీనిగూడ మీతో తీసుకుపోండి. అది మాంత్రికశక్తి గలది. మీరు నామాటలు అశ్రద్ధచేయవద్దు. లేకపోతే మీకు ఆపదలు తప్పవు." అని చెప్పిందా సర్పం.

విజయసేనుడు గుఱ్ఱంమీద కూర్చుని కొంతదూరం పోయాక వెనుకకు తిరిగి చూశాడు. ఆశ్చర్యం! కొండమీద మరి విషజ్వాలలు కనపడలేదు. ఆ పాము కంత శక్తి రావడం ఆ స్వర్ణఖడ్గపు మహిమయే.

వారు తిరిగి నరాంతకుని కోట వైపు దారితీశారు. కొలదికాలంలోనే వారు నరాంతకుని ఉక్కుకోటను సమీపించారు. ఆ కోటగోడలు మనిషిఎత్తుకు పదురెట్లు ఉండి ఉక్కుతో చేయబడి ఉన్నాయి.

ఆ కోటగుమ్మందగ్గిర ఒక గంట వ్రేలాడగట్టబడిఉంది. అది వాయిస్తే నరాంతకుడు బయటకు వస్తాడు. లేకపోతే కోట తలుపులన్నా తెరవబడతాయి. ముందుగా అక్కడున్న సేవకులను వధించాడు విజయసేనుడు.

ఇక లోపల స్వర్ణలత పరిస్థితులను పరిశీలిద్దాం. పెండ్లిసమయంలో సుడిగాలి పైకి లేవనెత్తగానే రాకుమారికి గాఢమైన నిద్ర వచ్చేసింది. ఆ నిద్ర ఎక్కడ తెలిసిందంటే ఉక్కుకోటలో నరాంతకుని గదియందు తెలిసింది.

ఆగది అంతా అద్దాలతో నిర్మింపబడి ఉంది. అక్కడక్కడ మాత్రం తెరలు కట్టబడిఉన్నాయి. ఆ గదిలోని వస్తువు లన్నీ బంగారపుచే. స్వర్ణలత తెలివివచ్చి చూసింది. ఏదో మోసం జరిగిందని తెలుసుకుని భయపడింది.

ఇంతలో ఆమె వెనక జరజర మని చప్పుడైంది. రెండు అద్దాలు వెనుకకు జరిగి నలుగురు మనుష్యులు ఒక్కసారిగా వెళ్ళగలంత ద్వారం ఏర్పడింది. ఆ ద్వారంగుండా నరాంతకుడు బంగారపు గడ్డంతో, చేతిలో టోపీతో ప్రవేశించాడు.

స్వర్ణలత నరాంతకుని చూడగానే గడగడ వణకసాగింది. వాడు నవ్వుకుంటూ ఆమెను సమీపించాడు. ఆమె భయపడిపోయి ఒక మూల నక్కింది. "సుందరాంగీ! నీకు సుస్వాగతము. ఇంత మర్యాద ఈ కోటలో ఎవ్వరికి జరుగలేదు. నేను, నీవు కలసి ఈ కోటకు రాజు, రాణి అవుదాం." అన్నాడు నరాంతకుడు.

"దుర్మార్గుడా! నీవు నన్ను వివాహమాడాలని తలుస్తున్నావా? నీకు తెలియదూ; విజయసేనుడు నన్ను వెతుక్కుంటూ త్వరలో వస్తాడని. అతడు నిన్ను చంపి నన్ను తీసుకపోతాడు. జాగ్రత్త" అంది స్వర్ణలత.

"ఆ ఆశ నువ్వు వదులుకో. విజయసేనుణ్ణి నల్లిని నలిపినట్లు నలిపివేస్తా. తెలుసా?" అని అంటూ నరాంతకుడు స్వర్ణలతను సమీపించాడు. ఆమె నరాంతకుని చెంప మీద బలమైన దెబ్బ కొట్టింది. నరాంతకుడు క్రిందపడ్డాడు. స్వర్ణలత పకపకా నవ్వసాగింది.

"ఓసీ జాగ్రత్త. నీకు నవ్వటానికి సిగ్గులేదూ! ఇపుడు నవ్విన దానికి ఒకరోజున ఏడుస్తావు చూడు నిన్నేమి చేస్తానో," అని ఉరుముతూ వెళ్లిపోయాడు వాడు.

స్వర్ణలత నరాంతకుని క్రిందకు తోసినపుడు మాయాటోపీ క్రింద పడిపోయింది. అది నరాంతకుడు చూచుకోకుండా వెళ్లిపోయాడు. స్వర్ణలత ఆ టోపీని తీసి అటూ ఇటూ తిప్పుతూ వింతగా చూస్తోంది. అదేమిటో ఆమెకు తెలియకుండానే ఆ టోపీని తల మీద పెట్టుకుని, గదిలోని అద్దాలలో చూసుకుంది. విచిత్రం! గదిలోని ప్రతివస్తువూ ఆమెకు కనబడుతోంది. కాని అద్దంలో తన రూపం కనిపించటంలేదు. స్వర్ణలత నెత్తి మీదనుంచి టోపీని తీసింది. మళ్లీ అద్దంలో ప్రతిబింబం కనిపించింది. ఇలాగ చాలసార్లు చేసిన తర్వాత గ్రహించింది. అది తలపై పెట్టుకున్నవాళ్లు ఇతరులకు కనబడరని, కాని ప్రతివస్తువు వారికి కనబడుతుందని. నేను తప్పించుకోటానికి మార్గం దొరికిందిగదా అని సంతోషించింది. ఇంతలో నరాంతకుడు తిరిగి ద్వారం తెరచుకుని గదిలోకి ప్రవేశించాడు.

ఆసమయంలో స్వర్ణలత టోపీని తలపై ధరించి ఉంది. వాడు కోపంతో గదిఅంతా కలియజూశాడు. కాని వాడికి టోపీగాని, రాకుమారిగాని కనపడలేదు. వాడు వెంటనే గ్రహించుకున్నాడు ఆమె టోపీని ధరించిఉంటుందని.

"అహ్హాహ్హా...నీవు దాన్ని ధరించావూ? నివు ఇక్కణ్ణించి తప్పించుకొనిపోవటానికి ఆలోచిస్తున్నావా? జాగ్రత్త" అని కేకలు వేస్తూ వాడు తన చేతులు జాచి గది అంతా వెతికాడు. కాని వాడు ద్వారం తెరిచీ తెరవగానే ఆమె గదిని దాటి వెళ్ళిపోయిందని గ్రహించలేకపోయాడు.

అలా వాడు గదిఅంతా తడిమి విసిగిపోయాడు. చివరకు తప్పించుకుని వెళ్లిందని గ్రహించి తన పొరపాటుకు తన్ను తానే నిందించుకొన్నాడు. ఇంకా కోటలోనే ఉంటుందనుకొని కోట అన్నితలుపులు బంధించమని భటులకు ఆజ్ఞాపించాడు. కాని వాడు ఎన్నిరోజులు వెదికినా స్వర్ణలతజాడ లేదు.

ఆమె నరాంతకుడినుండి తప్పించుకొని తోటలోకి పోయింది. టోపీని తలమీదనుండి తీయకుండానే చాలరోజులు గడిపింది. చెట్లమీద రకరకాల పళ్లు కోసుకుని కడుపు నింపుకునేది. అక్కడ వున్న సెలయేటిలో నీళ్లు తాగేది. నరాంతకుడు గాని, వాడి భటులుగాని తనను పసిగట్టకుండా జాగ్రత్తగా

వుంటూ విజయసేనుడికోసం ఎదురుచూసేది.

నరాంతకుడు ప్రతిరోజూ భటులతో కలిసి కోటఅంతా గాలించేవాడు స్వర్ణలతకోసం. ఒక రోజున నరాంతకుడు ఎదురుగా వస్తున్నాడు. స్వర్ణలత వాణ్ణి తప్పించుకొనటానికి పరుగెత్తుతోంది. దురదృష్టవశాత్తు కొమ్మ ఒకటి ఆమె టోపీకి తగిలి కిందబడింది. ఆమె తిరిగి టోపీ తీసేలోగా నరాంతకుడు వచ్చి దాన్ని లాగేశాడు. ఆమె చేతిని గట్టిగా పట్టుకుని వికృతంగా నవ్వటం ప్రారంభించాడు. స్వర్ణలత వదిలించుకోటానికి ప్రయత్నించింది. కాని వాడివి ఇనపచేతులు.

ఈ సమయంలోనే కోట బయట గంట "గణగణ" మంటూ పెద్ద శబ్దంతో మ్రోగింది. స్వర్ణలతను వెదుక్కుంటూ విజయసేనుడు వచ్చాడని నిశ్చయించుకొన్నాడు నరాంతకుడు.

ఇపుడు విజయసేనుణ్ణి సంహరించడానికి బయటకు పోవాలి. స్వర్ణలతను ఇలా విడిచి వెళ్ళిపోతే ఎక్కడికైనా తప్పించుకొని పారిపోతుంది. అందుకని తన గడ్డాన్ని ఏదో మంత్రించి ఆమె ముఖానికేసి కొట్టాడు. వెంటనే ఆమె ప్రాణంపోయినదానివలె పడిపోయింది. వెంటనే నరాంతకుడు కోట బయట ప్రదేశమంతా చీకటిమయం చేశాడు. తర్వాత కోటను దాటి విజయసేనుణ్ణి సమీపించాడు.

విజయసేనుడు అకస్మాత్తుగా కలిగిన ఆ చీకటిని చూచి విస్తుపోయాడు.

"జాగ్రత్త! ఇదంతా నరాంతకుని మాయ. అటు చూడు వాడు వస్తున్నాడు" అంటూ ఆ గుఱ్ఱం చెప్పింది.

వెంటనే విజయసేనుడు బంగారు ఖడ్గాన్ని చేత పట్టుకుని సిద్ధంగా ఉన్నాడు.

ఇంతలో ఒక పెద్ద మెరుపువలె మెరిసింది. కాని అది నిజంగా మెరుపు కాదు. అది నరాంతకుడు విజయసేనుని మీదకు విసిరిన కత్తి. కాని గుఱ్ఱం వెంటనే ప్రక్కకు గంతువేసి విజయసేనుణ్ణి అపాయం నుంచి రక్షించింది.

వెంటనే విజయసేనుడు తన ఖడ్గాన్ని నరాంతకుని కత్తివచ్చిన వైపు విసిరాడు. అది వృథాపోలేదు. నరాంతకుని తలను ఖండించింది. వెంటనే చీకటి మాయమైపోయింది.

విజయసేనుడు గుఱ్ఱాన్ని దిగి ఆ తల తీసికొని గడ్డాన్ని ఖడ్గంతో కోసి తననడుముకు చుట్టుకున్నాడు. పక్కనే పడివున్న టోపీకూడా తీసుకొని కోటతలుపులను తెరచుకొని లోపలకు ప్రవేశించాడు.

విజయసేనుడు కష్టపడకుండానే స్వర్ణలత త్వరలోనే తోటలో కన్పించింది. కాని గడ్డిమీద స్పృహలేకుండా వుంది. విజయసేనుడు దగ్గరకు పోయి లేపడం ప్రారంభించాడు కాని స్వర్ణలత లేవలేదు.

"ఇది నిద్రగాదు. నరాంతకుని మంత్రశక్తి. మీ దగ్గర ఉన్న సీసాలో ఆ సెలయేటి నీరు తీసుకు రండి. మనం త్వరగా ఇచటనుంచి వెళ్ళిపోవాలి. సమయం వచ్చినపుడు ఆ నీటిని ఆమెమీద చల్లి బ్రతికించవచ్చును." అని గుఱ్ఱం చెప్పింది.

విజయసేనుడు సెలయేటినీరు తీసికొని, స్వర్ణలతను భుజంమీదకు తీసుకొని గుఱ్ఱంమీద కూర్చుని దౌడుతీశాడు.

వారు కొలదిసేపటిలోనే కుందేలును పాముబారినుండి రక్షించిన ప్రదేశానికి వచ్చారు. అచట అతడు స్వర్ణపురినుంచి తీసుకొనివచ్చిన గుఱ్ఱం వుంది.

"అయ్యా! అదుగో మీ గుఱ్ఱం నాకు సెలవు ఇప్పించండి. మీకు నాతో అవసరంవుంటే తిరిగి ఆ పర్వతందగ్గరకు వచ్చి గంట మ్రోగించండి. నేను వస్తాను." అని చెప్పి వెళ్ళిపోయింది ఆ గుఱ్ఱం.

విజయసేనుడు స్వర్ణలతను మెత్తటి పచ్చికమీద పరుండబెట్టి మరుసటి ఉదయం ప్రయాణం చేదామనే ఉద్దేశ్యంతో, తానుగూడ నిద్రపోయాడు.

వారు అలా నిద్రపోతూంటే కమలనగరాన్ని ఏలే విక్రముడు ఆ అరణ్యంగుండా వెళ్లటం సంభవించింది. విక్రముడుగూడ స్వర్ణలతను వివాహమాడగోరి, ఆమెచే నిరాకరింపబడ్డాడు. ఆమెకు పెండ్లిసమయంలో జరిగిన విపత్తును విని విక్రముడు ఆమెను కనుక స్వర్ణపురికి చేరుస్తే స్వర్ణలత తన్నుతప్పక వివాహమాడుతుందని ఆమెను వెదకటానికి బయలుదేరాడు. అతడు పచ్చికపైనిద్రపోతున్న విజయసేనుని, స్వర్ణలతను చూచి ఆశ్చర్యపోయా

ఇడు. ఇదే సమయమని నిశ్శబ్దంగా రాకుమారి నెత్తుకొని భుజంమీద పెట్టుకొని గుఱ్ఱం ఎక్కి పారిపోయాడు విక్రముడు.

విజయుడు లేచి చూచేసరికి ప్రక్కన స్వర్ణలత లేదు. అతడికి పిచ్చిఎక్కినట్లయింది. పెద్ద కేక పెట్టుకుంటూ, ఆ అడవిఅంతా తిరిగాడు. కాని లాభంలేదు. చివరకు నిరాశ చేసుకుని స్వర్ణపురికి బయల్దేరాడు.

స్వర్ణపురికి రాగానే ఊరిబయట కొందరివలన సంగతంతా విన్నాడు, స్వర్ణలతను విక్రముడనే రాజు పెదికి తెచ్చాడని, జయచంద్ర మహారాజు విక్రముడికే స్వర్ణలత నిచ్చి పెళ్లి చేయ నిశ్చయించాడని వాళ్లు చెప్పారు. వెంటనే విజయుడు మాయాటోపీని నెత్తిపై పెట్టుకుని, కోటలోకి వెళ్లాడు.

అంతఃపురంలో మంచంమీద స్వర్ణలత తెలివితప్పి పడివుంది. జయచంద్రుడు, విక్రముడు ఇంకా సేవకులు మంచంచుట్టూరా వున్నారు. విజయసేనుడు టోపీ తీసివేశాడు. అందరూ అతన్ని చూశారు.

విక్రముడు విజయసేనుని చూడగానే వణకసాగాడు తన గుట్టు బయటపడుతుందని. విజయసేనుడు ఇప్పట్లో వస్తాడని అతడనుకోలేదు.

జయచంద్రుడు "విజయసేనా! నువ్వు నా కుమార్తెను తేలేకపోయావు. విక్రముడు ఆమెను తీసుకువచ్చాడు. కనుక ఆమెను విక్రమునికే ఇచ్చి పెళ్లి చేస్తాను." అన్నాడు.

"కాని ఆమెకు తెలివి తెప్పించగల ఔషధం నాదగ్గర వుంది." అన్నాడు విజయుడు నవ్వుతూ.

"నీ దగ్గర ఏమి వుంది?" అన్నాడు జయచంద్రుడు.

అపుడు విజయసేనుడు కథ అంతా చెప్పాడు. గుఱ్ఱాన్ని ఎలా స్వాధీనపరచుకొంది, బంగారు ఖడ్గాన్ని ఎలా సంపాదించిందీ, నరాంతకుని ఎలా సంహారించిందీ చెప్పాడు. స్వర్ణలతను విక్రముడు తనవద్దనుండి ఎత్తుకువచ్చిన సంగతిని కూడా చెప్పాడు.

"ఇదంతా అబద్ధం. నరాంతకుని సంహారించింది నేనే." అంటూ విక్రముడు కోపంతో కత్తి లాగి విజయుడిమీద కురికాడు.

విజయుడు తన స్వర్ణ ఖడ్గం ఝుళిపిస్తూ "ఇదిగో బంగారుకత్తి. దీనితోనే నరాంతకుని సంహారించాను. నీ తలకూడా ఒక్కవేటుకి తెగిపోతుంది." అని బెదిరించాడు.

జయచంద్రుడు ఇద్దరినీ వారించి "విజయసేనా! నువ్వే నరాంతకుని చంపినట్లయితే, నీ దగ్గ రేమయినా గుర్తున్నదా?" అని అడిగాడు. విజయుడు తన మొలకు చుట్టుకున్న బంగారు గడ్డం తీసి చూపించాడు. అప్పుడు జయచంద్రుడు విజయుని మాటలు నమ్మాడు. విక్రముని మోసానికి మహాగ్రహంతో అతనిని ఊరి అవతలకు భటులచేత తరిమివేయించాడు.

తరవాత విజయసేనుడు తాను తెచ్చిన సెలయేటి నీరు స్వర్ణలత నోటిలో పోసి ఆమెకు తెలివి తెప్పించాడు. ఆమె కన్నులు తెరిచి విజయుని కాళ్లపై పడింది. విజయసేను డామెను లేవదీశాడు.

తరవాత జయచంద్రమహారాజు విజయసేనుడికి, స్వర్ణలతకు మహా వైభవంగా వివాహం చేశాడు. అంత గొప్పగా జరిగిన వివాహం అంతకుముందు గాని, తరవాతగాని లేదని ఇప్పటికీ చెప్పుకుంటూ వుంటారు. ★★

తమాషా ప్రశ్నలు

(1) ఒకడు కాలవలో ఎదురు ఈదుతూ అరగంటలో ముప్పావు మైలు వెళ్లగలిగాడు. కాలవలో నీళ్లు ప్రవహించకుండా నిశ్చలంగా ఉన్నట్టయితే ముప్పావుమైలు దూరం పావుగంటలోనే ఈదగలిగేవాడు. కాలవ గంట కెన్ని మైళ్ల వేగంతో ప్రవహిస్తున్నది?

(2) నేను రైలుస్టేషనులో ఒకచోట నుంచున్నాను. ఒక గూడ్సు బండి నన్ను దాటిపోవటానికి 9 సెకండ్లు పట్టింది. 88 గజాల పొడుగున్న ప్లాటుఫారమును పూర్తిగా దాటిపోవటానికి 21 సెకండ్లు పట్టింది. గూడ్సుబండి పొడు గెంత?

(జవాబులు మరో పేజీలో)

టామ్ సాయర్

(31-వ పేజీ తరువాయి)

రావుగదా అని. కాని సిడ్ టామ్ నిద్రపోయినతరవాత నెమ్మదిగా రుమాలు లాగేసి టామ్ అరిచే అరుపులన్నీ వినేవాడు. ఈ సంగతి టామ్‌కి తెలియదు.

పగటిపూట వీలుదొరికినప్పుడల్లా టామ్ ఊళ్లోవున్న జైలుకి వెళ్లేవాడు. అక్కడ కాపలాగా ఎవరూ వుండేవాళ్లు కాదు. టామ్ ఏవన్నా పళ్లో, లేకపోతే తినేవస్తువు ఇంకేదైనా సంపాదించి కటకటాల గుండా మఫ్‌పాటర్‌కి అందించేవాడు. పాటర్‌ని అన్యాయంగా జైల్లోపెట్టారనీ, అతన్ని తనురక్షించలేక పోయానని టామ్‌కి విచారంగా వుండేది. ఆ విచారం ఇల్లాంటి చిన్న చిన్న సహాయాలవల్ల కొంత తగ్గేవి.

ఈ విచారం తగ్గిందికాని, టామ్‌కి ఇంకో విచారం పట్టుకుంది. బెకీ థాచర్ (కొత్తమ్మాయి) స్కూలుకి రావటంలేదు. ఆఅమ్మాయికి జబ్బుగా వుందిట. చచ్చిపోతుందేమో నని టామ్‌కి బెంగ. రోజూ ఆమె ఇంటిచుట్టూ తిరిగేవాడు.

టామ్ ఇదివరకులాగా ఉత్సాహంగా వుండటంలేదు. నలతగా వుంటున్నాడు. పెద్దమ్మకి మందుల మీద, అందులోకొత్తకొత్తమందుల మీద బాగా నమ్మకం. ఆవిడ మందుల పత్రికలు బోలెడు తెప్పించేది. వాటిల్లో ప్రకటించబడే మందుల్ని కొని ఇంట్లోవాళ్లమీద, ఇరుగుపొరుగువాళ్లమీద ప్రయోగిస్తూవుండేది.

ఈమధ్య కొత్తగా పత్రికల్లో కొత్తరకం వైద్యం ఒకటి బాగా పేరుకి వచ్చింది. ఏ జబ్బునైనా నీళ్లతో కుదర్చవచ్చునని ఆమె పత్రికల్లో చదివింది. దాన్ని వాడిచూడటానికి ఆవిడకి ఇంతవరకూ వీలు చిక్కలేదు. ఇప్పుడు టామ్ దొరికాడు. నీళ్లగదిలో టామ్‌ని నుంచోబెట్టి వాడిమీద బిందెలకి బిందెలు మంచు నీళ్లకంటే చల్లటి నీళ్లని గుమ్మరించేది. తువ్వాలుపెట్టి నెత్తురొస్తుందేమో అనేంతదాకా వళ్లు రుద్దేది. తరవాత వంటినిండా శాలువ కప్పి బాగా చెమటలుపట్టనిచ్చేది. కాని ఎంతచేసినా టామ్ పరిస్థితి బాగుపడలేదు.

తరవాత వేడినీళ్ల వైద్యం. వళ్లు పట్టనంత వేడినీళ్లు గుమ్మరించేది. దానితరవాత నీళ్ల తొట్టిలో బుడుగూ, బుడుగూ ముంచటం ప్రారంభించింది. పెట్టే అన్నం తగ్గించేసింది. ఎంత చేసినా టామ్ అల్లాగే వున్నాడు. ఎక్కువ మాట్లాడడు, నవ్వడు; ఎటో దిగులుగా చూస్తాడు.

మళ్లీ పత్రికల్లో ఒక కొత్త మందునుగూర్చి ప్రకటన పడింది. దాని పేరు పెయిన్-కిల్లర్. అంటే అన్నిరకాల నెప్పుల్ని చంపేసేది అని అర్థం. ఆ, ఇది బావుందనుకున్నది పోలీ పెద్దమ్మ. ఆ మందు అయిదారుసీసాలు తెప్పించింది. ఒక బొట్టు తను రుచి చూసింది. ఓ, బలేగా వుంది. ఒక్క బొట్టు నాలిక మీద పడితే చాలు, ఇహ రెండు రోజులదాకా నాలిక భగభగ నిప్పులాగా మండవలసిందే. దీనితోటామ్ రోగం తప్పకుండా కుదురుతుంది.

టామ్‌తో ముందే చెప్పింది, ఇది చాలా అద్భుతమైన మందు అని. జాగ్రత్తగా తేనె తాగించినట్టు రెండు చెమిచాల మందు గ్లాసులో పోసి ఒక్కసారిగా గుటక వేయించింది. వెంటనే మందుగుణం కనిపించింది. అంతవరకూ స్తబ్ధుగా కూర్చునే టామ్ ఎగిరి గదిలో గంతులేస్తూ, నాట్యం చెయ్యటం మొదలెట్టాడు. వాడి గావుకేకలికి ఇల్లెగిరిపోతుందా, అనిపించింది.

టామ్ ఇక వూరుకుంటే లాభం లేదనుకున్నాడు. ఈ పెయిన్-కిల్లర్ మందుని పెద్దమ్మ రోజూ తాగించేటట్టు వుంది. కొత్త ఎత్తు ఎత్తాడు. మర్నాడు పొద్దున్నే పెద్దమ్మదగ్గిరికి వెళ్లి 'నిన్నటిమందు బలేగా వుంది పెద్దమ్మా! నాకు బాధలన్నీ తగ్గిపోయాయి. ఎంత మంచిమందు పెద్దమ్మా!' అని పొగడటం మొదలెట్టాడు. పెద్దమ్మ సంతోషించింది. 'నేనే తీసుకు తాగుతాను పెద్దమ్మా!' అని సీసా తీసుకున్నాడు.

ఆ రెండోరోజున పెద్దమ్మ మందుసీసా చూసేటప్పటికి అప్పుడే సగం అయిపోయింది. 'టామ్ మందు జాగ్రత్తగా పుచ్చుకుంటున్నాడల్లే వుంది' అనుకున్నది. మూడోరోజున సీసా ఖాళీ! మళ్ళీ కొత్తసీసా తీసుకున్నాడు టామ్. వాడి గదిలో గచ్చునేలమీద ఒక పగులు వున్నది. పాపం గచ్చునేల ఎంత బాధపడుతోందో అని టామ్ ఆబాధ తగ్గించటానికి మందుని ఆపగులులో పోస్తున్న సంగతి పెద్దమ్మకి తెలియదు.

ఒకరోజున టామ్ ఆ పగులు చేత మందు తాగిస్తున్నాడు. పెద్దమ్మ పెంచే పిల్లికూన అక్కడికి వచ్చింది. అది సీసాకేసి, చెమిచాకేసి ఆత్రంగా చూస్తోంది.

"ఏం, నీక్కూడా మందు కావాలా ?"

పిల్లి కావాలన్నట్టు చూసింది.

"నిజంగానే ?"

నిజంగానే అన్నట్టు చూసింది.

"మళ్లీ మంటపుడితే నన్నడగొద్దు. ముందే చెబుతున్నాను"

పిల్లి పరవాలేదు ఇమ్మన్నట్టుగా కనబడింది.

"ఇదుగో, తరవాత ఏడ్చావంటే లాభం లేదు." అన్నాడు టామ్. పిల్లి దగ్గిరికొచ్చింది. దాని నోరు తెరిచి ఒక చెమిచాడు మందు పోశాడు. ఇహ చూసుకోండి. రెండుగజాల ఎత్తున గాలిలో కెగిరింది పిల్లి. దభేలున పడి లేచింది. మ్యావ్, మ్యావ్ అంటూ గదిలో గిర్రున పరిగెత్తింది. ముక్కాలిపీట, దానిమీదవున్న గాజుగ్లాసులు పడేసింది. దోవలో కనిపించిన ప్రతిదాన్నీ తన్నేసింది. గదిని చిందరవందర చేసింది. 'ఎంత సంతోషమో దానికి,' మందు తాగేటప్పటికల్లా' అనుకున్నాడు టామ్.

ఈ చప్పుడంతా విని పెద్దమ్మ గబగబ గదిలోకి వచ్చింది. పిల్లి ఒక్క పిల్లిమంత్రం వేసి కిటికీలో వున్న కూజా పడగొట్టి బయటికి పారిపోయింది. టామ్ నేలమీద విరగబడి నవ్వుతున్నాడు.

"టామ్! ఏమిట్రా ఆ పిల్లిగోల" అన్నది పెద్దమ్మ.

"నాకు తెలియదమ్మా!" అన్నాడు టామ్ ఇంకా నవ్వుతూ.

"రోజూ లేంది ఇవ్వాళ ఏం వచ్చింది ఆ పిల్లిముండకి."

"అది కాదమ్మా! దానికెందుకో సంతోషం పట్ట పగ్గాలు లేకుండా వుంది."

ఆవిడ దగ్గిరికొచ్చింది. పరుపు కిందనుంచి తొంగిచూస్తున్న మందు సీసాని, చెమిచాని బయటికి తీసింది. టామ్ నవ్వు ఆపేసి దొంగచూపులు చూసింది. పెద్దమ్మ అలవాటు ప్రకారం టామ్ చెవిపైకి చెయ్యి పోనిచ్చి ఒక్క గుంజు గుంజి నుంచోపెట్టింది.

"ఓరి వెధవా! ఈ మందు ఆ పిల్లికి పోశావా?"

"అది కాదమ్మా. ఆ పిల్లికి పెద్దమ్మ లేదుకదూ, అందుకని దానిమీద జాలివేసింది.

"భడవాకానా! ఆపిల్లికి పెద్దమ్మ లేకపోతే నేం?"

"ఎందుకేమిటి? పెద్దమ్మ వుంటే ఆ పిల్లిని మంచునీళ్లలో ముంచేది. వేడినీళ్లు గుమ్మరించేది. దానికి మందులిచ్చి నాలిక, గొంతిక మండించేది. పాపం దాని కెవరూ లేరుకదా అని నేనే మందిచ్చాను."

ఈ మాటలు కొరడా దెబ్బల్లాగా తగిలాయి పెద్దమ్మకి. అక్కడినించి ఆవిడ వెళ్లిపోయింది.


టామ్ స్కూలుకి టైము కాకుండానే వెళ్లాడు. రోజూమల్లేనే దిగులుగా వున్నాడు. గేటులోనించి వచ్చేవాళ్లందర్నీ చూస్తాడు. బెకీథాచర్ మాత్రం ఎన్నాళ్లకీ కనిపించదు.

హఠాత్తుగా టామ్‌గుండె ఝల్లుమంది. బెకీథాచర్ ! గేటులోనించి వస్తోంది ! ఇంకో నిమిషానికల్లా టామ్ నేలమీద పిల్లిమొగ్గలు వేస్తున్నాడు. 'హేయ్' అని కేకలు వేశాడు. బిగ్గిరిగా నవ్వాడు. ఒక కుర్రాణ్ణి జుట్టుపీకాడు. ఒకణ్ణి వీపు మీద పోటు పొడిచాడు. ఈలలు వేశాడు. గోడకి కాళ్లానించి తలకిందులుగా నుంచున్నాడు.

ఈ గోలంతా బెకీథాచర్ తనకేసి చూడటానికి చేసిందే. కాని ఆమెమాత్రం టామ్‌వైపుకి చూడనే లేదు. అసలు టామ్ అనేవాడు ఉన్నసంగతి తెలియనే తెలియనట్టుగా ఇంకోవేపు చూస్తోంది.

టామ్ బెకీదగ్గిరికి వెళ్లి పిల్లిమొగ్గలు మొదలెట్టాడు. ఇంకొంచెం వుంటే ఆమె మీదపడి పడేసేవాడే. చివరి కామె టామ్‌కి వినబడేటట్టుగా, "కొందరు తాము చాలా గొప్పవాళ్ళ మనుకుంటారు. వెధవ చేష్టలు చేస్తూను." అన్నది.

టామ్‌బుగ్గలు ఎర్రపడ్డాయి. శాంతించాడు. ముక్కు నలుపుకున్నాడు. గొప్ప అవమానం జరిగినట్టు తలవంచుకుని వెళ్లిపోయాడు.



అసలు నారాయణకి అస్తమానం ఎందుకు దెబ్బలు తగులుతాయంటే వాడి తుంటరిపనులే కారణమని చెప్పాలి. ఒకనాడు ఏమిచేశాడంటే ఎక్కడెక్కడి పిల్లలనో చేరదీసి నాటకం అని మొదలుపెట్టాడు. వాళ్ల అక్కయ్యకీసంగతి తెలిసింది. ముందరే చెప్పింది, అయిదు వేళ్ల అప్పచ్చి పెడతానని. కాని నారాయణ అక్కమాటలు లక్ష్యపెట్టలేదు. వాడు తీసుకువచ్చిన వాళ్లందరిలోనూ పెద్దవాడు గోపి.

ఇంతకీ వేయదలుచుకున్న నాటకం పేరు 'లవకుశ'. కష్టపడి అట్టకిరీటాలు, కర్రబాణాలు తయారు చేశారు. నాటకం వెయ్యదలుచుకున్న స్థలం ఎక్కడంటే నారాయణవాళ్ల 'పశువుల పాక' మహల్లో. టిక్కెట్లుకూడా పంచిపెట్టారు. బళ్లోపిల్లలు చాలామంది నాటకానికి వచ్చారు. వేషాలు వేసేందుకు బట్టలుండాలిగా. నారాయణ వాళ్ల అమ్మకి తెలియకుండా పాతబట్టల మూట ఎత్తుకొచ్చాడు. అందరూ దానిమీద కెగబడ్డారు. ముందర పాకలో సగంవరకూ తాడుకట్టి దానిమీద ఒక తెల్లగుడ్డ తెరలాగా వేశారు.

గోపి: ఒరే నారాయణా, నువ్వు నల్లగా వుంటావు కనక శ్రీరాముడి వేషానికి బాగా పనికి వస్తావు. నువ్వు యీ పచ్చ పట్టు బట్ట కట్టుకో. శంకరం లక్ష్మణుడి వేషం, రామూ సోమూ లవకుశులు వేస్తారు. నేను వాల్మీకివేషం వేస్తాను.

నారాయణ -అందరూ సరిపోయారు గాని, మరి సీతామ్మవారు ఎవరు వేస్తారు?.

ఎస్. సీతాదేవి

గోపి- ప్రసాద్ నువ్వు వెయ్యరాదూ, కాళీగానే వున్నావుగా? ప్రసాదు- నేను ఆడవేషం వేస్తానట్రా? ఛస్తేవెయ్యను.

గోపి- పోనీ ఇంకెవరన్నా వేస్తారా? వెయ్యరూ? అరిగిపోయినట్టు మాట్లాడతారేం? చూస్కోండి, మా తమ్ముడిచేత నిమిషంలోకి వేయిస్తాను. ఏదీ, ఇలా రా, తమ్ముడూ. ఈ బట్ట చీరెలాగా కడతాను. ఊ- చూస్తావేం?

వెంకు- ఊ... వద్దులా... నాకు గుండు ఉందిలా...

గోపి-ఉంటే ఉండితే. గనుస్తావేఁ, రమ్మంటుంటే- ఆ, అంతా సెటిల్ అయినట్టేకదూ. ఇక తెర ఎత్తండి.

తెర ఎత్తారు. నారాయణ శ్రీరాముని వేషంలో సిరాతో మీసాలూ, అట్టకిరీటం పెట్టుకుని, చేతిలో విల్లు పట్టుకొని నుంచున్నాడు. దీనిగా పక్కన శంకరం లక్ష్మణుడి వేషంలో నుంచున్నాడు. శ్రీరాముడు కూచోటానికి పాత సున్నండబ్బాలమీద బట్టలు పరిచి సింహాసనం తయారు చేశారు. శ్రీరాముడు మాంచి ధూకుడుగా వచ్చి, కాలుమీద కాలు వేసుకుని కూర్చోవటంతో సున్నండబ్బాలు దొర్లి వెనక్కిపడ్డాడు. పిల్లలంతా గొల్లున నవ్వారు. శ్రీరాముడు లేచి ఊడిపోయిన పంచ కట్టుకుని సరిగ్గా కూచున్నాడు.

శ్రీరాముడు- ఓరీ లక్ష్మణా! నీవు మీ ఒదినగారైన సీతమ్మవారిని తక్షణమే అడివిలో దింపిరమ్ము.

లేనిచో నే నూరుకోను.

లక్ష్మణుడు— (ఏమీ తోచక) చిత్తం.

గోపి (నెమ్మదిగా) చిత్తం ఏమిట్రా. అప్పుడే ఒప్పుకో గూడదు తీసుకెళ్లటానికి.

లక్ష్మణుడు-(బిగ్గిరిగా) నే నప్పుడే ఒప్పుకోను. అప్పుడే తీసుకొని వెళ్లను. ఇప్పుడు నావల్ల గాదు.

శ్రీరాముడు-(గుడ్లెర్ర జేసి) తీసుకొని పోవా? చూడుము, ని న్నేమి చేసెదనో? (అని విల్లుచూపించాడు)

లక్ష్మ—అయినచో ఇప్పుడు తీసుకొని వెళ్ళెదను. న న్నేమీ చెయ్యవద్దు.

శ్రీరాముడు-ఆ, అట్లు దారికి రమ్ము. నీవు చాలా మంచివాడివి లక్ష్మణా!

(తెర వేశారు. మళ్ళీ తెర తీసేటప్పటికి సీతా లక్ష్మణులు వున్నారు. సీతవేషం వేసిన వెంకు గుండు కనిపించకుండా ముసుగు వేశారు.)

లక్ష్మణుడు—ఓ, సీతమ్మతల్లీ! నిన్ను అడివిలో దింపి రమ్మనమని మా అన్నగారైన శ్రీరాముల వారు సెలవిచ్చిరి. నే నింటికి పోవాలి. నీ విక్కడే ఉండుము తల్లీ!

సీత-(నన్ను తల్లీ అంటా డేమిటా అని ఆలోచిస్తూ వెంకు మాట్లాడడు.)

గోపి-ఒరేయ్ తమ్ముడూ! హారామా, హారామా అనరా.

సీత-ఎంత సేపటికీ మాట్లాడడు వెంకు. గోపీ తంతా నన్నాడు. భయపడి వెంకూ ఏడుస్తూ 'ఆ లామా, ఆ లామా' అన్నాడు. పిల్లలంతా ఒకటే నవ్వు. వెంకూకి కోపం వచ్చి పారిపోబోయాడు. కాని మళ్లీ లాక్కొచ్చి కూచోబెట్టారు. లక్ష్మణుడు వెళ్లిపోయాడు. వాల్మీకివేషంలో గోపి వచ్చాడు.)

వాల్మీకి-ఎవరు తల్లీ నువ్వు? ఒంటరిగా ఏమి చేయుచున్నావు?

సీత-(మాట్లాడడు వెంకు.)

వాల్మీకి-ఓహో నీవు సీతవా? అట్లయినచో మాయింటికి రమ్ము. దుఃఖింపకుము.

(తెరవేశారు. మళ్లీ తెర తీసేటప్పటికి లవకుశులు విల్లులు, బాణాలతో నుంచున్నారు. ఎదురుగా లక్ష్మణు డున్నాడు. ఎక్కడిదో కొయ్యగుర్రంబొమ్మనికూడా తెచ్చారు.)

లక్ష్మణుడు - పిల్లలారా! మీరీ గుర్రము నేల పట్టుకొంటిరి?

లవ, కుశులు - మా యిష్టం. పట్టుకుంటే నీ కేం. నువ్వెవడివి అడగటానికి. చేతనయితే యుద్ధం చేసి తీసుకు పో.

లక్ష్మణుడు-(వాళ్లిద్దరి పొగరుబోతుమాటలు విని శంకరం భయపడ్డాడు. ఏమనాలో తెలియక కాస్సేపు నుంచున్నాడు.) ఓరీ-మీ కెంత పొగరురా? ఐతే కాచుకొనుడు. ఇదుగో ఆగ్నేయాస్త్రము. (బాణం వేశాడు. అది కుశుడి కాలికి తగిలింది. రామా గోలపెడుతూ)

కుశుడు-అబ్బ, ఎంత దెబ్బ కొట్టావురా, నీ దుంప తెగ.

గోపి-శంకరం, నెమ్మదిగా వెయ్యాలి బాణం. తగిలేట్టు వెయ్యగూడదు. ఏయ్, పిల్లలూ, యుద్ధం జరుగుతోంది, డబ్బాలు వాయించండి. (పెద్దడబ్బాల మోత.) శంకరం! నువ్వు ఆట్టే



పెళ్ళిమార్కెట్టు

(23-వ పేజీ తరువాయి)

వాళ్ళకి కేవలం డబ్బే ప్రధానం గాదు. కుల స్థాన, పౌరుషాలు కూడా కొంచెం చూడాలి.

అవ: వెఱ్ఱివాడివి! కులం, స్థానం, పౌరుషం- గూడు పెద్దమాటలు, అర్థంలేని మాటలు. ఈమూడు మాటలూ ఎందులో ఇమిడున్నాయో తెలుసా. ఒకటేమాట ద్వ్యక్షరి. ధనం, డబ్బు; పైసా. అది లేని వాడికి కులమూ లేదు, స్థానమూ లేదు, పౌరుషమూ లేదు.

"అర్థవంతుండు దా నెట్టు లనిన జెల్లు
అర్థహీనుండు దా నెట్టు లనిన చొల్లు
భాగ్యవంతుడె జగదేక పండితుండు
భాగ్యవంతుండె భువనైక పావనుండు."

ఇదీ లోకమర్యాద. ఈ మర్యాద ననుసరించి మనం ప్రవర్తించాలి ఇక చెప్పు చూతాం నవ్వు చెప్పగలిగిందేదో.

రత్నా: మీరు పెద్దలు; వయోజ్ఞానవృద్ధులు. మీకు చెప్పగలవాణ్ణా! అయినా అవతలవాళ్ళ పరిస్థితుల్ని బట్టి...

అవ: అబ్బ; ఒకరి పరిస్థితుల్నాలోచించడానికిది కాలమటోయ్. ఎవడి సెత్తిబరువు వాడే దించుకోవాలి.

రత్నాలు: మీరలా గనడం ధర్మం కాదు. సర్వసమత్వం, అహింస, మొదలైన ఉత్తమధర్మాల్ని బోధించే మీరు...

అవధా: ఓయి వెఱ్ఱివాడా బోధించేవాడు ఆచరిస్తాడటోయ్. దానికి దీనికి చాలా దూరం. ఒకరిసొమ్ము కాశించకూడదని బోధించేవాడెవడు? అందరి సొమ్మూ గుంజి గుంజి తనింట్లో పోసుకున్నవాడే.

రత్నా: అవుతే మనిషి చెప్పేదానికి చేసేదానికి సంబంధం ఉండక్కర్లేదన్న మాట.

అవధా: స్వవిషయంలో అంతే.

రత్నా: అందరూ అలాగే ఆలోచిస్తే, కోమటి, పాలు కథలా తేలుతుందేమో.

అవధా: జనసామాన్యంలో పాపభీతి, ధర్మచింత, అంటూ ఏకుస్తున్నాయిగా, అవున్నంతకాలం మన చలామణీకి లోపం ఉండదు.

రత్నాలు: ఈ రహస్యం జనసామాన్యం గ్రహిస్తే.

అవధా: ఓయి వెఱ్ఱినాగమ్మ! "తథా సర్వేషామపి" అప్పుడందరితోపాటు మనమూను. కీలకమేమిటంటే - నువ్వేమిటనుకుంటున్నావన్నది కాదు ప్రశ్న; నువ్వేమంటున్నావన్నది ప్రశ్న. నువ్వేలాగున్నావన్నది కాదు ప్రశ్న; నువ్వెలా కనపడుతున్నావన్నది ప్రశ్న. గుడ్డిలోకానికి 'దివ్వె చూపెట్టి ఏం ప్రయోజనం? చవురు దండుగ.

రత్నాలు: మీరనుభవశాలురు. మీతో నేను వాదించగలనా?

అవధా: అబ్బే నువు వాదించలేక కాదు. అవుతే యిప్పుడు నా చెయ్యి మీదు నీ చెయ్యి కింద. అందుకే ఈ నంగనాచి గడుసు రాకట్లు.

రత్నా: అదికాదులెండి; కాని మీరన్నమాటమాత్రం వాస్తవం. ఆడపెళ్లి పెద్ద, మగపెళ్ళివారి బంట్రోతుకూడా లోకువ.

అవధా: ఆ! మూడుముళ్లూ పడేవరకే లెండి మగపెళ్ళివారి హయాం. తరవాత వీరు వారవుతారు, వారు వీరవుతారు.

రత్నా: తరవాత ఎవరేలాగయినా ఇప్పటికిమాత్రం మీ మాటే వాస్తవం. కాబట్టి నా ప్రార్థన మన్నించి మరోమాట.

అవ: అబ్బే నే నిన్ని మాటలవాణ్ణి కాదు. అయినా ఏదో అంటావు గాని నీకు మాత్రం తెలియవూ ధరవరులు. అక్కడికి పద్దాపెరిగిపోయాయి.

రత్నా: అవున్లెండి. అందుకే ఆ మొన్నటన్న అయిదు వేలకి వ్యవహారం ఫైసల్ చెయ్యమని నా ప్రార్థన.

అవధా: అది మొన్నటి రేటు; ఇప్పుడు మార్కెట్టులో సరుకు గిరాకీ; Demand చూస్తే జాస్తీగా ఉంది. నిన్ననే ఒకాయన ఎనిమిదివేలిస్తానంటే మా అబ్బాయి మొగమెత్తలేదు. పదివేలిస్తేనేగాని పిల్లని పెళ్లాడనని వాడు భీష్మించుకు కూర్చున్నాడు. ఇందులో నిజానికి నా ప్రసక్తే లేదు.

రత్నా: పోనీయండి. మీ అబ్బాయి నొకమారు పిల్లని చూడ్డానికి పంపిస్తారా?

అవధా: అందు కభ్యంతర మేముంది. ఇప్పటికి చూడవలసినవాళ్లు పదిమందయారు. ఓ ట్యూరు వేసుకుంటేసరి అందరినీ చూడ్డం అయిపోతుంది.

రత్నా: ఇదేమి (Exhibition) ఎగ్జిబిషనా మహాశయా.

అవధా: కాదు సంత. పసువుల సంత.

రత్నా: మీకూ ఆడపిల్లలున్నారు. మీరలా అనడం భావ్యం కాదు.

అవధా: ఉన్నారు కాబట్టే భావ్యం. ఈ పాట్లు నేను పడ్డాను కాబట్టే భావ్యం. నా యిద్దరాడపిల్లలకీ పెళ్ళిళ్ళయిపోయాయిలే.

రత్నా: అనుభవజ్ఞులు; కష్టసుఖాలు తెలిసిన మీరు, మళ్ళీ.

అవధా: ఆ త్రోవనే వెళ్లడం భావ్యం కాదంటావు. ఏం. కాని నాయనా అప్పుడు నువ్వుకూడా ఉన్నావు కదా. నాకు చెప్పిన శ్రీరంగనీతులు వారికి చెప్పలేకపోయావు?

రత్నా: వారికీ చెప్పేను మహాత్మా! వాళ్లూ మీ మాటలే తూ. చ. తప్పకుండా అన్నారు.

అవధా: అన్నారా! అందుకే నే చెప్పే ఒక్క పరమసత్యం విను. సంఘపరిస్థితులు మారితేనే గాని వ్యక్తిగతంగా మనిషి మారలేడు.

రత్నాలు: వ్యక్తి మారితేనేగాని సంఘపరిస్థితులు బాగుచేసినంత మాత్రాన లాభం లేదంటారు కొందరు.

అవధా: సుత్తి ముందా కారు ముందా అన్న వాగ్వాదంతో లాభంలేదు. వ్యక్తిగతంగా మార్పురావాలంటే నూరేళ్లు పడుతుంది. ఈ లోపల నువ్వూ, నేనూ కూడా స్వర్గాని కెగుమతవుతాం.

రత్నా: స్వర్గానికో నరకానికో

అవధా: పాపభీతి గలవాళ్లకే నరకాలు సృష్టించబడ్డాయిలే, నీకూ, నాకూ స్వర్గమే.

రత్నా: నన్ను పాపభీతి లేనివాడనే అంటారూ?

అవధా: అంటానా, అని చూస్తానా. రూపాయికి మూడడ్డల ధాన్యం అమ్ముకుంటూ డబ్బు చేసుకుంటున్న నిన్నుకాక

నేపు యుద్ధం చెయ్యకూడదు. దబ్బున మూర్ఛపో.

శంకరం యీమాట వినగానే వెనక ఏమున్నదో చూసుకోకుండా పడిపోయాడు. అక్కడ పశువుల రొచ్చు వుంది. దాంట్లో పడి బట్టలన్నీ పాడుచేసుకున్నాడు.

ఇంతలో నారాయణ వాళ్ల అక్కయ్య డబ్బాలమోత విని అక్కడికి వచ్చింది. వీళ్లు చేసిన నాటకంహడావిడిని చూసి ఆమె విరగబడి నవ్వటం మొదలెట్టింది. ఆమెను చూడగానే వేషాలైనా తీసెయ్యకుండా ఎక్కడివాళ్లక్కడ ఉడాయించారు.

పోనీ, రంభ, పేగులెండిపోయిన పేద పాణ్ణి వర్ణిస్తుందా!

రత్నాలు: రంభనిగ తరిగిరి. ఆ దేవణ్ణి వరిస్తే నాకేం గాని, బావగారూ! ఎలాగో మీరీ సంబంధం అంగీకరించాలి. మీ మాటకి ఎదురాడేవాళ్లు మీ యింట్లో ఎవరూ లేరు.

*　*　*

అవధా: రత్నాలూ మీ స్లీడరుసంగతి నాకు తెలియందికాదు. కొడుకుపెళ్లంటే చింకి తట్ట పట్టుకు కూర్చుంటాడూ? కూతురు పెళ్లనే సరికే ఒచ్చిందా కటికి దరిద్రం?

రత్నాలు: ఆయనకి మీ కున్న సంస్కారం లేదండీ.

అవధా: సంస్కారంలేదనకు; సంకోచంలేదనూ; సందేహం లేదనూ. సరే అతనికొడుక్కి ఆయనెంత కట్నం పుచ్చుకుంటాడో అంతే నేనూ పుచ్చుకుంటాను సరా.

(తెర లో)

నాన్నా! కట్నాలు పుచ్చుకోండి మానుకోండి. మా ఆడపడుచు కట్నాలు మాత్రం మాకిచ్చి తీరాలి. నూటపదహార్లకి తక్కువైతే ఒప్పుకోం.

అవధా. చూసేవా మా పెద్దపిల్ల ఆలూ లేదు చూలూ లేదు అప్పుడే ఆడపడుచు కట్నం కావాలట.

(తెర లో)

ఏకుండోయ్, అబ్బాయికి వెండి చెంబులు, పట్టుపంచలు, పంచకంచం, ఉంగరం, రిస్టువాచీ, సైకిలు, అదనంగా ఇవ్వాలి మరిచిపోకండి.

అవధా: మాఆవిడ, కోరవలసినవన్నీ కోరిందో ఇంకా ఏవేనా మరిచిపోయిందో కనుక్కోవాలి.

(శర్మప్రవేశం. ఇరవైయేళ్లకు మించి ఉండవు. చామనచాయ; నవనాగరికత బలిసిఉన్న వేషం——)

అవధా: అదుగో మా అబ్బాయి సరిగ్గా వేళకొచ్చేడు.

శర్మ: (రత్నాల్ని చూడకుండానే) నాన్నగారూ! ఈవాళ ఓ గొప్ప పామిస్టొచ్చి కృష్ణాజిల్లా స్టూడెంట్సు చేతులన్నీ చూసేడు.

అవధా: నీ చెయ్యి చూసేడా?

శర్మ: (సగర్వంగా) ఓ.

అవధా: ఏం చెప్పేడు. మీ ఫాదరు ఈ ఏడాదిలోగా పరమపదిస్తాడని చెప్పేడా.

శర్మ: అదేమిటి నాన్నగారూ ఎప్పుడూ Sentimental గా నే మాటాడుతారు. చాల బాగా చెప్పేడు.

అవధా: ఏమిటో బాగు.

శర్మ: నా Wife పెద్ద డౌరీతోను. Lands తోను ఒస్తుందన్నాడు నాన్నగారూ!

అవధా: (గంభీరంగా) ఏపాటి Figure చెప్పాడా.

శర్మ: పది పదిహేను వేలుంటుందన్నాడు.

అవధా: ఇంతేనా.

శర్మ: మరి Lands కూడా చెప్పేడుగా.

అవధా: ఇంకా ఏం చెప్పేడు.

శర్మ: (సగర్వంగా) నాకు ఫారిన్ టూరుందటండీ.

అవధా: ఓహో. బాగానే ఉంది ఇంకేం. ఆ కట్నంతో అమెరికా వెళ్ళిరావచ్చు. (రత్నాలవైపు తిరిగి) చూసేవా రత్నాలూ, మన చదువులు, సంస్కారాలు ఇలా గున్నాయి.

శర్మ: (రత్నాలవైపు చూసి కొంచెం తెల్లబోయి) (Good morning sir) మీ రెప్పుడొచ్చారు.

రత్నాలు:- ఇప్పుడే అంతా ఓగంట యింది.

అవధా:- రత్నాలు నీకో సంబంధం తెచ్చేడు. మాణిక్యంలాంటి పిల్ల. చదువుకుంది. సంగీతసరస్వతి బాగుందా.

శర్మ: అన్నీ బాగున్నాయి. కాని పిల్లని చూస్తేగాని నా మాటివ్వలేను.

అవధా: కాని ఒక్కమాట. ఆయన కట్నం ఏవీ ఇచ్చుకోలేడు. ఏవో తగదు మాత్రం——

శర్మ: (మొగంముడిచి) ఏవో నాన్నగారూ! అమ్మ కట్నం పదివేలకి తక్కువైతే ఒప్పుకోదనుకుంటా.

అవధా. నువ్వా, మీ అమ్మా పెళ్ళాడేది. నీమాట చెప్పు.

శర్మ: (మెల్లగా) అమ్మ మాటేనా మాట.

రత్నాలు: శర్మా! చదువుకున్నవాడివి. నువ్వూ కట్నం అంటే ఎలాగ?

శర్మ: చదువుకున్నవాణ్ణి కాబట్టే కట్నమండీ.

అవధా: మంచి సంబంధం నాయనా!

శర్మ: ఆఁ, దీని తాత సంబంధం మరొకటొస్తుంది. (అని చైరున లేచి వెళతాడు).

అవధా: రత్నాలూ! నీ సందేహం తీరిందా? కట్నం నిజంగా కోరేది తండ్రో, కొడుకో బోధపడ్డదా?

రత్నాలు: తెలిసింది. ఇంక సెలవు.

(తెర)

పట్నవాసం

(15-వ పేజీ తరవాయి)

తోకని చువ్వ నోటితో పట్టుకో, నేను కొంచెం వెనక్కిపోయి నీకు దారి యిస్తా!" అని మామ హెచ్చరించాడు.

అతి కష్టంమీద బాలుడు బయటపడ్డాడు.

మరో క్షణం మిగిలినవాళ్ళంతా బాలుడి చుట్టూ చేరి వాణ్ణి పొగడసాగారు. "ఎంత ధైర్యం, గలవాడివిరా!... ఇంకోళ్ళయితే బయటికి రాలేకపోదురు."

బాలుడు గప్పాలు కొట్టాడు.

"ఇంకాస్సే పుందామనుకున్నా, మామ వచ్చి అంతా పాడుచేశాడు. మీ రంతా రారేమో, హాయిగా అందులోనే పడుకుని నిద్దరపోదామనుకున్నా. అందులోనుంచి చూస్తుంటే మీ రంతా జైల్లో ఉన్నట్టు కనపడ్డారు నాకు!"

వాడి ప్రతిమాటకూ మిగిలినవాళ్ళంతా ఒకటే ఆనందించటం. వాళ్ళనూ, వాళ్ళ మాటలనూ చూస్తున్నకొద్దీ మామ కేదో చెప్పరాని వికారం విరక్తి నీరసం కలగసాగాయి. ఆయన ఎటో తెలియకుండా అక్కణ్ణుంచి బయలుదేరాడు...

బోనులోపడిన ఎలుక తప్పించుకుపోవటం అందరూ అనుకున్నంత అపూర్వం కాదు. కాని ఆ యింటివాళ్లు మర్నాడు అటకమీదినుంచి బోను తీసి అందులో ఎలుక లేకుండానే రొట్టెముక్క మాయమయినందుకు ఎన్నోసార్లు ఎంతోమందికి విడ్డూరంగా చెప్పుకున్నారు.

"తస్సదియ్యా! ఈ పట్నంఎలుకలు ఎన్ని విద్యలు నేర్చాయో! వీటెక్కూడా పట్నంనీళ్లు వంటబట్టాయన్నమాట!" అని వాళ్లు విసుగు లేకుండా ఆశ్చర్యపడ్డారు...

సైతుమామ తన ఇల్లు చేరుకునేటప్పటికి బాగా అంత పొద్దెక్కింది.

"నిన్నల్లా అవుపించకనే పోతివి. ఎక్కడికెళ్లావు మామా?" అని చాలా మంది పలకరించారు

"పట్నం వెళ్ళా!" అని వాళ్లందరికీ మామ సమాధానం చెప్పాడు.


"ఎట్లాఉంది పట్నం జీవితం?"

"ఆఁ, మనవాళ్లు ఆత్మహత్య చేసుకునేటందుకు రకరకాల విద్యలు నేరుస్తున్నారు." అన్నాడు మామ.

ఇంతకంటె ఆయన ఎవరికీ పట్నం గురించి ఏమీ చెప్పలేదు.

[అయిపోయింది.

డిటెక్టివ్ సీరియల్:



8

మాధవరావు గదిలో కూచుని ఆలోచిస్తున్నాడు. రాత్రిపదిగంటలౌతుంది. డాక్టరుమూర్తి పని ముగించుకుని వచ్చాడు. రాగానే సంభాషణ ప్రారంభించాడు.

"దుర్గయ్యగారు హత్య చెయ్యలేదని మీ కెలానమ్మకం ప్లీడరుగారూ? ఆయనకి భార్యపైన పట్టరాని కోపం ఉన్నదని అందరికీ తెలుసును. మీ రెలా కాదనగలరు? కాదంటే ఎవరు నమ్ముతారు?"

"ప్రమేయంలేని విషయాల్ని గురించి నలుగురూ నాలుగు విధాల చెప్పుకోడం మామూలే. కాని అవి అన్నీ మనం నమ్మితే మన పనెల్లా సాగుతుంది? దుర్గయ్యగారు హత్య చెయ్యలేదనుకోడానికి తగిన ఆధారాలున్నాయి. కాని అది నిరూపించాలంటే కష్టంగా ఉంది. ఆయన మేనగోడలైనా నాకు పూర్తిగా అన్ని విషయాలూ చెప్పటంలేదు. ఆమె ఎందుకో కొన్ని అంశాల్ని దాస్తున్నది."

"దుర్గయ్యగారు అంతు పెట్టాడేమో"

"ఉహు. ఆ అంశాలు దుర్గయ్యగారికి కూడా పూర్తిగా తెలియవు. దుర్గయ్యగారు నిర్దోషి అని నిరూపించడానికి గాని, హంతకుడెవరో కనిపెట్టడానికిగాని ఆ అంశాలు తెలుసుకోవటం అవసరం. మొదటినుంచీ పోలీసులు తప్పుదారి పట్టడానికి కమల సాక్ష్యం, సత్యనారాయణ సాక్ష్యమూ కారణాలు."

"కమల అట్లా ఎందుకు దాస్తున్నదంటారు?"

"అదే నాకూ అర్థంకావటంలేదు. నాకు ఒక్క విషయం గట్టిగా తెలుసును. దుర్గయ్యగారి ఆస్తిని చేజిక్కించుకోవాలని ఎత్తువేసినవాళ్ళే ఈ హత్యచేశారు. ఈ కుట్రతో సత్యనారాయణకి దుర్గయ్యగారి బావమరిది రామనాథం, అంకరాజు చేసిన కుట్రతో సంబంధంవుంది."

"అయితే వాళ్ళలో ఎవరో ఒకరు చేసి ఉండాలన్న మాట."

"అలా అనుకోడానికీ ఆధారం కనిపించదు. దుర్గయ్యగారు పడుకున్న గదికి కమల తాళం వేసింది. హాల్లో అలమారుకి తాళం వేసింది. తాళంచెవులు ఆమె గదిలో డ్రాయర్లో ఉన్నాయి. ఆమె పడుకున్న గదికి లోగడియ వేసి ఉంది. అందువల్ల దుర్గయ్యగారు కానివాళ్లు కాని హత్యచేశాడనుకోడం పొరపాటు. కత్తి అలమారులోనుంచి ఎల్లావచ్చింది? తరవాత దుర్గయ్యగారి గదిలో తలగడకింది కెలా వెళ్లింది? కమల గదిలో తాళంచెవులు ఎల్లా బయటికొచ్చాయి?"

"అంటే కమలేనా చేసివుండాలి. లేక కమల మద్దతుతోనే ఎవరో చేసి వుండాలన్న మాట."

"అదిసరికాదు. ఆ రోజు ఉదయం నేను అక్కడే వున్నాను. దుర్గయ్యగారినీ, కమలనీ కనిపెడుతూనే వున్నాను. ఇద్దర్ని గురించీ నాకు అటువంటి అనుమానం లేదు.

"కమలకి తెలియకుండా తాళంచెవులు ఎవరైనా దొంగిలించి వుంటారా?"

"అది వీల్లేదు. ఆమె తనగది కిటికీలు, ద్వారాలుకూడా మూసేసింది. దొంగతనం జరిగితే జరిగినట్లు తెలిసిపోతుంది."

"ఏదో మాయగా వుంది ప్లీడరుగారూ"

"అంత మాయకూడా లేదులెండి, నేనొక విషయం కనిపెట్టాను. నేనుకనిపెట్టినదానికి ఇన్స్పెక్టర్ నరసయ్యకూడా సాక్ష్యం ఉన్నాడు. కమలని రహస్యంగా పిలిచి, అటువంటిదే మరొక కత్తి తెచ్చి అలమార్లో పెట్టమన్నాను. బజార్లో అలాటి కత్తి కొని తెచ్చింది. అది సరిగ్గా మొదటి కత్తి మాదిరిగానే వుంది. నే చెప్పినట్లు అలమార్లో పెట్టి తాళంవేసింది. ఎప్పటి మాదిరిగా అలమారు తాళం చెవులు తనగదిలో డ్రాయర్లో పెట్టుకుంది. మర్నాడు ఉదయం నేను అక్కడికివెళ్లాను ఇన్స్పెక్టర్ కూడా ఆవేళకి అక్కడికొచ్చాడు. నేను ఈ ఎత్తువేసి కమలకి ఈ విధంగా చెప్పినట్లు పోలీసులికి తెలిసేలా చేశాను. ఆ అనుమానంతోనే ఇన్స్పెక్టర్ వచ్చాడు. ఇద్దరం చూస్తుండగా కమల అలమారు తెరిచింది. కత్తిఅక్కడలేదు తరవాతపోలీసులు ఆచోకీతీసి కమల రెండోకత్తిని బజార్లో కొన్నట్లు తెలుసుకున్నారు. దాన్నిబట్టి నేరనిరూపణలో నేను కలగచేసుకుని అక్రమమైన చర్యలకి దిగుతున్నానని కూడా వాళ్లు అనుమానించారు. నేను కమలని అడిగాను. కత్తి అక్కడపెట్టినట్లు చెప్పింది. కాని అది ఎల్లా మాయమయింది? తరవాత కమలకి తెలియకుండా నేను టేబిల్పైన చూశాను. కత్తి పూలకుండు కిందవుంది,"

"అది అక్కడికెల్లా వెళ్ళిందంటారు?"

"అది కమలే అక్కడ పెట్టింది. హత్య జరిగినరోజు ఉదయం తాళంచెవులకోసం కమల వెతికినప్పుడు, అవీ ఆ కుండుకింద నే ఉన్నాయి. నేను అలమారువంక చూస్తున్న సమయంలో కమలగభాల్న కుండుఎత్తి

తాళంచెవులు తీసింది. తీసి అప్పుడుగదిలోకి వెళ్ళి డ్రాయర్లో వెతికినట్లు నటించి-అక్కడే వున్నట్లు తాళంచెవులగుత్తి బైట పెట్టింది."

"ఆ నటించటం అంతా దేనికి?"

"అదే ఆలోచించాను. నాకు ఒక్కటే తోచింది— కమలకికూడా రాత్రివేళ నిద్రలో లేచితిరిగే అలవాటుందని. అలా తిరగడానికి కారణం ఆమెమనస్సులో భయం. కత్తినితీసి తనమామ ఏ అఘాయిత్యం చేసిపోతాడో అనేభయం ఆమెని ఆవహించింది. అలమార్లోనుంచి కత్తి తీసి దాచేస్తే బాగుండునని ఆలోచిస్తూ నిద్రపోయి వుంటుంది. ఆభయం, ఆలోచన నిద్రలో పనిచేశాయి. తనకి తెలియకుండానే నిద్రలో లేచి వెళ్ళి డ్రాయర్లో తాళంచెవులగుత్తి తీసింది. హాల్లో అలమారుతెరిచి కత్తి తీసి మళ్ళీ అలమారుతాళం వేసేసి, తాళం చెవుల గుత్తి, కత్తీ పూలకుండు కింద పెట్టింది. ఇత్తడికుండుకింద అవి దాచడానికి అది తగినంత పెద్దదే. ఈ విషయాల్ని కని పెట్టినవాళ్ళెవరో హత్యచేసివుంటారు"

"అవును. అయితే సత్యనారాయణ ఆ రాత్రి కమలనే చూసివుంటాడేమో? కమలని చూసి దుర్గయ్యగారనుకున్నాడు కాబోలు."

"సరిగ్గా అదే జరిగిందని నా నమ్మకం"

"అయితే సత్యనారాయణే ఈ హత్య చేసి ఉండాలి."

"అదికాదు. అదే అతని వుద్దేశమైతే రాత్రి వేళ దుర్గయ్యగారు అలమారు తెరిచినట్లు పోలీసులికి చెప్పనే చెప్పడు. దాచేస్తాడు."

"దుర్గయ్యగారి మీదికి నేరాన్ని తోసెయ్యడానికి అలా చెప్పివుండొచ్చుగా."

"అట్లా కాదు. సత్యనారాయణ ఆ రాత్రి పార్వతమ్మగారితో కలిసి అంకరాజు ఇంటికి వెళ్ళినట్లు మనకి తెలియక మానదు. రామచంద్రరావుని అంకరాజు ఇంటిదగ్గర కాపలాపెట్టిన విషయం సత్యనారాయణకి తెలుసును. కాబట్టి ఆ విషయం బయటపడక తప్పదని తెలుసును. అది బయట పడుతుందని తెలిసికూడా రాత్రి దుర్గయ్యని చూసినట్లు పోలీసులికి చెప్పాడంటే, తాను చెప్పతున్నది అబద్ధమని పోలీసులు అనుమానించక మానరు. అదీ అతనికి తెలుసు. అది తెలిసికూడా రెండూ తానే పోలీసులికి ఎలా చెప్తాడు? అది అతను ముందు యోచించలేదు. అంటే నేరం చెయ్యాలనే ఉద్దేశం అతనికి లేదన్నమాట. హత్య జరుగుతున్నదని అనుమానించ లేదన్నమాట."

"కాని నేరం అతని మీద స్థిరపడేమాట నిజం"

"కాని నిర్దోషి పైన నేరంమోపడం నా ఉద్దేశంకాదు, అసలు నేరస్థుణ్ని కనిపెట్టాలి."

"అంటే అంకరాజుతో వాళ్లుచేసిన కుట్రకీ, ఈహత్యకీ సంబంధం లేదంటారా?"

"లేకపోలేదు. ఉంది, కాని అది వాళ్లు గ్రహించలేదు. ఒకటిమాత్రం నిజం. ఆ రాత్రి సత్యనారాయణ అంకరాజింటికి వెళ్ళి వెంటనే తిరిగివొచ్చేసి వుంటాడు. వొచ్చేసిన తరవాత అతనికి నిద్రపట్టిన కొద్దిసేపటిలో అలమారువద్ద కమలనే చూసి వుంటాడు. సత్యనారాయణ చెప్తున్నది నిజమై వుంటుంది. సత్యనారాయణ తనరాకపోకల్ని గురించికూడా పోలీసులికి నిన్న చెప్పేశాడు. చెప్పగానే పోలీసులు అంతా రికార్డుచేశారు. నేను సత్యనారాయణ రాకపోకల్ని బట్టి డిఫెన్సుతయారు చేయిస్తున్నానని పోలీసులు కనిపెట్టారు. అది ఎల్లా కనిపెట్టారో ఇంతవరకూ నాకు తెలియదు. అదికనిపెట్టి నా డిఫెన్సుని కూలదొయ్యడానికి ఎత్తువేస్తున్నారు. సత్యనారాయణ ఆ రాత్రి అలమారుదగ్గిర దుర్గయ్యగారిని చూసినప్పుడు టైమ్ పన్నెండుంబావయిందని మొదటి స్టేట్‌మెంట్‌లో చెప్పాడు. ఇప్పుడు ఆ టైమ్‌ఫిరాయించి మూడు గంటలకి చూసినట్లు చెప్పమంటున్నారు. సత్యనారాయణ ఆ ప్రకారం చెప్తున్నాడు. రాత్రికాబట్టి చిన్నముల్లు పన్నెండు మీదుందో, మూడు మీదుందో కనిపెట్టలేక పొరపడినట్లు చెప్తున్నాడు. డాక్టర్ల పరీక్షప్రకారంకూడా హత్య జరిగినది మూడుగంటల ప్రాంతాలనేనని రుజువయింది."

"డాక్టర్ల పరీక్షకేమి లెండి ఇట్టే మార్చవచ్చు."

"అల్లా కాదు. ఈ రెగ్యులేవీ తెలియక ముందే డాక్టర్లు పరీక్షచేసి ఆమాట చెప్పారు. వాళ్లు చెప్పినది కూడా సరైవుంటుందని నావుద్దేశం."

> **తమాషాప్రశ్నల జవాబులు**
>
> (1) గంటకి $1\frac{1}{2}$ మైళ్లు వేగంతో ప్రవహిస్తున్నది.
>
> (2) గూడ్సుబండి పొడుగు 66గజాలు.

"ఇంక అయితే హంతకు డెవరో కనిపెట్టేది ఎల్లా? దుర్గయ్యగారు చిక్కుకోడం తప్పదన్నమాట. రేపేగా విచారణ ప్రారంభం?"

"అవును రేపే ప్రారంభం. హంతకుడెవరో కూడా రేపే తేలాలి."

"అదెల్లా?"

"నేను అనుమానించినది నిజమైతే, రేపు తేలిపోవడమే కాదు హంతకుడు ఎరెస్టు కావాలి కూడా. అందుకే ఈ రాత్రికి ఇన్స్పెక్టర్ని ఇక్కడికి రమ్మన్నాను. రేపు ఉదయమే మేజస్ట్రేట్‌తో కూడా మాట్లాడాలి."

తరవాత ఇద్దరూ నిశ్శబ్దంగా కూచున్నారు. హంతకుడు ఎవరై వుంటాడో డాక్టర్ మూర్తి ఆలోచించడం మొదలెట్టాడు. కాని ఏమీ పాలుపోలేదు.

మాధవరావు దగ్గిర సెలవు తీసుకుని ఇంట్లోకి వెళ్లిపోయాడు.

నేటిప్రపంచం

(8-వ పేజీ తరువాయి)

తీర్మానాన్ని రష్యా వీటో చేసి ఎగరకొట్టేసింది. అమెరికన్ సేనలు వెళ్ళిపోవాలన్న చీనా కమ్యూనిస్టు ప్రతినిధుల తీర్మానాన్ని ఆంగ్లో-అమెరికన్ వర్గం తోసిపారేసి చెల్లిప్పాయి. చీనా ఎంతవరకు బెదురుతుందో లోకం అంతా ఏమనుకుంటారో కనిపెట్టడానికన్నట్లు అమెరికన్ అధ్యక్షుడు ట్రూమన్ చీనాసేనలపైన ఏటంబాంబు వేసేవిషయం ఆలోచనలో వుందనీ, అది అవసరమో, అనవసరమో మేకార్థర్ కే తెలియాలనీ ప్రకటించాడు. దీంతో బ్రిటిష్ వాళ్ళకి యూరోపియన్లకి హడలు పుట్టింది. అమెరికన్ విమానాలూ, బాంబులూ, ఏటంబాంబులూ, టాంకులూ, నౌకలూ చీనాలో చిక్కుపడిపోతే ఇంక స్టాలిన్ యూరప్ నంతనీ ఇట్టే నంచుకుంటాడని భయపడ్డారు. చీనాతో యుద్ధం సంభవించకుండా ఎలాగైనా అది నివారించాలని బ్రిటన్, ఫ్రాన్సు మొదలైన దేశాలు పట్టుబడుతున్నాయి. అపజయం పొందిన రోషంతో అమెరికా చీనాపైన యుద్ధానికి కాలుదువ్వుతోంది. సమితి సర్వసభ్య సమావేశంలో తమ తీర్మానాన్ని తిరిగి ప్రవేశపెట్టడానికి అమెరికా సిద్ధపడుతోంది. ఈ తీర్మానాన్ని బ్రిటన్ మొదలైనదేశాలు ప్రతిఘటించగలవో లేదో చూడవలసిందే. ఈ తీర్మానం తేలేలోపల "మ్యూనిక్ తెలివి," "ఛేంబర్లేన్ గొడుగు" మొదలైన తిట్లు తినడానికి సిద్ధపడి కూడా ఏ దేశమైనా రాజీ కుదర్చడానికి ప్రయత్నించదా అని అమెరికన్ల నమ్మకం. అంటే, ఇప్పుడు చావుదెబ్బలు తింటున్నందువల్ల ఇప్పటికి రాజీ కుదిర్చినట్లయితే, ఎలాగూ ముందుముందు రావలసిన ప్రపంచయుద్ధంలో వీళ్ల భరతం పట్టించవచ్చునని వీరి ఊహ.

కోరేది ప్రపంచ యుద్ధం

యూరప్ని రక్షించాలంటే అమెరికా తన బలాన్ని ఆసియా యుద్ధాలలో నష్టపరచకూడదని చర్చిల్ అన్నాడు. యూరప్లో యుద్ధానికి సిద్ధపడాలని ఆయన సూచిస్తున్నాడు. ఇప్పుడు చీనాతో యుద్ధం చెయ్యకూడదు అంటే అర్థం ప్రపంచయుద్ధాన్ని నివారించాలని ఆయన అభిప్రాయం కాదు. పశ్చిమ యూరప్ పూర్తిగా బలపడేవరకూ స్టాలిన్ని కొంచెం తమాయించమని అడుగుతున్నాడన్నమాట. అమెరికన్లు బ్రిటిష్ వాళ్ళు ప్రచారం చేస్తున్నట్లు స్టాలిన్ చేతిలో చైనా కీలుబొమ్మ అయితే, చర్చిల్ కోరిన సదుపాయానికి ఎలా ఒప్పుకుంటాడు? పశ్చిమ యూరప్కి ఆయుధసామగ్రి ఇచ్చి, తన నాయకత్వం కింద అట్లాంటిక్ మహాసైన్యాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్న అమెరికా తన ఆశయం కమ్యూనిజాన్ని మట్టుపెట్టడమేనని చెప్పుకుంటూనే వుంది. ఇప్పుడు ప్రపంచసంగ్రామాన్ని నివారించాలనీ, చీనాతో యుద్ధానికి దిగడం తమకిష్టం లేదనీ వాగ్దానాలు చేస్తే వినే కమ్యూనిస్టు లెవరు? స్టాలిన్ తన బుర్ర బద్దలుకొట్టించుకోవాలనే ఉదారబుద్ధి కలవాడైతే, తప్పకుండా అమెరికా, బ్రిటన్ మొదలైన దేశాలు చెప్పిన ప్లాన్కి, అనగా పశ్చిమయూరప్ సైన్యాల్ని నిర్మించుకునేవరకూ కొరియా ఇండోచీనా, మలయాలలో యుద్ధం చెయ్యకుండా ఉంటేవాడే. కాని స్టాలిన్కి అలాటి ఉదారబుద్ధి ఉండడం అసంభవం — చర్చిల్ కీ, ట్రూమన్ కీ ఉన్నదేమో తెలీదు. ఇంకోటి ఏమిటంటే ఆ ప్రాంతాల్లో యుద్ధం చేస్తున్నది స్టాలిన్ కాదు, రష్యన్లు కాదు.

శృంగభంగం


"మొట్టగలిగే వాళ్లు మొట్టిచెప్పినప్పుడే ఆసియా వాసులు వింటారు కాని హేతువాదం ఎన్నడూ వినరు" అన్నాడు మెకార్థర్. కాని మొట్టినా వినలేదు సరికదా ఎదురు అతని తలే బొప్పికట్టింది. వందలాది కొరియన్ కమ్యూనిస్టుల శవాల్ని చూసి తన కళ్లు చల్లబడినాయని చెప్పిన మెకార్థర్ కి, తన సేనలు నిలవలేక చచ్చినవారు చావగా, మిగిలినవారు కాలికి బుద్ధిచెప్పడంచూస్తే కాళ్లూ, చేతులూ చల్లబడివుండాలి ఇంక కొరియాలో కొత్తయుద్ధం ప్రారంభమయిందనీ, రాజనీతిజ్ఞులూ, ప్రభుత్వాలూ పరిష్కరించవలసిందే కాని యుద్ధంవల్ల పరిష్కారం కాదనీ మెకార్థర్ భద్రతామండలికి నివేదిక పంపాడు. ఉత్తర కొరియాసరిహద్దు దాటవద్దని నెహ్రూ చేసిన హెచ్చరికను పెడచెవిని పెట్టినప్పుడు ఆ సమస్య కేవలం మిలిటరీసమస్య అనీ, కాబట్టి దాన్నిగురించి నెహ్రూకి ఏం తెలుసుననీ మెకార్థర్ చిన్న చూపు చూశాడు. ఇంతవరకూ ఆసియావాసుల వ్యవహారాలతో లగాటమాడి, వారిని బానిసలుగా పరిగణించిన ఆంగ్లో-అమెరికన్ దేశాలకే ఇది శృంగభంగం. ఆసియాను సంరక్షించవలసిన బాధ్యత అంతా తమపైనే ఉన్నట్లు చెప్పుకుంటూ వ్యాపార స్వాతంత్ర్యమిష తో పీడించుకు తింటున్న ఈ దేశాలకు ఇంకా ప్రపంచాన్ని చిటికెనవేలిమీద నిలబెట్టడానికి ప్రయత్నించే ధీమా చావలేదు. అయితే అది యూరప్ నుంచి ఇప్పుడు అమెరికాకు సంక్రమించింది. యూరోపియన్లకి రెండో ప్రపంచ యుద్ధంతోనే తమ సత్తా తేలిపోయింది. అమెరికాకు మూడో ప్రపంచయుద్ధం అక్కరలేకుండా కొరియాయుద్ధంతోనే అనుభవం కావలసింది. కాని గుడ్డితనం ఇంకా వదల్లేదు. రెండో ప్రపంచ యుద్ధంలో ఆసియాలో ప్రారంభమైన సామ్రాజ్య వ్యతిరేకోద్యమాలు కేవలం ఆంగ్లో-అమెరికన్ వర్గాల అవివేకంవల్లనే కమ్యూనిజానికి బలాన్ని చేకూర్చాయి. ఈ దెబ్బతో శ్వేతజాతుల గర్వాంధకారం వొదిలిపోయిఉండవలసింది. కాని పూర్తిగా సత్తువ ఉడిగేవరకూ వొదిలే సూచనలు కనిపించడంలేదు.

చేంబర్లేన్ గొడుగు


ఈ పరిస్థితిలో ప్రపంచాన్ని యుద్ధంనుంచీ, మెకార్థర్ సేనల్ని చీనా సేనల బారినుంచీ కాపాడ్డానికి అట్లీ చేంబర్లేన్ గొడుగు పుచ్చుకుని వాషింగ్టన్ బయలుదేరాడు. కాని ప్రపంచయుద్ధాన్ని పూర్తిగా నివారించాలని కాదు. కొరియాలో చీనాసేనలతో అమెరికన్లయుద్ధం ప్రపంచయుద్ధంగా గాని, చీనా అమెరికాలమధ్య యుద్ధంగా గాని పరిణమించకుండా ఉపాయం చెప్పడానికి మాత్రమే. ఒక విధంగా చూస్తే బాంబుల తయారీ, ఏటంబాంబుల తయారీ మరీ పెరిగిపోకముందే ఈ ప్రపంచయుద్ధం వచ్చేస్తే మంచిదనిపిస్తుంది. ఇప్పుడు చీనాలో మాని, ఉత్తరోత్తరా యూరప్లో యుద్ధం ప్రారంభించినా, ఆసియాలో యుద్ధం ఎలాగూ తప్పదు. కాబట్టి ఆ దీపావళేదో పూర్ణిమనాడే ముగిస్తే మంచిది.

ప్రపంచయుద్ధాన్ని నివారించడమే అగ్రరాజ్యాల అసలు ఉద్దేశమైతే నెహ్రూ చెప్పినట్లు ఉభయపక్షాలూ బహిరంగంగా పడతిట్టుకోరు అది ఎప్పుడు ఎక్కడ జరగాలి అనేవిషయంపైన స్టాలిన్ కీ, ట్రూమన్ కీ, అట్లీకీ, చర్చిల్ కీ మధ్య అభిప్రాయభేదాలున్నాయి అంతే. ఎక్కడో ఒక చోట యుద్ధం తప్పదని అందరికీ ఏకాభిప్రాయం ఉంది. అగ్రరాజ్యాలు అంత ఏకీభావంతో ప్రపంచయుద్ధంకోసం తహతహలాడుతుండగా, నివారించడంకోసం మధ్యవర్తిత్వాలు నెరపదలుచుకున్న వారికి, ఛేంబర్లేన్ గొడుక్కి పట్టిన గతి తథ్యం.

— [సూర్యనారాయణ]




కమ్యూనిస్టు చీనా ప్రతినిధులు ట్రిగ్వీలీకి ఆయన కార్యాలయంలో తమ అధికార పత్రాలను సమర్పించు చుండుట. వూ హెక్, జనరల్ వూ సియూ చువాన్ (నాయకుడు), ట్రిగ్వీలీ, చియావో కువాన్ హువా (సలహాదారు), కుంగ్ వూ పెంగులు వరుసగా నున్నారు.



ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రానికి సలహాసంఘంగా నియమితులైన ప్రముఖులు, డాక్టర్ సి. హెచ్. నారాయణరావు, యం. వి. రాజగోపాల్, బి. యస్. మూర్తి, జి. వి. రెడ్డి, ప్రొఫెసర్ విస్సా అప్పారావు, కాటూరి వెంకటేశ్వరరావు, బాలా త్రిపురసుందరమ్మగార్లు.

Regd. No. M. 4479



Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChetty St, Madras.